ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 25.08.2026 | సంపుటి : 13 సంచిక : 36 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV


హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## దివ్యాంగులకు కళ్యాణలక్ష్మి ఓకే..

**వారికి సాయం కొనసాగించొచ్చు : హైకోర్టు**

**రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట**

హైదరాబాద్,ఆగస్ట్24(జనంసాక్షి): తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.






## తెలంగాణ అభివృద్ధికి కేంద్రం మోకాలడ్డు

**ఉద్దేశపూర్వకంగానే అమెరికా పర్యటన అడ్డుకున్నారు**

- రాష్ట్రానికి పెట్టుబడులను అడ్డుకునే కుట్ర
- గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మోడీ
- సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని వ్యవహారం
- మోదీ పాక్ వెళ్లొచ్చు.. మేం అమెరికా వెళ్లకూడదా?
- భాజపా నేతలు నా పర్యటనపై తప్పుదోవ పట్టించారు!
- 'రాజకీయ కారణం' అంటే ఏమిటి?
- అమెరికా టూర్ రద్దును ఊరికే వదలబోం
- పార్లమెంటులో కాంగ్రెస్ ఖచ్చితంగా నిలదీస్తుంది
- నన్ను అడ్డుకున్నా..నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ మండిపాటు

హైదరాబాద్,ఆగస్ట్24(జనంసాక్షి): పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు. అయితే అందుకు విరుద్దంగా కేంద్ర విధానాలు ఉన్నాయని అన్నారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లండన్ నుంచి తిరిగి వచ్చిన తరవాత సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్

మిగతా 2లో..

> వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారు. పెట్టుబడుల కోసం గుజరాత్ సీఎం అమెరికాలో 8 రోజులు పర్యటించారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి, తెలంగాణ సీఎంను ఎందుకు అడ్డుకున్నారు. తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని కేంద్రం, మోదీ పదేపదే ప్రదర్శిస్తోంది. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకునేందుకు కుట్ర చేశారు. నన్ను అడ్డుకోవటం, గుజరాత్ ఆధిపత్యానికి నిదర్శనం. రాజకీయ వివక్షతో తెలంగాణను మోదీ అడ్డుకుంటున్నారు. కేంద్రం వైఖరిపై రాష్ట్ర బీజేపీ నేతలు నోరెత్తకపోవటం మరింత అవమానం
> - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

## సెప్టెంబరు 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- కొండా సురేఖ వ్యవహారం పార్టీ అధిష్టానం చూసుకుంటుంది : సీఎం రేవంత్ రెడ్డి
- ఈ అంశంపై ఇకపై ఎవరూ మాట్లాడొద్దు
- అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సీఎం సూచన



వార్త 2 లో

## '22ఏ'పై ప్రజలకు ఆందోళనొద్దు

**ఈ భూముల అంశంలో భయపడాల్సిన అవసరం లేదు**

**వారికి న్యాయం చేస్తాం: మంత్రి పొంగులేటి**

హైదరాబాద్(జనంసాక్షి):22ఏ భూముల అంశంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని.. వారికి న్యాయం చేస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రతి సోమవారం జిల్లా అధికారులతో దీనిపై సమీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు."22ఏ జాబితాలోనివి, వివిధ ఆర్డర్లలో ఉన్న వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. రిలాక్సేషన్ వచ్చిన వాటిని క్లియర్ చేశాం. మేడ్చల్‌లోని భూదాన్ భూముల్లోని వాటిని తిరస్కరించాం. ఈనెల 18 నుంచి టోల్‌ఫ్రీ నంబర్‌కు 1162 కాల్స్ వచ్చాయి. టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చిన కాల్స్‌ను జిల్లాల వారీగా పంపించాం. ప్రైవేటు ఆస్తులవి కాకుండా ప్రభుత్వ ఆస్తుల సమస్యలే ఎక్కువ. 22ఏకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన వాటిని 24 గంటల్లో క్లియర్ చేశాం. ఎక్కడైనా ఒకట్రెండు ఆగిపోతే పరిష్కరిస్తాం.. ఆందోళన అవసరం లేదు" అని పొంగులేటి తెలిపారు.




### బంగాళాఖాతంలో అల్పపీడనం..

## తెలంగాణకు భారీ వర్షసూచన

హైదరాబాద్(జనంసాక్షి):బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఈ అల్పపీడనం ప్రభావంతో తెలంగాణ లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. వాతావరణ

మిగతా 2లో..

## సింగరేణిని కాపాడుకుంటాం లాభాల బాటలో నడిపిస్తాం

**ఎన్‌టీపీసీ స్థాయిలో సింగరేణిని నిలబెట్టడమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం**

- సంస్థ ఉజ్వల భవిష్యత్తు కోసం క్రిటికల్ మినరల్స్ వైపు అడుగులు
- బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, లిథియం మైనింగ్‌లోకి..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రానికి ఆత్మలాంటి అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు కూడా లాభదాయక సంస్థగా అందించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. సింగరేణి ఉజ్వల భవిష్యత్ కోసం దిశా నిర్దేశం చేస్తూ కంపెనీ మనుగడకు కీలకమైన బొగ్గు బ్లాక్‌లు సాధించడంలో సంపూర్ణ సహ కారం అందిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లుకు సింగరేణిలోని గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు బ్లాక్‌లను తీసుకోకపోవడం, ఉన్న గనులను మూసివేయడం వల్ల సింగరేణికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఐదారు సంవత్సరాల్లో సంస్థ మూతపడే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రులు గట్టి పట్టుదలతో నైని కోల్ బ్లాక్‌ను సాధించామని చెప్పారు. 2013లో యూపీఏ ప్రభుత్వం సింగరేణికి రీ-అసైన్ చేసిన తాడిచర్ల-2 కోల్ బ్లాక్

మిగతా 2లో..

### కొండా సుష్మిత వ్యవహారం..

## కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం

**సోషల్ మీడియాతో బతికేస్తున్న కేటీఆర్:మహేశ్ కుమార్**



మెదక్,ఆగస్ట్24(జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఏఐసిసికి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు

మిగతా 2లో..

## ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు..

- మహిళలకు తమిళ సీఎం విజయ్ వరాలు
- ట్రాన్స్ జెండర్లకు కూడా ఉచిత బస్సు సౌకర్యం

వార్త 2 లో

## కేంద్రం హామీలన్నీ విస్మరించింది

- సెప్టెంబర్ 5న దిల్లీలో భారీ నిరసన ర్యాలీ
- కాక్రోచ్ జనతా పార్టీ మరో కీలక ప్రకటన



న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర ప్రభుత్వం తీరుపై కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పరీక్షల్లో అవకతవకలు, నీట్ పేపర్ లీక్ అంశాలపై తమ 36 రోజుల ఆందోళనను విరమించే సమయంలో ఇచ్చిన హామీల్ని అమలు చేయట్లేదని ఆరోపించింది. ఈ క్రమంలోనే మరోసారి ఆందోళనకు సిద్ధమైంది. సెప్టెంబర్ 5న దిల్లీలో భారీ నిరసన ర్యాలీ (ప్రొటెస్ట్ మార్చ్) నిర్వహించనున్నట్లు సోమవారం రోజు ప్రకటించింది. టీచర్స్ డే (ఉపాధ్యాయుల దినోత్సవం) సందర్భంగా జరగనున్న ఈ మార్చ్ ఇండియా గేట్ నుంచి దిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు కొనసాగుతుందని సీజేపీ తెలిపింది. ప్రభుత్వం చర్చల్ని ఆలస్యం చేస్తోందని, స్పష్టమైన హామీలు ఇవ్వకుండా తప్పించుకుంటోందని ఆరోపించింది. కేంద్రం ఇస్తామని చెప్పిన లిఖితపూర్వక హామీ కూడా ఇప్పటికీ అందలేదని, తమ సహనాన్ని బలహీనతగా భావించొద్దని సీజేపీ ఈ సందర్భంగా హెచ్చరించింది. ఈ ర్యాలీకి ఆందోళన సమయంలో ప్రాణాలు కోల్పోయిన నీట్ అభ్యర్థుల కుటుంబాలు ముందుండనున్నాయని సీజేపీ వెల్లడించింది. నీట్ పరీక్ష రద్దు, అనంతరం నిర్వహించిన రీ- ఎగ్జామ్ పరిణామాల నేపథ్యంలో కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, వారి కుటుంబాలతో పాటు జులైలో జరిగిన ఆందోళనల సమయంలో పోలీసుల దాడికి గురైన విద్యార్థులు, యువత ముందు వరుసలో నాయకత్వం వహిస్తారని పేర్కొంది. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు, యువత ఈ శాంతియుత ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. సీజేపీ నేషనల్ వర్కింగ్ కమిటీ సోమవారం నిర్వహించిన సమావేశంలో

మిగతా 2లో..

### జంతర్ మంతర్ నిరసన ప్రొటెస్ట్

## మహిళా ఫిర్యాదులకే మొదటి ప్రాధాన్యత

**విచారణ కమిటీకి సీజేఐ ఆదేశం**

2లో..

### పాలిటెక్నిక్ విద్య ఆధునీకరణకు

## ఉన్నతస్థాయి కమిటీ

- విద్యార్థుల విద్యా, కెరీర్ ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు
- కమిటీ చైర్మన్‌గా కేశవరావు.. సభ్యులుగా కోదండరాం, శాంతా సిన్హా తదితరులు

హైదరాబాద్(జనంసాక్షి):పాలిటెక్నిక్ విద్యను ఆధునీకరించడంతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, ఇతర భాగస్వాముల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన (ఎస్‌పీఎల్‌ఏ) శాఖ సోమవారం జీవో ఆర్‌టీ నంబర్ 1239ను జారీ చేసింది. ప్రస్తుత విద్యా విధానానికి, పరిశ్రమ అవసరాలకు మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (ఐవైఐఎస్‌యూ)ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పరిశ్రమ ఆధారిత పాఠ్యాంశాలు, ఆన్-ది-జాబ్ శిక్షణ, ఆధునిక ప్రయోగశాలలు, ఇంటర్న్‌షిప్‌లు,

మిగతా 2లో..

## భారతీయ విద్యార్థులు, నిపుణులకు అమెరికా షాక్!

**హెచ్-1బీ, ఎఫ్-1 ఓపీటీ ప్రోగ్రామ్‌కు కొత్త ఫీజులు విధించేందుకు చర్యలు ప్రారంభం**




వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికాలో చదువు, ఉపాధి అవకాశాల కోసం చూస్తున్న భారతీయ విద్యార్థులు, నిపుణులకు మరో షాక్ ఇచ్చేందుకు ట్రంప్ సర్కార్ సిద్ధమైంది. హెచ్-1బీ, ఎఫ్-1 ఓపీటీ ప్రోగ్రామ్‌కు కొత్త ఫీజులు విధించేందుకు చర్యలు ప్రారంభించింది. యూఎస్ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఇందుకు సంబంధించిన చర్యలు ప్రారంభించిందని న్యూయార్క్‌కు చెందిన ఇమిగ్రేన్ సంస్థ ఫ్రాగోమెన్ పేర్కొంది.కొన్ని రకాల హెచ్-1బీ పిటిషన్లు, ఎఫ్-1 ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లపై కొత్త రుసుములను విధించే నిబంధనల ప్రక్రియను డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ ప్రారంభించినట్లు ఫ్రాగోమెన్ తెలిపింది. తుది నిబంధనలు అధికారికంగా ప్రచురితమవ్వాల్సి ఉంది. దాంట్లో ఫీజు మొత్తం, ఏయే వర్గాలపై దీని ప్రభావం ఉంటుందనే వివరాలు తెలుస్తాయి. అయితే, ఓపీటీ దరఖాస్తులకు లక్ష డాలర్ల ఫీజు తీసుకొచ్చే యోచనలో ట్రంప్ సర్కారు ఉన్నట్లు సమాచారం.అంతర్జాతీయ విద్యార్థులు డిగ్రీ పూర్తయిన తర్వాత అమెరికాలో పని అనుభవం పొందేందుకు ఓపీటీ కీలకం. దీనిపై 1 లక్ష డాలర్లు.. అంటే మన కరెన్సీ ప్రకారం సుమారు రూ.95 లక్షలు

మిగతా 2లో..

## ఇరాన్‌పై ఆర్థిక దాడి మొదలైంది



**ఆ దేశంతో ఆట చివరికి వచ్చింది**

**యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన**

వాషింగ్టన్,ఆగస్ట్24(జనంసాక్షి): ఇరాన్‌ను ఒంటరిచేయడమే లక్ష్యంగా ఆ దేశంపై ఆర్థిక యుద్ధానికి సిద్ధమైంది అమెరికా. టెహ్రాన్‌కు సాయం చేసే దేశాలపై కఠిన ఆంక్షలు విధించనుంది. ఈ పరిణామాల వేళ అగ్రరాజ్య ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఆట చివరికొచ్చిందని, ఇక ఆ దేశానికి ఆర్థిక వినాశనమేనని వార్నింగ్ ఇచ్చారు. ఈ మేంకు 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలపై మేం గట్టి దెబ్బకొట్టాం. ఆ దేశ సైనిక ఫ్యాక్టరీలను 100శాతం ధ్వంసం చేశాం. అణు కార్యక్రమాన్ని సమాధి చేశాం. ఇక ఆట చివరికొచ్చింది. ఏ శత్రువుపైనా ఇప్పటివరకు చేపట్టని అతి పెద్ద ఆర్థిక యుద్ధాన్ని ప్రారంభిం చబోతున్నాం. భద్రతా హామీల ముసుగులో ఇన్నాళ్లు ఇరాన్ బెదిరింపులు చేస్తూ మనుగడ సాగించింది. అమెరికా తమనేమీ చేయలేదని భావించింది. కానీ, ఇప్పుడు ట్రంప్. హయాంలో ఆ శకం ముగిసింది.

మిగతా 2లో..

## అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్కచుక్క చమురును కూడా సరఫరా కానివ్వం

**ఇరాన్ మరోసారి ఘాటు హెచ్చరికలు**

## వెంటిలేటర్ పేలి..

- ఆస్పత్రిలో అగ్నిప్రమాదం
- ముగ్గురు నవజాత శిశువుల మృతి

### మరాఠీ భాష ఎఫెక్ట్..

## ముంబయిని వీడుతున్న ఆటో డ్రైవర్లు..

## గినియాలో ఘోరం

**డంపింగ్ యార్డు కూలి 30 మంది మృతి**

## ఇంజనీరింగ్ విద్యార్థికి ఉగ్రలింకులు

**అరెస్ట్ చేసిన ఎన్ఐఏ**

వివరాలు 2 పేజీలో..

## పాలిటెక్నిక్ విద్య ఆధునీకరణకు

# ఉన్నతస్థాయి కమిటీ

అప్రెంటిస్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలకు మెరుగైన మార్గాలను కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం.ఈ నేపథ్యంలో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను కూడా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం గతంలో 2026 జూన్ 16న జీవో ఎంఎస్ నంబర్ 97 జారీ చేసింది. పాలిటెక్నిక్ విద్యలో మౌలిక వసతులను బలోపేతం చేయడం, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడం, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్ అవకాశాలను మెరుగుపరచడం, విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది.అయితే ప్రతిపాదిత మార్పులపై విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, ఇతర భాగస్వాముల నుంచి పలు అభ్యంతరాలు, ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుత డిప్లొమా వ్యవస్థ, అకడమిక్ ప్రోగ్రామ్‌లు, ఈసెట్/ప్రత్యామ్నాయ ప్రవేశ అవకాశాలు, ఫీజు నిర్మాణం, ఉద్యోగుల సర్వీస్ నిబంధనలు, సంస్థల గుర్తింపు, ప్రస్తుత సాంకేతిక విద్యా సంస్థల పాత్ర తదితర అంశాలపై సందేహాలు వ్యక్తమయ్యాయి.ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని పాలిటెక్నిక్ విద్య ఆధునీకరణకు అవసరమైన సూచనలు చేసేందుకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.

**కమిటీ సభ్యులు:**

చైర్మన్-ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) కె. కేశవరావు , సభ్యుడు-తెలంగాణ శాసనమండలి సభ్యుడు ప్రొఫెసర్ ఎం. కోదండరాం, సభ్యురాలు

ప్రొఫెసర్ శాంతా సిన్హా (రిటైర్డ్), సభ్యుడు-ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ,సభ్యుడు- శక్తి శాఖ ప్రభుత్వ కార్యదర్శి,సభ్య కన్వీనర్-సాంకేతిక విద్య కమిషనర్ "కమిటీ అన్ని సంబంధిత వర్గాలతో విస్తృతంగా సంప్రదింపులు జరిపి, సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేయనుంది. అనంతరం పాలిటెక్నిక్ విద్య ఆధునీకరణకు సంబంధించి 30 రోజుల్లోగా ప్రభుత్వానికి నిర్దిష్ట సిఫారసులు చేయాల్సి ఉంటుంది.కమిటీ సిఫారసులు అందిన తర్వాత ప్రభుత్వం తదుపరి అవసరమైన చర్యలు తీసుకుంటుందని జీవోలో పేర్కొంది.

## కేంద్రం హామీలన్నీ విస్మరించింది

ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వంతో చర్చల అనంతరం జులై 25న సీజేపీ ఆందోళనలు విరమించగా, సరిగ్గా నెల రోజుల తర్వాత ఇప్పుడు మళ్లీ నిరసనలకు పిలుపునివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## మహిళా ఫిర్యాదులకే మొదటి ప్రాధాన్యత

న్యూఢిల్లీ(జనంసాక్షి):జంతర్ మంతర్ నిరసనకారులపై పోలీసులు బలప్రయోగం చేశారనే ఆరోపణలపై విచారణ జరుపుతున్న ఉన్నత స్థాయి కమిటీకి సోమవారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా పోరాడుతున్న సమయంలో మహిళా నిరసనకారులపై జరిగిన లైంగిక వేధింపుల ఫిర్యాదులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సదరు కమిటీని కోరినట్లు భారత ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్‌జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది శోభా గుప్త తన వాదనలు వినిపించారు. "నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా పోరాడుతున్న సమయంలో కొంత మంది బాలికలు తాము లైంగిక వేధింపులకు గురయ్యామని చెబుతున్నారు. సోషల్ మీడియాలో కూడా ఇలాంటి వార్తలు వస్తున్నాయి. అందుకే ఈ విషయాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించాలని నేను ధర్మాసనాన్ని కోరుతున్నాను" అని సీనియర్ న్యాయవాది శోభా గుప్తా పేర్కొన్నారు.దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు, ఇప్పటికే దాఖలైన ఓ రిట్ పిటిషన్‌లో ఈ విషయాలు అన్నీ ఉన్నాయని తెలిపింది. వెంటనే స్పందించిన సీనియర్ న్యాయవాది శోభా గుప్తా, మహిళలపై జరిగిన లైంగిక వేధింపులను ప్రత్యేకంగా చూడాలని కోరారు. ఇందుకోసం ఒక జిల్లా జడ్జిని లేదా ప్రత్యేక అధికారిని నియమిస్తే, బాధితులు నేరుగా ఫిర్యాదులు చేయడానికి వీలవుతుందని అన్నారు. ఆమె వాదనలు విన్న సీజేఐ, తాము ఇచ్చిన ఉత్తర్వుల్లో ఈ విషయాన్ని స్పష్టంగా రాశామని చెప్పారు. లైంగిక వేధింపుల గురించి మహిళా నిరసనకారులు ఇచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తాము ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఆదేశించామన్నారు. అలాగే ఒక మధ్యంతర నివేదిక కూడా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా, బాధితుల ఫిర్యాదులు కమిటీ వరకు చేరడంలో ఇబ్బందులు లేదా ఆటంకాలు ఏర్పడవచ్చని శోభా గుప్తా ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఒక ప్రత్యేక ఈ-మెయిల్ ఐడీ ఇచ్చి, ఒక అధికారిని కేటాయించి, దీనికి బాగా ప్రాచుర్యం కల్పించాలని ఆమె కోరారు. ఆమె వాదనలు విన్న చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ 'మీ ఆందోళన సరైనదే'నని అన్నారు. నోడల్ అధికారిని నియమించే అధికారాన్ని కమిటీ ఛైర్మన్?కు ఇచ్చామని అన్నారు. ఆ నియామకం పూర్తి కాగానే, ఫిర్యాదులు ఎలా చేయాలో అధికారికంగా తెలియజేస్తామన్నారు. అప్పుడు బాధితులు ఎవరైనా సరే నేరుగా ఆ నోడల్ అధికారికి తమ ఫిర్యాదులు అందజేయవచ్చని స్పష్టం చేశారు.

## ఇరాన్‌పై ఆర్థిక దాడి మొదలైంది

టెహ్రాన్‌ను ఒంటరి చేసేవరకు.. ఆ నిరంకుశ పాలనను నిలబెడుతున్న ప్రతి ఆర్థిక జీవనాధారాన్ని తెంచడమే మా లక్ష్యం అని స్కాట్ బెసెంట్ రాసుకొచ్చారు. ఇరాన్‌కు ఆర్థికంగా సహకారం అందిస్తోన్న దేశాలు తీవ్ర పర్యవసనాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇటీవల ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దేశంతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే ప్రతి సంస్థ, ఏజెన్సీని తాము లక్ష్యంగా చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ఆర్థిక యుద్ధం సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే స్కాట్ బెసెంట్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్కచుక్క చమురును కూడా సరఫరా కానివ్వం

**ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు**

న్యూఢిల్లీ,ఆగస్ట్24(జనంసాక్షి):అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక యుద్ధం కొనసాగితే హోర్ముజ్ జలసంధి ద్వారా మాత్రమే కాకుండా పర్షియన్ గల్ఫ్ నుంచి కూడా ఒక్క చుక్క చమురునూ ఎగుమతి చేయనీయమని రెజాయీ హెచ్చరించారు. అమెరికా ఆర్థిక చర్యలకు మద్దతు ఇచ్చే లేదా వాటిలో భాగస్వాములయ్యే దేశాలను కూడా ఇరాన్ శత్రువులుగా పరిగణిస్తుందని రెజాయీ హెచ్చరించారు. అలాంటి దేశాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలకు సిద్ధమవుతోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ చర్యలను ఎకనామిక్ డీ-డే'గా అభివర్ణించారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలు, సంస్థలపై కూడా కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉందన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గరిష్ఠ ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని వాషింగ్టన్ చెబుతోంది. అయితే ఇరాన్ మాత్రం ఈ ఆంక్షలను ఎదుర్కొంటామని స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ ఇప్పటికే కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఈ వారాంతంలో 20 కంటే తక్కువ వాణిజ్య నౌకలు మాత్రమే హోర్ముజ్ గుండా వెళ్లినట్లు నౌకాయాన సమాచారం వెల్లడించింది. హోర్ముజ్ ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం మోకాలడ్డు

ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు. టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు. 'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చిందని అన్నారు. అందుకే ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారుమోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి.



## సెప్టెంబరు 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్(జనంసాక్షి):శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధులకు సూచనప్రాయంగా వివరించారు. బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన సీఎం రేవంత్, అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ప్రజాప్రతినిధులందరూ నియోజకవర్గాల అభివృద్ధిపై ఫోకస్ పెంచాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తి కావని, భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ అనుమతులకు సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. మంత్రి కొండా సురేఖ అంశం ఎవరూ మాట్లాడొద్దు కొండా సురేఖ అంశం పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని, ఇకపై ఎవరూ ఆ అంశాన్ని మాట్లాడొద్దని సూచించారు. నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. భూసేకరణను నిర్లక్ష్యం చేస్తే ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తికావన్నారు. భూసేకరణ, ఆర్? అండ్ ఆర్ నిధులను వెంటనే మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్క నాయకుడూ నియోజక వర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలని ఆయన ఆదేశించారు.

## కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం కోసం

# వేచిచూస్తున్నాం

ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్లుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్ల బీఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

## ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు..

చెన్నై,ఆగస్ట్24(జనంసాక్షి): తమిళనాడు అసెంబ్లీ వేదికగా మహిళలపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వరాల జల్లు కురిపించారు. ఎన్నికల హామీ మేరకు సోమవారం పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్నట్లు సీఎం విజయ్ ప్రకటించారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పథకం కింద దీనిని అమలు చేయనున్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ అయ్యేలా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఉచిత ఎల్‌పీజీ సిలిండర్ల పథకాన్ని వచ్చే ఏడాది పొంగల్ పండుగ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పథకం కింద సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అలాగే రాష్ట్ర ఖజానాపై ఏడాదికి సుమారు రూ.4,000 కోట్ల వ్యయం పడనుంది. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని మరింత విస్తరిస్తూ 'వెట్రి పయన తిట్టం' పథకాన్నీ సీఎం విజయ్ ప్రకటించారు.

## గినియాలో ఘోరప్రమాదం

న్యూఢిల్లీ,ఆగస్ట్24(జనంసాక్షి): పశ్చిమ ఆఫ్రికాలోని గినియాలో ఓ డంపింగ్ యార్డ్ కూలడంతో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా సహాయక బృందాలు వారిని ఆస్పత్రికి తరలించాయి. గినియా రాజధాని కొనక్రిలో ఈ ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా డంపింగ్ యార్డ్ కుప్పకూలినట్టు తెలుస్తోంది. మృతిచెందిన 30 మందిలో ఇప్పటివరకు 18 మృతదేహాలను వెలికి తీసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారనే అనుమానంతో రక్షణ బృందాలను రంగంలోకి దించినట్టు గినియా ప్రభుత్వం తెలిపింది. అయితే.. అక్కడ ప్రమాదం జరిగే అవకాశముున్నట్టు తాము ముందే ఊహించామని, స్థానికులను వేరే ప్రాంతానికి వెళ్లాలని ఇటీవలే ఆదేశించామని చెప్పింది.

## తెలంగాణకు భారీ వర్షసూచన

కేంద్రం వెల్లడించిన ప్రకారం.. సోమవారం కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఇవి కాకుండా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ సహా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది. వర్షం సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నది.హైదరాబాద్ నగరం, దాని పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 30 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదులు, వాగుల సమీపంలో నివసించే వారు మరింత జాగ్రత్తగా ఉండాలని, అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని అధికారులు సూచించారు.

## ముంబయిని వీడుతున్న ఆటో డ్రైవర్లు..


ముంబై(జనంసాక్షి):మహారాష్ట్రలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు మరాఠీ భాష తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం చేపట్టిన చర్యలు నగర రవాణాపై ప్రభావం చూపుతున్నాయి. ఈ క్రమంలో వేలాది మంది ఆటో డ్రైవర్లు ముంబయి, ఠాణేను వీడుతున్నట్లు తెలుస్తోంది. బిహార్, యూపీ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన డ్రైవర్లు స్వస్థలానికి తరలి వెళ్లిపోతున్నట్లు సమాచారం. ముంబయి మహానగర ప్రాంతంలో సోమవారం ఉదయం ఆటోల కొరత తీవ్రంగా కనిపించింది. ముఖ్యంగా నివాస ప్రాంతాలను రైల్వే స్టేషన్లతో కలిపే మార్గాల్లో ఆటోలు అందుబాటులో లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు నిత్యం ఆటోలను ఆశ్రయించే ఉద్యోగులు, విద్యార్థులు రవాణా కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. మరాఠీ భాషా నైపుణ్యంపై ఆర్టీవో తనిఖీలు ముమ్మరం కావడంతో కొందరు డ్రైవర్లు కీలక మార్గాల్లో ఆటోలు నడపడానికి వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది.

# సింగరేణిని కాపాడుకుంటాం

విషయాన్ని కేంద్రంతో మాట్లాడి మైనింగ్ లీజు దక్కించుకోవడంలో ప్రభుత్వం సఫలమైందని తెలిపారు. అంతేకాకుండా జెన్కోను ఒప్పించి, సింగరేణికి వేలంలో మణుగూరు డిప్ సైడ్ బ్లాక్ -2 దక్కేలా కృషి చేశామన్నారు. ఒడిశాలోని 'నైనీ' బ్లాక్ సమస్యల పరిష్కారానికి స్వయంగా వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి మార్గం సుగమం చేశామని వెల్లడించారు.ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిలో సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులోకి వస్తుండటంతో భవిష్యత్తులో థర్మల్ పవర్ డిమాండ్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశం ఉందన్నారు. కేవలం బొగ్గుపైనే ఆధారపడితే సింగరేణి కూడా ఒకప్పటి బాబెజ లా వెనుకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే ప్రపంచ మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి 'క్రిటికల్ మినరల్స్' (కీలక ఖనిజాలు) మైనింగ్ వైపు సింగరేణిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ అవకాశాలను అధ్యయనం చేసేందుకు సౌత్ ఆఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ వంటి దేశాల కోసం అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించామని డిప్యూటీ సీఎం చెప్పారు.ఇప్పటికే కర్ణాటకలోని ఒక గోల్డ్ మైన్ వేలంలో పాల్గొని సాధించామని, ఆ గని ద్వారా భవిష్యత్ లో అక్కడ మైనింగ్ చేస్తే సింగరేణికి నిరంతరం రాయల్టీ లేదా ఆదాయం వస్తుందన్నారు. ప్రస్తుతం సింగరేణిలో 43,000 నుండి 45,000 మంది శాశ్వత ఉద్యోగులు, మరో 30,000 మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా సరే మైనింగ్ బ్లాక్‌లను దక్కించుకునేలా ముందుకు వెళ్లాలన్నారు. 100 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న సింగరేణి సంస్థను అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ సంస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ సమష్టిగా పనిచేసి కంపెనీని ఉన్నతస్థాయిలో నిలపడానికి సహకరించాలన్నారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమర్థవంతమైన, డైనమిక్ నాయకత్వంలో సింగరేణి సంస్థ కొత్త గనుల ప్రారంభం, వ్యాపార విస్తరణ మరియు నూతన ప్రాజెక్టులతో శరవేగంగా ముందుకు సాగుతోందని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కొనియాడారు. భవిష్యత్తులో సింగరేణిని దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. సింగరేణి గొప్పతనాన్ని ఎన్నో వేదికలపై ప్రశంసించానని ఆయన గుర్తుచేసుకున్నారు. సింగరేణి మనమందరం గర్వపడాల్సిన ప్రతిష్టాత్మకమైన సంస్థ అని అభివర్ణించారు.సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి, ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు లక్ష్మీపతి గౌడ్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కోసం అతికీలకమైన నైనీ బొగ్గు బ్లాక్ సాధన కోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఒడిశా వెళ్లి అక్కడ ముఖ్యమంత్రిని, స్థానిక ప్రజా ప్రతినిధులను, ప్రజలను కలిసి వారందరినీ ఒప్పించి అన్ని అనుమతులు సాధించారని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగా గత ఏడాది నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైందని, రాష్ట్ర ఇంధన అవసరాల కోసం ఈ నెలలో తొలి బొగ్గు రేకును సింగరేణికి కూడా రవాణా చేయడం సాధ్యమైందన్నారు. అదే సమయంలో 2013లో యూపీఏ ప్రభుత్వ కేటాయించిన తాడిచెర్ల -2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించడంలోనూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కృషి చేశారని ప్రశంసించారు. అదే సమయంలో బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా గత బీఆర్ఎస్ పాలకులు సింగరేణిని అడ్డుకోవడం వల్ల కంపెనీ మనుగడకు కీలకమైన రెండు కీలక గనులను సంస్థ చేజార్చుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో సింగరేణిలో బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనడానికి సింగరేణికి అనుమతి ఇవ్వడం వల్ల ఇటీవలే మణుగూరు డిప్‌సైడ్ -2 బ్లాక్‌ను సింగరేణి చేజిక్కించుకుందని వారు వివరించారు. బొగ్గు ఉత్పత్తికి పరిమితమైన సింగరేణి సంస్థను కీలక ఖనిజ రంగం వైపు తీసుకెళ్తు అంతర్జాతీయ సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజ అన్వేషణ లైసెన్స్ కూడా సింగరేణి దక్కించుకోవడంలో ప్రజా ప్రభుత్వంలో సింగరేణి సాధించిన మరో విజయమన్నారు. అదే సమయంలో కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ పంపిణీ చరిత్రాత్మకమన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల్లో గరిష్ట వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచడం వల్ల వందల మంది లబ్ధిపొందారన్నారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ రాజ్ కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీపతి గౌడ్, పెద్ది నర్సింహులు, అన్ని ఏరియాలకు సంబంధించిన గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## వెంటిలేటర్ పేలి ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

ముంబై,ఆగస్ట్24(జనంసాక్షి):మహారాష్ట్రలోని అమరావతిలో సోమవారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. అమరావతి జిల్లా మహిళా ఆస్పత్రిలో మంటలు చెలరేగి ముగ్గురు నవజాత శిశువులు మృతిచెందగా.. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రి మూడో అంతస్తులోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో 39 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. అయితే, తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో వెంటిలేటర్ ఒక్కసారిగా పేలడంతో మంటలు చెలరేగాయి.నిమిషాల్లో ఎల్ఎన్సీయూ మొత్తం వ్యాపించాయి. దీంతో పొగ



పీల్చడం, తీవ్రమైన కాలిన గాయాలు కారణంగా ముగ్గురు శిశువులు ప్రాణాలు కోల్పోయారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే వైద్యులు, నర్సులు, ఇతర ఆస్పత్రి సిబ్బంది వార్డుకు చేరుకుని చిన్నారులను కాపాడారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురు నవజాత శిశువులను చికిత్స నిమిత్తం సమీపంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

## భారతీయ విద్యార్థులు, నిపుణులకు అమెరికా షాక్!

- హెచ్-1బీ, ఎఫ్-1 ఓపీటీ ప్రోగ్రామ్‌కు కొత్త ఫీజులు విధించేందుకు చర్యలు ప్రారంభం

చెల్లించాల్సి ఉంటుంది. ఆగస్టు 20న ఈ ప్రతిపాదనను ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ సమీక్షకు డీహెచ్ఎస్ పంపగా.. దీనిపై ప్రస్తుతం సమీక్ష జరుగుతోంది. ఇక హెచ్-1బీ పిటిషన్లపై ప్రతిపాదిత ఫీజులకు ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అదే రోజు ఆమోదం తెలిపిందని ఫ్రాగోమెన్ తెలిపింది. గతంలో హెచ్-1బీ వీసాలపై లక్ష డాలర్ల ఫీజుపై మసాచుసెట్స్ ఫెడరల్ జిల్లా కోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా కాకుండా రెగ్యులేటరీ ప్రక్రియ ద్వారా ఈ ఫీజును తీసుకురావాలని డీహెచ్ఎస్ ప్రయత్నిస్తోందని తెలిసింది.

**భారతీయ విద్యార్థులపై ప్రభావం**

గతేడాది సుమారు 3 లక్షల మంది ఎఫ్-1 విద్యార్థులు ఓపీటీ ద్వారా ఉపాధి అనుమతి పొందారు. ఈ ప్రోగ్రాములో ఏటా చేరే భారతీయుల సంఖ్యా ఎక్కువే. భారతీయ విద్యార్థులకు ఉన్నత చదువులు, ఆపై అమెరికాలో ఉపాధి అవకాశాలు, ఆ తర్వాత హెచ్-1బీ వ్యవస్థలోకి మారడానికి ఓపీటీ మొదటి మెట్టుగా వ్యవహరిస్తారు. ఒకవేళ పెద్ద మొత్తంలో ఫీజు విధిస్తే ఆ మేర విద్యార్థులపై ప్రభావం పడుతుందనేది నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రతిపాదనలపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన అనంతరం కొత్త ఫీజు అమలు తేదీ, తుది నిబంధనలు జారీ చేస్తుంది.

## ఇంజనీరింగ్ విద్యార్థికి ఉగ్రలింకులు

పెద్దపల్లి,ఆగస్ట్24(జనంసాక్షి):పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలో ఉగ్ర లింకులు కలకలం రేపాయి. అయోధ్య నగర్‌లో నేషనల్ ఇన్‌వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) తనిఖీల్లో ఈ విషయాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో రామగుండానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్‌ను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ముజామిల్ ఖాన్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ముజామిల్‌ను ఎన్ఐఏ అధికారులు.. ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. అతడి కార్యకలాపాలు, పరిచయాలు, ఉగ్రవాద సంస్థలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.

# 10.63 ఎకరాల టీజీఐఐసీ వేలాన్ని తక్షణమే నిలిపివేయాలి

- సర్వే నం. 83పై సమగ్ర విచారణ జరపాలి
- జామియా నిజామియా 510 ఎకరాల 35 గుంటల భూమికి బౌండరీ వాల్ నిర్మించాలి
- స్కిల్, హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి
- జామియ నిజమియ రాయదుర్గ్ వక్ఫ్ భూముల పరిరక్షణకు జాయింట్ యాక్షన్ కమిటీ కీలక తీర్మానం



**హైదరాబాద్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** రాయదుర్గ్ పాన్మక్త గ్రామంలోని సర్వే నం. 83/1లోని 10.63 ఎకరాల భూమికి టీజీఐఐసీ ప్రతిపాదించిన వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. రాయదుర్గ్ పాన్మక్త గ్రామంలోని జామియా నిజామియా వక్ఫ్ భూములు, సర్వే నం. 83లోని వివాదాస్పద భూములు, చారిత్రక వారసత్వ ప్రదేశాల పరిరక్షణ కోసం తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి(టీఎస్ఎంహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాయదుర్గ్ వక్ఫ్ ల్యాండ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ˇమావేశంలో పాల్గొన్న వివిధ ప్రజా సంఘాలు, పౌర సమాజ సంస్థలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు మరియు ఇతర ప్రజా ప్రతినిధులు రాయదుర్గ్ భూముల పరిరక్షణతో పాటు జామియా నిజామియా 510 ఎకరాల 35 గుంటల వక్ఫ్ భూమిని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సుమారు 5.25 ఎకరాలు, 5.38 ఎకరాలుగా రెండు ప్లాట్లుగా విభజించిన ఈ భూమిపై యాజమాన్య హక్కులు, వక్ఫ్ హోదా, హెరిటేజ్ హోదా తదితర అంశాలు వివాదంలో ఉన్నందున, సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు వేలం, అమ్మకం, బదలాయింపు, రిజిస్ట్రేషన్ లేదా మూడవ పక్ష హక్కుల సృష్టిని అనుమతించకూడదని తీర్మానించారు.

జీవో ఎంఎస్‌నెం.4 మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ, 2 జనవరి 2003 ప్రకారం సర్వే నం. 83ను హెరిటేజ్ సైట్‌గా ప్రకటించిన విషయాన్ని సమావేశం గుర్తు చేసింది. తెలంగాణ హెరిటేజ్ చట్టం, 2017తో పాటు సంబంధిత చట్టాల ప్రకారం ఈ ప్రాంత చారిత్రక మరియు వారసత్వ ప్రాధాన్యతను ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేసింది. స్పెషల్ లీవ్ పిటీషన్ (సివిల్)నెం.1866 ఆఫ్ 2024లో 7 మే 2025న గౌరవ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో మూడవ పక్ష హక్కులు ఏర్పడకుండా ఆస్తిని పరిరక్షించాల్సిన అవసరాన్ని పేర్కొన్న అంశాన్ని సమావేశం ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో వివాదాస్పద భూమిపై వేలం నిర్వహించడం వల్ల భవిష్యత్తులో మరిన్ని న్యాయపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలి

- 29న హైదరాబాద్‌లో ధర్నా
- కరపత్రం, వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్ (జనంసాక్షి) :** రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలని విడుదల చేయాలని 29 ఆగస్టు 2026 హైదరాబాద్ లో జరిగే ధర్నా కరపత్రం, వాల్ పోస్టర్ తెలంగాణ చౌక్ గీతా భవన్ చౌరస్తా, కరీంనగర్ లో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ నాయకులు ఆవిష్కరణ చేసారు. ప్రభుత్వాలు ప్రజాస్వామిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రాజ్యాంగం కల్పించిన సంక్షేమ విధానాలను విస్మరిస్తూ, కొనసాగిస్తున్న పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తారని. ఈ క్రమంలో మన దేశంలో ఎనిమిది దశాబ్దాలుగా ప్రజల జీవించే హక్కు, జీవనోపాధి హక్కుల కోసం బలమైన పోరాటాలకు ప్రధానంగా అడవులు, అడవి చుట్టూ ఉన్న మైదాన ప్రాంతాలు కేంద్రంగా మారాయి. నిర్దిష్ట రాజకీయ దృక్పథంతోనే ఆ ఉద్యమాలు కొనసాగాయని, లక్షలాది ఆదివాసీలు 'జల్, జంగల్, జమీన్, ఆత్మ గౌరవం' కోసం పోరాడుతున్నారు. ఆ ఉద్యమాలపై తీవ్రమైన అణచివేత నిరంతరాయంగా కొనసాగుతున్నదని, దేశవ్యాప్తంగానూ, తెలంగాణ రాష్ట్రంలోనూ ఎంతో మంది మావోయిస్టులనే ఆరోపణలతో జైళ్ళలో మగ్గుతున్నారని, కొందరు ఏళ్ళ తరబడి విచారణ ఖైదీలుగానే ఉంటున్నారు. బెయిలుపై విడుదల చాలా కష్టంగా మారిందని తెలిపారు. రాజకీయ ఖైదీలు అందరిని విడుదల చేయాలని,జైళ్లలో నిర్బంధించిన ఆదివాసుల కేసులు ఎత్తివేసి విడుదల చేయాలని, ప్రజా సంఘాల నాయకులు, మేధావులపై పెట్టిన అక్రమ ఊపా కేసులు ఎత్తివేయాలని, తెలంగాణ ఉద్యమకారులపై, ముస్లిం మైనారిటీలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఊపా చట్టాన్ని రద్దు చేయాలని, ఎన్ఐఏ రద్దు చేయాలని జరిగే ఈ ధర్నాకు అధ్యక్షతగా ప్రొ॥ లక్ష్మణ్ గడ్డం, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వహిస్తారు. వక్తలుగా

రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక కన్వీనర్, ప్రొఫెసర్ హరగోపాల్, మాడభూషి శ్రీధర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ ఎంఎల్ ఎన్‌డీ నాయకులు సాధినేని వెంకటేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య విమలక్క, పీవోడబ్ల్యూ సంధ్య, తదితరులు పాల్గొంటారు. ఈ కరపత్రం ఆవిష్కరణలో పౌర హక్కుల సంఘం తెలంగాణ సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీఅధ్యక్షుడు బొంకూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి బొడ్డుపెల్లి రవి, ఉపాధ్యక్షుడు నార వినోద్, నాయకులు బండి శంకర్ గౌడ్ బండి సతీష్ గౌడ్ పాల్గొన్నారు.



# 27న టీజీఈజేఏసీ మహాధర్నా

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇందిరా పార్క్ వద్ద ఆగస్టు 27న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ హైదరాబాద్ జిల్లా చైర్మెన్ ఎస్.విక్రమ్ కుమార్ కన్వీనర్ ఎంబీ కృష్ణయాదవ్ కోరారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కలెక్టరేట్‌లో కార్యవర్గ సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించి, క్రింది కార్యక్రమాలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. టీజీఈజేఏసీతీసుకున్న నిర్ణయాలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, డీఏలను వెంటనే ప్రకటించి పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, జుఎూ ను సమర్థవంతం గా అమలు చేయాలని కోరుతూ తీసుకున్న నిర్ణయాలకు మద్దతు ప్రకటించారు. 27న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా/ప్రదర్శన నిర్వహించాలని, సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు హైదరాబాద్ జిల్లా నుండి ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారం అందిస్తూ, అధిక సంఖ్యలో పాల్గొనాలని సభ్యులను కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ విభాగం) కదరావన్ పలనిని కలిసి, హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ఈనెల 27వ తారీకున మహా ధర్నా కార్యక్రమానికి సంబంధించి సమాచార పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ ఆశన్న, ఎన్జీవో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.శ్రీని వాస్, నాలుగో తరగతి అధ్యక్షుడు సత్యనా రాయణ, మంజుల రెడ్డి, కో కన్వీనర్ నర్సింగ్ రావు, జాకబ్, డాక్టర్ సురేందర్, బాలాజీ, రాజ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో దోపిడీ, భూకబ్జాలు ప్రజలు మర్చిపోలేదు

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



**మెదక్ బ్యూరో, ఆగస్టు 24 (జనం సాక్షి):** బీఆర్ఎస్ హయాంలో దోపిడీ, భూకబ్జాలు ప్రజలు మర్చిపోలేదు... సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. మెదక్‌లోని వినాయక ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా పీఏసీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏం చేశారో మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన దోపిడీ, భూకబ్జాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. సోషల్ మీడియా ద్వారా బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం, మార్ఫింగ్ వీడియోలు చేయిస్తున్నారని ఆరోపించారు. వాటిని ప్రజలు నమ్మవద్దని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు నెల 20వ తేదీ వరకు కూడా జీతాలు అందని పరిస్థితి ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తోందని తెలిపారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు విషయంలో ఎంతమంది రైతులపై కేసులు పెట్టారో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్ని కొత్త ఉద్యోగాలు కల్పించారో బీజేపీ నేత రఘునందన్‌రావు సమాధానం చెప్పాలని మహేష్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగించారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసిన సంస్థలను అదానీ, అంబానీలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడం ఖాయమన్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు ఎందుకు హాజరు కావడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని, రాష్ట్రంలో అర్హులైన పేదలు ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పేద పిల్లల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉంటుందని, బీఆర్ఎస్‌లో రాజయ్య, ఈటల రాజేందర్‌లను అన్యాయంగా తొలగించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో హద్దులు దాటితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరికీ తగిన సమయంలో పదవులు వస్తాయని, కార్యకర్తలు ఓపికగా ఉండాలని సూచించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఇదే మాట చెబుతున్నారని అన్నారు.

**ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) విషయంలో కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు ఉండేలా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి మల్కాజ్గిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిలు ఆవుల రాజిరెడ్డి, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, గాలి అనిల్ కుమార్, హరికృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా నాయకురాలు, మరియు మెదక్ పట్టణ మున్సిపల్ చైర్మన్, రామయంపేట మున్సిపల్ చైర్మన్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్, మాజీ కౌన్సిలర్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ముఖ్య కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇండియా డే వేడుకల్లో టాక్ తెలంగాణం

- తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిత్యం వహిస్తూ 'తెలంగాణ స్టాల్'
- తెలంగాణ స్టాల్ ప్రారంభించిన టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల




**లండన్ (జనంసాక్షి) :** లండన్‌లోని భారత హై కమీషన్, భారత దేశానికి చెందిన వివిధ రాష్ట్రాల ప్రవాస సంఘాలతో సంయుక్తంగా భారత 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జరిపిన 'ఇండియా డే వేడుకల్లో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్డమ్ (టాక్), తెలంగాణా రాష్ట్రానికి ప్రాతినిత్యం వహించింది. భారత హై కమీష్నర్ పెరియాసామి కుమారన్ ముందుగా జెండా ఆవిష్కరించి, జాతీయ గీతాలాపన తో కార్యక్రమం ప్రారంభమ య్యింది. ముందుగా తెలంగాణ ప్రత్యేకతతో టాక్ సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్ ని టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల ప్రారంభించారు. యూకే నలుమూలల నుండి వేలాదిమంది మంది ప్రవాస భారతీయులు ఈ వేడుకలకు హాజరయ్యారు.

తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతను, చరిత్రను, బాషా, సంస్కృతి, పర్యాటక ప్రత్యేకత, అభివృద్ధి...ఇలా వీటన్నింటి సమాచారాన్ని స్టాల్ లో ప్రదర్శించి, హజారయ్యిన వారందరికీ తెలంగాణ ప్రత్యేకత గురించి వివరించారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల, తెలంగాణా ప్రముఖుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. తెలంగాణా రాష్ట్ర ప్రాముఖ్యత, విశిష్టత గురించి వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాస భారతీయులకు మరియు ఇతర అతిథులకు తెలియజేయాలనే భావన తో, టాక్ సంస్థ ఆద్వర్యం లో తెలంగాణా ప్రముఖులు, సాధించిన విజాయాల తో కూడిన ప్రత్యేక 'తెలంగాణా స్టాల్'ను ఏర్పాటు చేయడం జరిగిందని సంస్థ ప్రధాన కార్యదర్శి సుప్రజ పులుసు తెలిపారు. ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిత్యం వహిస్తూ కేవలం టాక్ సంస్థ మాత్రమే ఈ వేడుకల్లో పాల్గొనడం ఎంతో గర్వంగా ఉందని, వ్యక్తిగతంగా ఎంతో బిజీగా ఉన్నపటికీ వాటన్నిటినీ పక్కన బెట్టి బాధ్యత గల సంస్థగా , తెలంగాణ బిడ్డలుగా ఇందులో భాగ్వములై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, తెలంగాణ ప్రత్యేక స్టాల్ నిర్వాహణకు కృషి చేసి సహకరించిన కార్యవర్గ సభ్యులకు టాక్ ఈవెంట్స్ ఇంచార్జి మల్లా రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. స్టాల్ ను సందర్శించిన ప్రముఖులకు, ఇతర స్థానిక సంస్థల ప్రతినిధులకు టాక్ ఉపాధ్యక్షుడు సురేష్ బుడగం వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణా సంస్కృతి – సాంప్రదాయాలు, తెలంగాణ విజయాలు, పర్యాటక ప్రత్యేకత, చాలా గొప్పగా ఉందని, నూతన రాష్ట్ర సంస్కృతిని, గొప్పతన్నాని, ప్రపంచానికి చూపెట్టాలనే ప్రయత్నం చాలా స్ఫూర్తి దాయకంగా ఉందని హాజరైన ప్రవాస భారతీయులు ప్రశంశించారు. 'తెలంగాణా స్టాల్'ని సందర్శించిన అతిథులందరికి మన 'హైధారాబాద్ బిర్యానీ" రుచిచూపించడం జరిగిందని టాక్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ జెల్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, కార్యవర్గ సభ్యులు సురేష్ బుడగం,రాకేష్ పటేల్, సుప్రజ పులుసు, శ్రీకాంత్ జెల్ల, పవిత్ర , నవీన్ రెడ్డి, సత్యపాల్ రెడ్డి,మల్లా రెడ్డి,వెంకట్ రెడ్డి, స్వాతి,సత్యం కంది,హరి గౌడ్, క్రాంతి రేతినేని, రవి పులుసు,శ్రీ లక్ష్మి, సందీప్, సాయి కిరణ్ కనుగుల, అబ్దుల్ ఖుద్దూస్, అద్విత్ కంది, పావని, తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# రైతు నాయకుడు మల్లారెడ్డికి నివాళి

- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** వ్యవసాయ రంగంపై గట్టిపట్టున్న రైతు నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి మరణం తెలంగాణకు తీరని లోటు అని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగిన రైతాంగ పోరాటాలపై సారంపల్లికి గట్టిపట్టు ఉందని చెప్పారు. తెలంగాణలో భూమి పంపకాలు, భూసంస్కరణలకు సంబంధించిన సమాచార దర్శినిగా మల్లారెడ్డిని చెప్పాలన్నారు. రైతు కూలీల పక్షాన నిలబడ్డ నికార్సైన రైతు కూలీల నాయకుడు నాయకుడు మల్లారెడ్డి అని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంపై అనేక పుస్తకాలను రచించారని తెలిపారు.



# తెలంగాణ రైస్ మిల్లింగ్‌కు శాస్త్రీయ, పారదర్శక విధానం అవసరం

- ప్రభుత్వానికి 15 కీలక సిఫార్సులు
- తెలంగాణలో రైస్ మిల్లింగ్ భవిష్యత్తుపై రౌండ్ టేబుల్

**హైదరాబాద్, ఆగస్టు 24 (జనం సాక్షి) :** తెలంగాణలో రైస్ మిల్లింగ్ రంగం భవిష్యత్తుపై హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి, ప్రభుత్వానికి 15 కీలక సిఫార్సులు చేశారు. శాస్త్రీయ మిల్లింగ్ నిష్పత్తులు, వరి సేకరణ–నాణ్యత పరీక్షలు, కస్టమ్ మిల్డ్ రైస్ కార్యకలాపాలు, బియ్యం తరలింపు జాప్యం, పెండింగ్ ఖాతాలు, మిల్లింగ్ ఛార్జీలు, నిల్వ ఖర్చులు, డిఫాల్ట్‌లపై సమతుల్య చర్యలు వంటి అంశాలపై దృష్టి సారించారు. ప్రతి సీజన్‌లో ప్రతి వరి రకానికి శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి వాస్తవ రికవరీ ఆధారంగా మిల్లింగ్ నిష్పత్తి నిర్ణయించాలని, సేకరణ, బియ్యం తరలింపు, ఖాతాల పరిష్కారాన్ని నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ జాప్యంతో ఏర్పడే నిల్వ, అద్దె, రవాణా, నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం భరించాలని, వరి స్వీకరణ సమయంలోనే తేమ, నాణ్యతను నమోదు చేసి ధ్రువీకరించాలని కోరారు. మిల్లింగ్ ఛార్జీలను విద్యుత్, కార్మిక, యంత్రాల నిర్వహణ, నిల్వ, రవాణా తదితర వాస్తవ వ్యయాలకు అనుగుణంగా పునఃసమీక్షించాలని సూచించారు. ఉద్దేశపూర్వక మోసం, అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, ప్రభుత్వ జాప్యం లేదా ఇతర కారణాలతో ఏర్పడిన నిజమైన డిఫాల్ట్‌లను ప్రత్యేకంగా పరిశీలించాలని కోరారు. పాత నిజమైన కేసులకు ఒకేసారి పరిష్కార విధానం ఏర్పాటు చేయాలని, కస్టమ్ మిల్డ్ రైస్ ఒప్పందాన్ని సమగ్రంగా సవరించాలని విజ్ఞప్తి చేశారు. రైస్ మిల్లింగ్ రంగాన్ని బలోపేతం చేయడం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకం కాదని, బలమైన మిల్లింగ్ వ్యవస్థ రైతులకు మేలు చేస్తుందని సమావేశం పేర్కొంది. ప్రభుత్వానికి న్యాయం, మిల్లర్లకు న్యాయం, రైతులకు భద్రత అనే సమతుల్య విధానాన్ని అమలు చేయాలని కోరింది. సమావేశానికి సామాజిక–రాజకీయ వ్యాఖ్యాత సయ్యద్ రఫీ అధ్యక్షత వహించారు. మాజీ డీజీపీ ఎస్. గోపాల్ రెడ్డి, ఐపీఎస్ (రిటైర్డ్), భారత వైమానిక దళానికి చెందిన కెప్టెన్ సురేష్ రెడ్డి, పి.కె. ఝా, ఐఎఫ్ఎస్ (రిటైర్డ్), హైకోర్టు న్యాయవాదులు కె. వేణుమాధవ్, పి. దేవేందర్, కె. సాయి కృష్ణ పాల్గొన్నారు. సమావేశంలో మీడియా సమావేశాన్ని పాడి గణపతిరెడ్డి, రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం–తెలంగాణ రాష్ట్రం, నిర్వహించారు.

# తొలి ఏడాదిలోనే 9 లక్షల మంది విద్యార్థులకు డిజిటల్ స్టెం విద్య

- 6 వేల పాఠశాలల్లో 20 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ
- గణితం, సైన్స్‌లో ఉచిత డిజిటల్ అభ్యసన వనరులు



**హైదరాబాద్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** తెలంగాణలో గణితం, సైన్స్ విద్యను డిజిటల్ వనరులతో మరింత బలోపేతం చేసే దిశగా పాఠశాల విద్యాశాఖ, ఖాన్ అకాడమీ ఇండియా చేపట్టిన రాష్ట్రవ్యాప్త కార్యక్రమం తొలి ఏడాదిలోనే కీలక మైలురాయిని చేరుకుంది. 2025–26 విద్యా సంవత్సరంలో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 9 లక్షల మందికి పైగా విద్యార్థులకు ఉచిత డిజిటల్ అభ్యసన వనరులు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి శ్రీ ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమం జూన్ 2025లో ప్రారంభమైంది. ఇప్పటివరకు రాష్ట్రంలోని దాదాపు 6 వేల పాఠశాలల్లో సుమారు 20 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, సొసైటీ పాఠశాలలు, ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఈ కార్యక్రమంలో భాగమయ్యాయి. రాష్ట్రంలోని మొత్తం పాఠశాలల్లో దాదాపు 75 శాతం వరకు కార్యక్రమం విస్తరించింది. విద్యార్థులు గణితం, సైన్స్‌లో క్రమం తప్పకుండా సాధన చేసేలా పాఠశాల విద్యాశాఖ వారపు ఆన్‌లైన్ అభ్యసన మార్గదర్శకాలను అమలు చేసింది. ఖాన్ అకాడమీ ఇండియా అందించిన కార్యక్రమ సమాచారం, డేటా ఆధారిత అంతర్దృష్టులు, కార్యాచరణ సూచనలు కార్యక్రమ పురోగతిని పర్యవేక్షించడంతోపాటు తదుపరి నిర్ణయాలకు ఉపయోగపడ్డాయి. "తొలి ఏడాదిలోనే 9 లక్షల మందికి పైగా విద్యార్థులకు చేరువ కావడం తెలంగాణలో నాణ్యమైన అభ్యసన అవకాశాలను విస్తరించడంలో ముఖ్యమైన ముందడుగు" అని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ యోగితా రాణా, ఐఏఎస్ తెలిపారు. డిజిటల్ గణితం, సైన్స్ అభ్యసనను విద్యార్థుల రోజువారీ విద్యలో స్థిరమైన భాగంగా మార్చడమే తదుపరి లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్‌సీఆర్‌టీ, ఖాన్ అకాడమీ ఇండియాతో కలిసి 200 మంది మాస్టర్ ట్రైనర్లను సిద్ధం చేసింది. వారు మండల వనరుల వ్యక్తులకు శిక్షణ ఇవ్వగా, వారు మండల స్థాయిలో గణితం, సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. ఈ క్యాస్కేడ్ శిక్షణ విధానం ద్వారా కార్యక్రమాన్ని పాఠశాల స్థాయికి విస్తరించారు. కేజీబీవీల్లోనూ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. లక్ష మందికి పైగా విద్యార్థులు ఇందులో నమోదు కాగా, ఇది ఆయా పాఠశాలల విద్యార్థుల సంఖ్యలో దాదాపు 84 శాతంగా ఉంది. ముఖ్యంగా సైన్స్ అభ్యసనంపై విద్యార్థులు ఆసక్తి చూపడం గమనార్హం. ఖాన్ అకాడమీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ స్వాతి వాసుదేవన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ నాయకత్వం, ఎస్‌సీఈఆర్‌టీ సహకారం, జిల్లా అధికారులు, పాఠశాలల నాయకులు, ఉపాధ్యాయుల కృషి వల్ల ఈ విజయాన్ని సాధించామని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కార్యక్రమాన్ని మరింత విస్తరించడంతోపాటు విద్యార్థుల అభ్యసన నాణ్యత, క్రమబద్ధమైన వినియోగంపై దృష్టి సారించనున్నారు.

# విద్య ప్రాథమిక హక్కు.. ప్రశ్నిస్తే దాడులా?

**విద్యార్థులు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాలి. ప్రశ్నకు దాడి సమాధానం అయితే అది పాలనా వైఫల్యానికి నిదర్శనం. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతును అణచడం కాదు.. వినడం నేర్చుకోవాలి.**

విద్య దయాదాక్షిణ్యంగా ప్రభుత్వం ఇచ్చే వరం కాదు. అది ప్రతి బిడ్డకు రాజ్యాంగం కల్పించిన హక్కు. ఆ హక్కును అందుబాటులోకి తేవడం ప్రభుత్వాల బాధ్యత. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమి, నిర్వహణ వైఫల్యాలు ఉంటే ప్రశ్నించాల్సింది విద్యార్థులే. తల్లిదండ్రులు, ప్రజలు కూడా నిలదీయాల్సిందే. పాలకులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినప్పుడు ప్రశ్నలు తగ్గుతాయి. వైఫల్యం చెందినప్పుడు ప్రశ్నలు పెరుగుతాయి. ఇది ప్రజాస్వామ్య సహజ స్వభావం. ప్రశ్నించే గొంతును వినడం పాలకుల బాధ్యత; ఆ గొంతును అణచివేయడం కాదు.

సంపాదకీయం

ఒక పాఠశాలలో సమస్య ఉంటే దాన్ని పరిష్కరించమని విద్యార్థులు అడగడం తప్పా? ఉపాధ్యాయులు కావాలని, వసతులు కల్పించాలని, తమ చదువుకు భద్రమైన వాతావరణం కావాలని కోరడం నేరమా? ప్రజల డబ్బుతో నడిచే ప్రభుత్వ వ్యవస్థను ప్రజలే ప్రశ్నిస్తే దానికి సమాధానం ఇవ్వాల్సింది ప్రభుత్వం. దాడులు, బెదిరింపులు, అణచివేత కాదు.

జనంసాక్షి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై దాడులు జరిగితే అది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు. అది ప్రశ్నించే హక్కుపై దాడి. ముఖ్యంగా విద్యార్థుల గొంతును బలప్రయోగంతో అణచివేయాలనుకోవడం మరింత దురదృష్టకరం. ఎందుకంటే ఈరోజు ప్రశ్నించే విద్యార్థే రేపటి పౌరుడు. అతని ప్రశ్నించే స్వభావాన్ని అణచివేయడం అంటే ప్రజాస్వామ్య భవిష్యత్తును బలహీనపరచడమే. ఇలాంటి పరిస్థితుల్లో ప్రెజర్ గ్రూపులు ఏర్పడటం కూడా ప్రజాస్వామ్య వైఫల్యానికి ప్రతిస్పందనే. పాలకులు స్పందించనప్పుడు ప్రజలు సంఘటితమవుతారు. సమస్యలను వెలుగులోకి తీసుకొస్తారు. ఉద్యమిస్తారు. అది వ్యవస్థకు హెచ్చరిక "మమ్మల్ని వినండి" అనే ప్రజల స్వరం.

ఇటీవల కాక్రోచ జనతా పార్టీ రాసిన లేఖను కూడా ఈ కోణంలోనే చూడాలి. అందులోని ప్రతి రాజకీయ అభిప్రాయంతో ఏకీభవించాల్సిన అవసరం లేకపోయినా, విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే హక్కును మాత్రం తిరస్కరించలేం. పాఠశాల కోసం జరిగే పోరాటాన్ని ఒక చిన్న స్థానిక వివాదంగా కొట్టిపారేయడం సరికాదు. అది పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న. ప్రభుత్వాలు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే.. ప్రజల ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేని పాలన, ప్రశ్నించే ప్రజలను భయపెట్టే పాలనగా మారకూడదు. విద్యపై ఖర్చు పెట్టడం భారం కాదు. అది భవిష్యత్తుపై పెట్టుబడి. పాఠశాలలను బలోపేతం చేయడం ప్రభుత్వ కర్తవ్యం. విద్యార్థులు ప్రశ్నించడం వారి హక్కు. ఆ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం పాలకుల బాధ్యత.

# ఆధునిక వ్యవసాయంలో రసాయనాల వినియోగం



భారత వ్యవసాయంలో రసాయనాల వినియోగం ఒకవైపు ఆహార ఉత్పత్తిని పెంచిన సాధనంగా, మరోవైపు నేల, నీరు, జీవ వైవిధ్యం, మానవ ఆరోగ్యంపై దీర్ఘకాలిక సవాలుగా మారింది. స్వాతంత్ర్యం తర్వాత ఆహార కొరతను అధిగమించేందుకు 1960లలో హరిత విప్లవం ద్వారా అధిక దిగుబడి విత్తనాలు, సాగునీరు, రసాయన ఎరువులు, పురుగుమందులు, యాంత్రీకరణకు ప్రాధాన్యం పెరిగింది. ఫలితంగా దేశ ఆహార ధాన్యాల ఉత్పత్తి భారీగా పెరిగి, 2020ల నాటికి 300 మిలియన్ టన్నులను దాటింది. కాబట్టి రసాయనాలను పూర్తిగా ప్రతికూలంగా చూడటం సరైంది కాదు. అయితే వాటి వినియోగం శాస్త్రీయ పరిమితులు దాటినప్పుడు సమస్యలు మొదలవుతాయి.

జనంసాక్షి

వ్యవసాయంలో యూరియా, డీఏపీ, పొటాషియం ఆధారిత ఎరువులు, సంక్లిష్ట ఎరువులతో పాటు పురుగుమందులు, కలుపు మందులు, శిలీంధ్రనాశకాలు విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. పంటకు అవసరమైన పోషకాలను సరైన మోతాదులో అందిస్తే దిగుబడికి ప్రయోజనం కలుగుతుంది. కానీ నేల పరీక్ష లేకుండా, పంట అవసరాన్ని అంచనా వేయకుండా ఒకే రకమైన ఎరువును అధికంగా ఉపయోగించడం వల్ల పోషకాల సమతుల్యత దెబ్బతినవచ్చు. ముఖ్యంగా నత్రజని అధిక వినియోగం ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే "ఎంత ఎరువు వేశాం?" కంటే "పంటకు నిజంగా ఎంత పోషకం అవసరం?" అన్నదే ముఖ్యమైన ప్రశ్న.

పురుగుమందుల విషయంలోనూ ఇదే పరిస్థితి. సరైన పురుగు, సరైన మోతాదు, సరైన సమయంలో మందు ఉపయోగిస్తే పంట నష్టాన్ని తగ్గించవచ్చు. కానీ ఒకే రసాయనాన్ని పదేపదే ఉపయోగించడం వల్ల పురుగుల్లో మందుల నిరోధకత పెరిగి, మరింత ఎక్కువ లేదా ఖరీదైన మందులపై ఆధారపడే పరిస్థితి రావచ్చు. హానికర పురుగులతో పాటు తేనెటీగలు, పరాగసంపర్క జీవులు, సహజ శత్రువులైన ప్రయోజనకర కీటకాలు కూడా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. దీనివల్ల రైతు ఉత్పత్తి వ్యయం పెరగడమే కాకుండా సహజ పంట సంరక్షణ వ్యవస్థ బలహీన పడుతుంది.

భూగర్భజలాల పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనది. మొక్కలు వినియోగించని నత్రజని వర్షం లేదా అధిక సాగునీటితో నేలలోకి దిగజారి భూగర్భజలాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. పొలాల నుంచి పోషక పదార్థాలు చెరువులు, కాలువలు, నదుల్లోకి చేరితే జల పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావం పడవచ్చు. అందువల్ల ఎరువుల వినియోగాన్ని కేవలం దిగుబడి కోణంలో కాకుండా నీటి సంరక్షణ కోణంలో కూడా చూడాలి.

మానవ ఆరోగ్యం విషయంలోనూ జాగ్రత్త అవసరం. పురుగుమందులను కలపడం, పిచికారీ చేయడం, నిల్వ చేయడంలో రైతులు, వ్యవసాయ కార్మికులు నేరుగా రసాయనాలకు గురయ్యే అవకాశం ఉంది. రక్షణ దుస్తులు, చేతి తొడుగులు, ముఖ రక్షణ పరికరాలు ఉపయోగించడం, గాలి దిశను పరిగణనలోకి తీసుకోవడం, మందులను ఆహారం--తాగునీటి నుంచి దూరంగా నిల్వ చేయడం వంటి భద్రతా చర్యలు తప్పనిసరి. పంటల్లో రసాయన అవశేషాల సమస్యను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సిఫార్సు చేసిన మోతాదు, కోతకు ముందు నిరీక్షణ కాలం, అవశేషాల పరీక్షకు ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే రసాయనాల వినియోగానికి రైతునే పూర్తిగా బాధ్యుడిగా చూడటం సరైంది కాదు. పంట ధరలు, పురుగు దాడుల అనిశ్చితి, వాతావరణ మార్పులు, వ్యవసాయ విస్తరణ సేవల పరిమితి, మార్కెట్ వ్యవస్థ, రసాయన విక్రేతల సలహాలపై ఆధారపడటం వంటి అంశాలు కూడా ప్రభావితం చేస్తున్నాయి. అందువల్ల వ్యవసాయ శాఖలు, విశ్వవిద్యాలయాలు, శాస్త్రవేత్తలు గ్రామస్థాయిలో నేల పరీక్ష, నీటి పరీక్ష, పంట వ్యాధి నిర్ధారణ, పురుగు తీవ్రత అంచనా, వాతావరణ ఆధారిత సలహాలను అందుబాటులోకి తీసుకురావాలి.

భవిష్యత్ వ్యవసాయానికి సమగ్ర పోషక నిర్వహణ, సమగ్ర పురుగు నిర్వహణ కీలకం. నేల పరీక్ష ఆధారంగా రసాయన ఎరువులను అవసరమైన మేరకే ఉపయోగిస్తూ, పశువుల ఎరువు, కంపోస్టు, పచ్చిరొట్ట, పంట అవశేషాలు, జీవ ఎరువులను సమన్వయం చేయాలి. పురుగు కనిపించగానే మందు పిచికారీ చేయకుండా పంటను నిరంతరం పరిశీలించి, పురుగు తీవ్రతను అంచనా వేసి, సహజ శత్రువులను సంరక్షిస్తూ, అవసరమైనప్పుడు మాత్రమే సరైన రసాయనాన్ని ఉపయోగించాలి. రసాయనాలను పూర్తిగా తొలగించడం కంటే వాటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడం ఆచరణాత్మకమైన మార్గం.

సేంద్రియ, సహజ వ్యవసాయంపై పెరుగుతున్న ఆసక్తినీ శాస్త్రీయ దృష్టితో చూడాలి. నేల ఆరోగ్యం, జీవ వైవిధ్యం, స్థానిక వనరుల వినియోగం వంటి అంశాలు స్థిరమైన వ్యవసాయానికి ఉపయోగపడతాయి. అయితే దిగుబడి, నీటి వినియోగం, కూలీ ఖర్చు, మార్కెట్ ధర, రైతు నికర ఆదాయం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. "సహజం" లేదా "రసాయనం" అనే పేరుతో ఒక పద్ధతిని పూర్తిగా మంచి లేదా చెడు అని నిర్ణయించకుండా, పంట--నేల--ప్రాంత పరిస్థితులకు అనుగుణంగా ఆధారాలతో నిర్ణయం తీసుకోవాలి.

వాతావరణ మార్పులు కూడా రసాయన వినియోగంపై ప్రభావం చూపుతున్నాయి. ఉష్ణోగ్రతల పెరుగుదల, వర్షపాతం మార్పులు, కొత్త ప్రాంతాల్లో పురుగుల వ్యాప్తి వంటి పరిస్థితులు పంట సంరక్షణను క్లిష్టతరం చేస్తున్నాయి. పంటల వైవిధ్యం, తెగుళ్లను తట్టుకునే రకాలు, సమగ్ర పురుగు నిర్వహణ, వాతావరణ ఆధారిత సలహాలు వంటి ప్రత్యామ్నాయాలను విస్తరించాలి.
తెలంగాణలో పత్తి, వరి, మిరప, మొక్కజొన్న, కూరగాయలు, పండ్ల పంటల్లో రసాయన వినియోగం పంట, ప్రాంతం, నేల, వాతావరణాన్ని బట్టి మారుతుంది. జిల్లాల వారీగా రసాయన వినియోగం, నేల ఆరోగ్యం, నీటి నాణ్యత, పంట దిగుబడి, ఉత్పత్తి వ్యయం, రైతు నికర ఆదాయం మధ్య సంబంధంపై దీర్ఘకాలిక పరిశోధనలు అవసరం. ఏ రసాయనం ఎంత ఉపయోగిస్తున్నారు? దాని వల్ల ఎంత అదనపు దిగుబడి వస్తోంది? ఖర్చు ఎంత పెరుగుతోంది? నేల, నీటిపై ప్రభావం ఏమిటి? వంటి ప్రశ్నలకు శాస్త్రీయ ఆధారాలతో సమాధానాలు కనుగొనాలి.

సాంకేతికత ఈ మార్పుకు తోడ్పడగలదు. నేల పరీక్షలు, ఉపగ్రహ చిత్రాలు, డ్రోన్ల ద్వారా పంట పరిశీలన, కృత్రిమ మేధస్సుతో పురుగు గుర్తింపు, ఖచ్చితమైన ఎరువుల వినియోగం, అవసరమైన ప్రాంతంలో మాత్రమే మందు పిచికారీ వంటి పద్ధతులు రసాయనాల వృథాను తగ్గించగలవు. తద్వారా అంచనా ఆధారిత వ్యవసాయం నుంచి సమాచార ఆధారిత వ్యవసాయం వైపు మార్పు సాధ్యమవుతుంది.

వ్యవసాయ విజయాన్ని కేవలం ఎకరాకు దిగుబడితో కొలిచే విధానాన్ని కూడా మార్చాలి. ఎకరాకు నికర ఆదాయం, నేలలో సేంద్రియ పదార్థం, నీటి వినియోగం, రసాయనాల వినియోగం, పంట నాణ్యత, జీవ వైవిధ్యం వంటి అంశాలను కూడా ప్రమాణాలుగా పరిగణించాలి. రైతు అధిక దిగుబడి సాధించినా దాని కోసం పెట్టిన ఖర్చు అంతకంటే ఎక్కువైతే అది నిజమైన విజయం కాదు.

అంతిమంగా వ్యవసాయంలో రసాయనాల ప్రశ్న "రసాయనం మంచిదా? చెడ్డదా?" అనే ద్వంద్వ ప్రశ్న కాదు. ఇది ఆహార భద్రత, రైతు ఆదాయం, నేల ఆరోగ్యం, నీటి సంరక్షణ, జీవ వైవిధ్యం, మానవ ఆరోగ్యం, వాతావరణ మార్పుతో ముడిపడి ఉన్న సంక్లిష్ట అంశం. 1960లలో ఆహార కొరతను అధిగమించేందుకు అవసరమైన వ్యవసాయ నమూనా 2026లో అదే రూపంలో కొనసాగాల్సిన అవసరం లేదు. నేడు లక్ష్యం అధిక ఉత్పత్తితో పాటు పోషక భద్రత, పర్యావరణ భద్రత, రైతు ఆర్థిక భద్రతను సాధించడం కావాలి. వ్యవసాయ రసాయనాలను పూర్తిగా నిషేధించడం పరిష్కారం కాదు. నియంత్రణ లేకుండా వినియోగించడం కూడా ప్రమాదకరం. అవసరమైనప్పుడు, సరైన మోతాదులో, సరైన సమయంలో, సరైన పద్ధతిలో రసాయనాలను ఉపయోగిస్తూ, సేంద్రియ పదార్థాలను పెంచడం, జీవ నియంత్రణను ప్రోత్సహించడం, పంటల వైవిధ్యాన్ని కాపాడడం, నీటిని సంరక్షించడం, నేల ఆరోగ్యాన్ని పునరుద్ధరించడం వంటి చర్యలను సమన్వయం చేయాలి.

జనంసాక్షి

రైతు చేతిలో రసాయనం ఒక సాధనం మాత్రమే; అది వ్యవసాయానికి యజమాని కాకూడదు. రైతును రసాయనాల నుంచి దూరం చేయడం కంటే, అజ్ఞానపూరిత వినియోగం నుంచి దూరం చేసి శాస్త్రీయ నిర్ణయాల వైపు తీసుకెళ్లడం లక్ష్యం కావాలి. రైతుకు జ్ఞానం, సరైన సమాచారం, మార్కెట్ భరోసా, సాంకేతిక సహాయం అందినప్పుడే తక్కువ వ్యయంతో, ఆరోగ్యకరమైన నేలలో, సురక్షితమైన ఆహారాన్ని ఉత్పత్తి చేస్తూ, స్థిరమైన నికర ఆదాయం సాధించగల వ్యవసాయ నమూనా ఏర్పడుతుంది.



**ప్రొఫెసర్ సుంకరి జ్యోతి**
**ప్రిన్సిపల్ ఆర్ట్స్ కళాశాల,**
**కాకతీయ**
**విశ్వవిద్యాలయం**

# కులం కాదు-మనిషే కేంద్రం : సమానత్వం, సామాజిక న్యాయం

భారతదేశ సమాజాన్ని శతాబ్దాలుగా వెంటాడుతున్న తీవ్రమైన సమస్యల్లో కుల వ్యవస్థ ఒకటి. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, విద్య, శాస్త్రసాంకేతిక అభివృద్ధి, పట్టణీకరణ వచ్చినప్పటికీ కులం తన రూపాలను మార్చుకుంటూ కొనసాగుతోంది. గ్రామాల్లో భూమి, నీరు, దేవాలయాలు, సామాజిక సంబంధాలు, వివాహాల్లోనూ, పట్టణాల్లో విద్య, ఉద్యోగాలు, నివాసం, వివాహాలు, రాజకీయ ప్రాతినిధ్యంలోనూ దాని ప్రభావం కనిపిస్తోంది.

కులం కేవలం గుర్తింపు కాదు. పుట్టుక ఆధారంగా మనిషి సామాజిక స్థానం, వృత్తి, గౌరవం, అవకాశాలను నిర్ణయించే వ్యవస్థగా అది ఏర్పడింది. ఒక వర్గం శ్రమను ఉన్నతంగా, మరో వర్గం శ్రమను తక్కువగా చూడటం, కొన్ని వృత్తులను నిర్దిష్ట కులాలకు కట్టిపెట్టడం ఈ వ్యవస్థలోని అమానవీయతను చూపుతుంది. ముఖ్యంగా అంటరానితనం మనిషి గౌరవాన్నే నిరాకరించిన అత్యంత క్రూరమైన రూపం. రాజ్యాంగం దానిని నిషేధించినా, సామాజిక ఆచారాలు, కుల ఆధిపత్యం, ఆర్థిక ఆధారపడటం వంటి కారణాలతో దాని అవశేషాలు పూర్తిగా తొలగిపోలేదు.

**అంబేద్కర్ చూపిన మార్గం**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కుల వ్యవస్థను సామాజిక విభజనను శాశ్వతం చేసే నిర్మాణంగా ప్రశ్నించారు. రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే సరిపోదని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంపై ఆధారపడిన సామాజిక ప్రజాస్వామ్యం అవసరమని ఆయన స్పష్టం చేశారు. విద్య, సంఘటితం కావడం, హక్కుల కోసం పోరాడటం ద్వారా కుల వ్యవస్థ పునాదులను మార్చాలని ఆయన చూపించారు.

కులాన్ని ఆర్థిక అసమానతల నుంచి వేరు చేసి చూడలేం. చారిత్రకంగా భూమి, విద్య, వృత్తులు, వనరులు, అధికార అవకాశాలు సమానంగా పంపిణీ కాలేదు. భూమిలేని కూలీలు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, పట్టణ పేదల్లో అణగారిన వర్గాల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండటం దీనికి ఉదాహరణ. కాబట్టి కుల నిర్మూలనకు సామాజిక సమానత్వంతో పాటు ఆర్థిక ప్రజాస్వామ్యం కూడా అవసరం. భూమి, ఉపాధి, విద్య, ఆరోగ్యం, గృహం, తాగునీరు, సామాజిక భద్రత వంటి హక్కులు అందాలి.

కులం, వర్గం ఒకటే కాదు; అయితే అవి పరస్పరం ప్రభావితం చేసుకుంటాయి. కుల ఆధిపత్యం ఆర్థిక అవకాశాలను ప్రభావితం చేయగలదు. ఆర్థిక శక్తి కూడా కుల ఆధిపత్యాన్ని బలపరచవచ్చు. అందువల్ల కుల వివక్షకు వ్యతిరేక పోరాటం, ఆర్థిక దోపిడీకి వ్యతిరేక పోరాటం పరస్పర విరుద్ధాలు కావు. భారతీయ వాస్తవికతలో రెండింటినీ అనుసంధానంగా చూడాలి.

**విద్య, రిజర్వేషన్లు, అంతర్‌కుల వివాహాలు**

కుల నిర్మూలనకు విద్య అత్యంత శక్తివంతమైన సాధనం. పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య, ఉన్నత విద్య, వసతి, స్కాలర్‌షిప్‌లు, డిజిటల్ వనరులు అందాలి. విద్యాసంస్థల్లో కుల వివక్ష, అవమానం, బహిష్కరణ, హింసను అరికట్టేందుకు కఠిన చర్యలు అవసరం.

రిజర్వేషన్లు కుల వ్యవస్థను శాశ్వతం చేయడానికి కాదు; చారిత్రకంగా అవకాశాల నుంచి దూరమైన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రూపొందించిన సామాజిక న్యాయ విధానం. ప్రారంభ స్థితులు అసమానంగా ఉన్నప్పుడు అందరికీ ఒకే పోటీ నియమాలు పెట్టడం మాత్రమే నిజమైన సమానత్వాన్ని ఇవ్వదు. అందుకే సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక అవకాశాలు అవసరం.

కుల వ్యవస్థ పునరుత్పత్తికి కులాంతర వివాహాల నిరోధం కూడా ఒక ప్రధాన కారణం. అందువల్ల అంతర్‌కుల వివాహాలను ప్రోత్సహించి, వాటిని ఎంచుకునే జంటలకు కుటుంబ, సామాజిక ఒత్తిళ్లు, బెదిరింపులు, హింస నుంచి రక్షణ కల్పించాలి. ప్రేమ, వివాహం, వ్యక్తిగత స్వేచ్ఛను కుల గౌరవం పేరుతో నియంత్రించే ధోరణిని సమాజం తిరస్కరించాలి.



జనంసాక్షి

**కుల రాజకీయాలకు ముగింపు**

ప్రజాస్వామ్యంలో కుల గుర్తింపులు రాజకీయాలను ప్రభావితం చేస్తున్నప్పటికీ, కుల సమీకరణాలను ఎన్నికల లాభాల కోసం ఉపయోగించడం సమాజాన్ని మరింత విభజిస్తుంది. రాజకీయాల కేంద్రంగా ఉపాధి, విద్య, భూమి, గృహం, ఆరోగ్యం, సామాజిక భద్రత, సమాన హక్కులు ఉండాలి. కుల ఆధారిత ద్వేషాన్ని, ఒక వర్గాన్ని మరొక వర్గానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టే రాజకీయాలను ప్రజాస్వామ్య శక్తులు తిరస్కరించాలి.

కుల వ్యవస్థలో మహిళలపై నియంత్రణకు కూడా ప్రత్యేక స్థానం ఉంది. కుల "శుద్ధత" పేరుతో వివాహం, ప్రేమ, శరీరం, సంచారం వంటి అంశాలపై నియంత్రణ పితృస్వామ్యాన్ని బలపరుస్తుంది. కాబట్టి కుల నిర్మూలన మహిళా విముక్తితో అనుసంధానమై ఉండాలి. మహిళలకు విద్య, ఉపాధి, ఆస్తి హక్కు, రాజకీయ ప్రాతినిధ్యం, స్వేచ్ఛాయుత వివాహ హక్కు, భద్రత కల్పించాలి.

**చట్టంతో పాటు సామాజిక మార్పు**

రాజ్యాంగం సమానత్వానికి హామీ ఇచ్చి అంటరానితనాన్ని నిషేధించింది. కుల వివక్ష, హింస, సామాజిక బహిష్కరణకు వ్యతిరేకంగా చట్టపరమైన రక్షణలు ఉన్నాయి. కానీ చట్టం ఉండటం మాత్రమే సరిపోదు; సమర్థమైన అమలు కూడా అవసరం. బాధితులకు వేగవంతమైన న్యాయం, న్యాయ సహాయం, రక్షణ, పునరావాసం అందాలి. పోలీసు, న్యాయ, విద్యా, ప్రభుత్వ వ్యవస్థల్లో సామాజిక న్యాయంపై అవగాహన పెరగాలి. గ్రామీణ భారతదేశంలో భూమి యాజమాన్యం కుల ఆధిపత్యానికి ముఖ్యమైన భౌతిక పునాది. భూమిలేని కుటుంబాలు స్థానిక ఆధిపత్య వర్గాలపై ఆధారపడే పరిస్థితి ఉంటే సామాజిక సమానత్వం కష్టం. అందువల్ల భూ సంస్కరణలు, భూమిలేని పేదలకు వనరులు, సాగునీరు, కనీస వేతనాల అమలు వంటి అంశాలను కుల నిర్మూలనతో అనుసంధానించాలి. పట్టణాల్లోనూ ఉద్యోగాలు, అద్దె ఇళ్లు, వివాహ సంబంధాలు, సామాజిక నెట్‌వర్క్‌లలో కనిపించే కుల వివక్షను గుర్తించి ఎదుర్కోవాలి.

**ఏం చేయాలి?**

కుల వివక్షకు వ్యతిరేక చట్టాలను కఠినంగా అమలు చేయాలి. నాణ్యమైన ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి, రిజర్వేషన్లను సమర్థంగా అమలు చేయాలి. భూమిలేని పేదలకు భూమి, గృహం, ఉపాధి, సామాజిక భద్రత కల్పించాలి. అంతర్‌కుల వివాహాలకు రక్షణ, కుల ఆధారిత హింసకు వేగవంతమైన న్యాయం అందాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వివక్షను నిరోధించే వ్యవస్థలు బలోపేతం కావాలి. మానవ మలమూత్రాల చేతిపనిని పూర్తిగా నిర్మూలించాలి. పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ, మానవతా, సమానత్వ విలువలను బోధించాలి. కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, పేదలు సామాజిక న్యాయం కోసం ఐక్యంగా నిలవాలి.

కుల నిర్మూలన అంటే ఒక కులాన్ని మరొక కులానికి వ్యతిరేకంగా నిలబెట్టడం కాదు; పుట్టుక ఆధారంగా మనుషులను ఉన్నత–నీచులుగా విభజించే వ్యవస్థనే అంతం చేయడం. ప్రతి మనిషికి పుట్టుకతో సమాన గౌరవం ఉండాలి. అతని వృత్తి గౌరవాన్ని, కులం అవకాశాలను, కుటుంబ నేపథ్యం భవిష్యత్తును నిర్ణయించకూడదు. మనిషి విలువ అతని కులంలో కాదు, మానవత్వంలో ఉండాలి.

భారతదేశం రాజకీయంగా స్వతంత్రం అయినప్పటికీ సామాజిక సమానత్వం ఇంకా సంపూర్ణం కాలేదు. కుల వ్యవస్థను చట్టంతో మాత్రమే కాదు, ప్రజల ఆలోచనలు, సామాజిక సంబంధాలు, విద్య, భూమి, ఉపాధి, ఆస్తి, రాజకీయ అధికారంలో మార్పులతోనే బలహీనపరచగలం. అంబేద్కర్ ప్రతిపాదించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని సామాజిక ఉద్యమాలతో అనుసంధానించాలి. కుల ఆధిపత్యాన్ని ప్రశ్నించడంతో పాటు ఆర్థిక దోపిడీని కూడా ఎదుర్కోవాలి. మన లక్ష్యం కులం లేని, వివక్ష లేని, దోపిడీ లేని సమాజం. ప్రతి మనిషికి సమాన గౌరవం, సమాన అవకాశాలు, స్వేచ్ఛ కలిగిన సమాజం నిర్మించడమే కుల నిర్మూలనకు అసలు అర్థం. కుల నిర్మూలన కేవలం సామాజిక సంస్కరణ కాదు భారత ప్రజాస్వామ్యాన్ని సంపూర్ణం చేసే చారిత్రక అవసరం. కులం కాదు మనిషే ముఖ్యం పుట్టుక కాదు, మానవత్వమే మనిషి విలువ.



**మాలోతు సాగర్**
**సామాజిక వేత్త**
**సెల్ నెం 7013805411**

# కొండెక్కిన నిత్యవసర వస్తువులు-కూరగాయల ధరలు



వంటింటి పొయ్యి వెలిగితేనే కుటుంబ జీవితం సజావుగా సాగుతుంది. కానీ ఆ పొయ్యి మీద గిన్నె పెట్టే ప్రతి కుటుంబానికీ ఇప్పుడు ధరల మంట తప్పడం లేదు. పేదవాడి పళ్లెం నుంచి మధ్యతరగతి కుటుంబం నెలవారీ బడ్జెట్ వరకు ద్రవ్యోల్బణం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. జీతం పెరగకముందే కిరాణా బిల్లు పెరగడం, ఆదాయం పెరుగుదల కంటే ఖర్చులు వేగంగా పరుగెత్తడం సామాన్యుడి ఆందోళనకు కారణమవుతోంది. ఒకవైపు బియ్యం, పప్పులు, నూనెలు, చక్కెర వంటి నిత్యావసరాలు.. మరోవైపు కూరగాయలు, ఉల్లి, వెల్లుల్లి, మిరప వంటి వంటింటి సరుకుల ధరలు కుటుంబ ఆర్థిక లెక్కలను తలకిందులు చేస్తున్నాయి. ఇది కేవలం మార్కెట్‌లో ధరల మార్పు మాత్రమే కాదు. ఆహార ధరలు పెరిగితే కుటుంబాలు ముందుగా తగ్గించేది పోషకాహారాన్నే. పండ్లు, పాలు, కూరగాయలు, పప్పుల వినియోగం తగ్గితే దాని ప్రభావం ప్రజల ఆరోగ్యంపైనా పడుతుంది. అందుకే నిత్యావసరాల ధరల నియంత్రణ అనేది కేవలం ఆర్థిక అంశం కాదు.. ప్రజా సంక్షేమానికి సంబంధించిన అత్యంత కీలకమైన బాధ్యత.

జనంసాక్షి

**వంటింటి బడ్జెట్‌ను కుదిపేస్తున్న ధరల మంట**

కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ధరల పర్యవేక్షణ గణాంకాల ప్రకారం 2026 ఆగస్టు 23న దేశవ్యాప్తంగా సుమారు సగటు చిల్లర ధర బియ్యం కిలోకు 45–70, కందిపప్పు 122.12, మినపప్పు 121.76, పెసరపప్పు 110.76, చక్కెర 62.47, బెల్లం 64.79గా నమోదైంది. వంటనూనెల ధరలు కూడా సాధారణ కుటుంబాలపై భారాన్ని పెంచుతున్నాయి. కూరగాయల్లో ఉల్లి ధరలు ప్రత్యేకంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఆగస్టు 23 నాటికి దేశ సగటు చిల్లర ధర కిలోకు 42.04గా ఉండగా, కొన్ని ప్రాంతాల్లో స్థానిక సరఫరా పరిస్థితుల కారణంగా ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఉల్లి ధరలు జూన్‌లో కిలోకు సుమారు ?25 ఉండగా ఆగస్టులో కొన్ని మార్కెట్లలో 60వరకు చేరినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి.

చక్కెర ధరల పెరుగుదల కూడా ప్రత్యేకంగా గమనించాల్సిన పరిణామం. పండుగలు, శుభకార్యాల సీజన్ సమీపిస్తున్న వేళ చక్కెరకు డిమాండ్ పెరుగుతోంది. దేశీయ చక్కెర ధరలు రెండు నెలల్లో దాదాపు 40 శాతం పెరిగిన నేపథ్యంలో, ధరలను అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం ఒక మిలియన్ టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతించింది. ఈ పరిస్థితుల్లో శుభకార్యాలు, పండుగలు నిర్వహించే కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. పిండి వంటలకు చక్కెర, బెల్లం, నూనె, పప్పులు, నెయ్యి.. పూజలకు పూలు, పండ్లు.. అన్నింటి ధరలు పెరిగితే ఒక చిన్న కుటుంబ కార్యక్రమం కూడా మధ్యతరగతి కుటుంబానికి పెద్ద ఆర్థిక భారంగా మారుతుంది.

**ఆహార ద్రవ్యోల్బణానికి కారణాలెన్నో.. పరిష్కారం మాత్రం అవసరం**

ధరల పెరుగుదలకు ఒక్క కారణాన్నే చూపడం సరికాదు. ఉత్పత్తి తగ్గడం, వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, పంట నష్టాలు, నిల్వల వ్యయం, రవాణా ఖర్చులు, సరఫరా అంతరాయాలు, మార్కెట్‌లో మధ్యవర్తుల ప్రభావం వంటి అనేక అంశాలు ధరలపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా కూరగాయలు, ఉల్లి వంటి త్వరగా పాడయ్యే ఉత్పత్తుల్లో ధరల హెచ్చుతగ్గులు ఎక్కువగా ఉంటాయి. క్రిసిల్ తాజా 'రోటీ రైస్ రేట్' నివేదిక ప్రకారం 2026 జూలైలో ఇంట్లో తయారు చేసే శాఖాహార భోజనం ఖర్చు ఏడాది ప్రాతిపదికన 4 శాతం, మాంసాహార భోజనం ఖర్చు 9 శాతం పెరిగింది. ఉల్లి, వంటనూనె, ఎల్పీజీ ధరలు దీనికి ప్రధాన కారణాలుగా పేర్కొంది. ఉల్లి ధర ఏడాది కాలంలో 20 శాతం పెరిగినట్లు కూడా నివేదిక తెలిపింది.

ఇక జూలై 2026లో దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 4.45 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం 5.52 శాతానికి పెరిగింది. మొత్తంగా రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్బీఐ లక్ష్యమైన 4 శాతాన్ని వరుసగా రెండో నెల అధిగమించింది.

ధరలు పెరిగిన ప్రతిసారీ ప్రభుత్వాలు వాతావరణ పరిస్థితులను, ఉత్పత్తి తగ్గుదలను కారణాలుగా చూపడం సహజమే. అవి వాస్తవ కారణాలే అయినా.. వినియోగదారుడికి మాత్రం కారణం కంటే ఉపశమనం ముఖ్యం. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ధరల పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చూడడంతోపాటు వినియోగదారుడిపై అనవసర భారాన్ని పడకుండా సరఫరా గొలుసులోని లోపాలను సరిదిద్దాలి. నిల్వ సదుపాయాలు పెంచడం, పంటల ముందస్తు అంచనాలు రూపొందించడం, అవసరమైన చోట బఫర్ స్టాక్‌లను విడుదల చేయడం, అక్రమ నిల్వలు–కృత్రిమ కొరతపై కఠిన చర్యలు తీసుకోవడం, రైతు నుంచి వినియోగదారుడి వరకు మధ్యవర్తిత్వ వ్యయాన్ని తగ్గించడం వంటి చర్యలు అత్యవసరం. ఉల్లి ధరల పెరుగుదలను అరికట్టేందుకు బఫర్ స్టాక్‌ను వినియోగించి ప్రత్యేక రవాణా చర్యలు చేపట్టడం వంటి నిర్ణయాలు కూడా ప్రభుత్వం తీసుకుంది.

**ధరల నియంత్రణలో తక్షణ చర్యలే ప్రజలకు ఊరట**

నిత్యావసర వస్తువుల ధరలు పెరిగితే దాని ప్రభావం కేవలం వంటింటితో ఆగదు. ఆహారం, విద్య, వైద్యం, రవాణా, ఇల్లు వంటి ప్రతి అవసరంపై కుటుంబాల ఖర్చు పెరుగుతుంది. ఆదాయం పరిమితంగా ఉన్న పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలు పొదుపును తగ్గించుకోవాల్సి వస్తుంది. చివరకు అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. మధ్యతరగతి కుటుంబాలకూ నెలవారీ బడ్జెట్‌లో అత్యవసర ఖర్చుల వాటా పెరుగుతుంది. అందువల్ల ధరల పెరుగుదలను కేవలం గణాంకాలుగా కాకుండా ప్రజల జీవన వ్యయంగా ప్రభుత్వాలు చూడాలి. మార్కెట్‌లో సరఫరా–డిమాండ్ సమతుల్యత దెబ్బతినకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. రైతు ఉత్పత్తికి సరైన మార్కెట్ కల్పిస్తూనే వినియోగదారుడికి అందుబాటు ధరలో వస్తువులు లభించేలా విధానాలను రూపొందించాలి. రైతు, వ్యాపారి, వినియోగదారుడు ఈ మూడు వర్గాల ప్రయోజనాల మధ్య సమతుల్యతే స్థిరమైన పరిష్కారం.

ధరల మంటను ఆర్పడం ఒక్కరోజులో సాధ్యమయ్యే పని కాదు. కానీ సమర్థవంతమైన పర్యవేక్షణ, సరఫరా నిర్వహణ, నిల్వల నియంత్రణ, రైతుకు ప్రోత్సాహం, వినియోగదారుడికి రక్షణ వంటి చర్యలను సమన్వయంతో అమలు చేస్తే ధరల ఒత్తిడిని గణనీయంగా తగ్గించవచ్చు. వంటింటి పొయ్యి మీద మంట ఆహారాన్ని వండాలి.. కుటుంబాల ఆర్థిక భవిష్యత్తును కాల్చకూడదు. నిత్యావసరాల ధరలు సామాన్యుడి అందుబాటుకు దూరమైతే అభివృద్ధి గణాంకాలన్నీ అర్థరహితమే. అందుకే ప్రభుత్వాలు ధరల నియంత్రణను తాత్కాలిక చర్యగా కాకుండా నిరంతర ప్రజా విధానంగా చేపట్టాలి. పేదవాడి పళ్లెంలో అన్నం, మధ్యతరగతి ఇంట్లో ప్రశాంతత ఉండేలా 'అందుబాటు ధర--అందరికీ ఆహారం' అనే లక్ష్యంతో పాలన సాగినప్పుడే సంక్షేమ రాజ్యానికి నిజమైన అర్థం చేకూరుతుంది.



**మేకిరి దామోదర్**
**సామాజిక విశ్లేషకులు,**
**జిల్లా: వరంగల్,**
**ఫోన్ :9573666650**

# హబ్సిగూడలో గంజాయి కలకలం

- 100 ప్యాకెట్ల గంజాయి స్వాధీనం..
- 735 గ్రాముల నిషేధిత సరుకు పట్టివేత



**ఉప్పల్, ఆగస్టు 24 (జనం సాక్షి):** హబ్సిగూడలో మేడ్చల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో 100 ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకుంది. మొత్తం 735 గ్రాముల గంజాయి పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టిన అధికారులు, గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా సిద్ధం చేసి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న నిందితులను అదుపులోకి తీసుకున్న అధికారులు, గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి తరలిస్తున్నారు? సరఫరా వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా విక్రయిస్తున్న ముఠాలతో సంబంధాలపైనా ఆరా తీస్తున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులను తదుపరి చర్యల కోసం ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. హబ్సిగూడ, ఉప్పల్ పరిసరాల్లో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై నిఘాను మరింత ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు.



# నిమ్స్‌లో ఫీటల్ ఎకోకార్డియోగ్రఫీపై రాష్ట్రస్థాయి సీఎంఈ

**ఖైరతాబాద్, ఆగస్ట్ 24 (జనం సాక్షి) :** నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) కార్డి యాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫెటల్ ఏకోకార్డి యోగ్రఫీ ఫ్రంబేసిక్స్ టూ ఎక్స్పర్టిస్' అంశంపై రాష్ట్ర స్థాయి నిరంతర వైద్య విద్యా కార్యక్రమం(సీఎంఈ) సోమవారం నిమ్స్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్టులు, రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులు పాల్గొన్నారు. పిండం గుండె పరీక్షలు, పుట్టుకతో వచ్చే గుండె జబ్బుల (సీహెచ్డీ) ముందస్తు నిర్ధారణ, గుండె రిథమ్ సమ స్యల నిర్వహణ తదితర అంశాలపై నిపుణులు ప్రసంగాలు, చర్చలు నిర్వహించారు. డా.సలోమి, డా.కవిత చింతల, డా.నితిన్ రావు, డా.ప్రవీణ్ శాస్త్రీయ అంశాలపై ప్రసంగించారు. డా.టి.సదానంద్ రెడ్డి, డా.రాజని, డా.కె.ఉమాదేవి, డా.ప్రవీణ్ ఆధ్వ ర్యంలో ప్రత్యక్ష కేసుల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగింపులో క్విజ్ పోటీ నిర్వహిం చి విజేతలకు బహుమతులు అందజేశారు. అనం తరం డా.రమా కుమారి ఎన్ వాలెడిక్టరీ ప్రసంగం తో సీఎంఈ ముగిసింది. ఈ కార్యక్రమానికి 2 టీఎస్ ఎంసిఐ క్రెడిట్ గంటలు లభించాయి. ఈ సదస్సులో కార్డియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డా.ఎన్.రమా కుమారి, సీనియర్ కార్డియాలజిస్టు లు ప్రొ.డా.ఓ.సాయి సతీష్, ప్రొ.డా.బి.శ్రీనివాస్, ప్రొ.డా.దయాసాగర్ రావు, డా.నర్మద, డా.టి. సదానంద్ రెడ్డి, డా.రాజని, డా.కవిత చింతల, డా.కె.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



# కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడండి

**కేశంపేట, ఆగస్టు 24 (జనం సాక్షి) :** మండల పరిధిలోని మంగలి గూడ గ్రామ పంచాయతీ రెవెన్యూ శివారు ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామ సర్పంచ్ కొట్టం నరేందర్ రెడ్డి అధికారులను కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గ్రామ స్తులతో కలిసి ఎంపీడీఓ రవిచంద్ర కుమార్ రెడ్డికి సర్పంచ్ నరేందర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. గతంలో సర్వే నెంబర్ 140 లో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమికి హద్దు రాళ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూమిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నీరు నిల్వ ఉండేం దుకు ఇంకుడు గుంతను తవ్వించడం జరిగిం దని తెలిపారు. ఈ నెల 20 వ తేదీన సర్వే నెంబర్ 134 కు చెందిన రైతు తన భూమిలో కాకుండా సర్వేనెంబర్ 140 లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కడీలు పాతి ఆక్రమిం చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. రీ సర్వే జరిపి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని నరేందర్ రెడ్డి కోరారు.

# గ్రామ, వార్డు సభలు సజావుగా నిర్వహించాలి




- ఈ నెల 27 నుంచి నిర్వహణ
- కలెక్టర్ రాజర్షి షా

**మావల ఆగస్ట్ 25( జనం సాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఈ నెల 27 వ తేదీ నుంచి నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సోమవారం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్వైజర్లు ఈ ప్రక్రియను సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. గ్రామ, వార్డు సభల్లో ముసాయిదా ఓటరు జాబితా, ఏఎస్‌డీ జాబితాలను తప్పకుండా చదివి వినిపించాలని తెలిపారు. డెత్ కేసులు, షిఫ్టెడ్, డబుల్ ఎంట్రీలు ఏమైనా ఉంటే వాటిని వెంటనే ఏఎస్‌డీ జాబితాలో చేర్చాలని, ఒకవేళ పొరపాటున ఏఎస్‌డీ జాబితాలో వస్తే ఫారం-6 ద్వారా సరిచేయాలని పేర్కొన్నారు. ఫారం-6, డిక్లరేషన్ ఫారాలను ముందుగానే సిద్ధం చేసుకుని, ఆయా సభల్లో ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, జీపీవో, బీఎల్‌వో, బీఎల్‌వో సూపర్వైజర్లు అందరూ సమన్వయంతో పని చేసి ఓటర్ల జాబితా ప్రక్షాళనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోలింగ్ స్టేషన్ వారీగా ఓటర్ల జాబితాను అందరి ముందు చదివి వినిపించి, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందే సమాచారం అందించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, పర్యవేక్షకురాలు నలంద ప్రియా, తహసిల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ ఉద్యమ నిర్మాత సారంపల్లి మల్లారెడ్డి ఇకలేరు

- రైతు ఉద్యమాల నిర్మాణంలో కీలక పాత్ర
- కష్టజీవుల కడగండ్లు పాపిన నాయకుడు..



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 24 (జనం సాక్షి):** సీపీఐ-ఎం సీనియర్ నాయకులు, రైతాంగ ఉద్యమ నిర్మాత, రైతు సంఘం అఖిల భారత నాయకులు సారంపల్లి మల్లారెడ్డి (86) సోమవారం ఉదయం మూడు గంటలకు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. వరంగల్ జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉన్న మల్లారెడ్డి నర్సంపేట నియోజకవర్గం లోని దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామాలో జన్మించారు. వయోరిత్యా శ్వాసకోశ సమస్య రావటంతో నాలుగు రోజుల క్రితం ఆయన్ను కుటుంబ సభ్యులు నిమ్స్ దవాఖానకు తీసుకెళ్లారు. అప్పటి నుంచి అక్కడే చికిత్సపొందుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఆరోగ్యం మరింత క్షీణించటంతో వైద్యులు అత్యవసర వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. సోమవారం తెల్లవారుజామున 3.30గంటలకు మల్లారెడ్డి తుదిశ్వాస విడిచారు. మృతదేహాన్ని నిమ్స్ మార్చురీ లో భద్రపరిచారు. అభిమానుల సందర్శనార్ధం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకు ఎంబీ భవన్‌లో మల్లారెడ్డి పార్థివదేహాన్ని ఉంచనున్నారు. మల్లారెడ్డి స్వస్థలం వరంగల్ జిల్లా నర్సంపేట. అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా ఉన్న మల్లారెడ్డి, దశాబ్దాలుగా రైతుల సమస్యలపై పోరాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భాగంగా నాయకులతో పరిచయం పెంచుకొని కమ్యూనిస్టు బీజాలు వంట పట్టించుకుని రహస్య కార్యకర్తలతో వరంగల్ జిల్లాతో పాటు నర్సంపేట నియోజకవర్గం లో ఓంకార్ అడుగుజాడల్లో నడిచి కమ్యూనిస్టు భావాజాలాన్ని వ్యాపింపచేసాడు. దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట పంచాయతీ సర్పంచిగా ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ గా జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ గా సేవలందించారు. తిమ్మంపేట గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యమంలో కీలకంగా పాల్గొని సేవలు అందిచారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోరుగల్లు గా గర్జించిన నాయకుడు వరంగల్ పట్టణంలో కష్టజీవుల హక్కుల కోసం పరితపించిన నిబద్ధత కమ్యూనిస్టు నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి సోమవారం ఉదయం మరణించారనే వార్త వరంగల్ జిల్లాకు తెలియడంతో ఒక్కసారిగా కమ్యూనిస్టు పార్టీ నాయకులకు సారంపల్లి మల్లారెడ్డి మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. సుమారు 50 సంవత్సరాల కమ్యూనిస్టు ఉద్యమ గతంలో అలుపెరుగని పోరాటం చేసి వరంగల్ జిల్లాలో విద్యార్థి ఉద్యమాన్ని యువజన ఉద్యమాన్ని కష్టజీవుల కోసం ఇండ్లు ఇండ్ల స్థలాల పట్టాల కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత నేత సారంపల్లి మల్లారెడ్డి చేసిన సేవలు మహోన్నతమైనవిని కమ్యూనిస్టు నాయకులు కొనియాడుతున్నారు. వరంగల్ జిల్లాలో సాగునీటి రంగంలో దేవాదుల ప్రాజెక్టు ఎస్ ఆర్ ఎస్ పి మోరువంచ ఉప కాలువ వ్యవసాయ కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా, అఖిలభారత కి శాన్సభ ఉపాధ్యక్షులుగా ఆయన సేవలు అందించారు. రైతాంగ, వ్యవసాయ కార్మిక ఉద్యమాల నిర్మాణంలో ఆయనతో కలిసి పనిచేసిన నాయకులు ఎన్నటికీ మరచిపోలేనిదని వివరించారు.

### రైతాంగ ఉద్యమానికి తీరని లోటు

రైతాంగ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో, పేద రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం పోరాడటంలో మల్లారెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. ఆయన మరణం రైతాంగ ఉద్యమానికి, వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ రుణాలు, విత్తనాలు వంటి వ్యవసాయ రంగానికి సంబంధించిన విస్తృత అంశాలపై నిరంతరం కృషి చేస్తూ జీవితాన్ని రైతుల సంక్షేమం కోసం అంకితం చేసిన నాయకుడు మల్లారెడ్డి అని పేర్కొన్నారు. ఆయనకు భార్య భాగ్యలక్ష్మి, కుమారులు వాసుదేవరెడ్డి, మధుసూధన్ రెడ్డి, కుమార్తెలు అనిత, సునీత ఉన్నారు. అనారోగ్య కారణాలతో పెద్ద కూతురు అనిత ఇటీవలే మరణించారు. మల్లారెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించ మృతదేహాన్ని మెడికల్ విద్యార్థుల కోసం అప్పగించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# యాచారం - మీర్‌ఖాన్‌పేట్ రోడ్డుకు మోక్షమెప్పుడు?

- రూ. 84.50 కోట్లతో శంకుస్థాపన చేసినా ఆగిన పనులు
- కంకర తేలి, గుంతలమయంగా మారిన ప్రధాన రహదారి
- టిజీ ఐఐసి , ఆర్ అండ్‌బి శాఖల నిర్లక్ష్యంపై మండిపడుతున్న ప్రజలు





**యాచారం, ఆగస్టు 24 (జనంసాక్షి) :** శ్రీశైలం - నాగార్జునసాగర్ రహదారులను కలిపే కీలకమైన యాచారం - మీర్‌ఖాన్‌పేట్ రహదారి నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగకపోవడంపై స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2019లో అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు రూ. 84.50 కోట్ల నిధులతో ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపన చేసినప్పటికీ, నేటికీ పునాదులు పడకకపోవడం విచారకరం. విస్తరణ పేరుతో అప్పటివరకు బాగున్న 15 ఫీట్ల రోడ్డును తవ్వేసి మట్టి నేలగా మార్చడంతో, ప్రస్తుతం కంకర తేలి బాటసారులకు నరకయాతన చూపిస్తోంది. వర్షాలకు గుంతలు, బురద పేరుకుపోయి యాచారం, నంది వనపర్తి వైపు వెళ్లే విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు అవసరం లేని ఫార్మాసిటీ, మేడిపల్లి రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతుంటే, నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ ప్రధాన రహదారిని పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిజీ ఐఐసి , ఆర్ అండ్ బి శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల పనులు "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్న చందంగా తయారయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి రహదారి పునరుద్ధరణ పనులు చేపట్టి కనీస సౌకర్యాలు కల్పించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



### ఉపరితల గనిలో భారీ క్రేన్‌ను ప్రారంభించిన జీఎం

**శ్రీరాంపూర్ (జనంసాక్షి):** శ్రీరాంపూర్ ఉపరితల గనిలో 12 టన్నుల క్రేన్ ను శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి జిఎం మునిగంటి శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. జిఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాకు ఎస్ఆర్పి ఉపరితల గని గుండె లాంటిదని,నిర్దేశిత ఉత్పత్తి తో పాటు ఏరియా ఉత్పత్తి సాధనకు శ్రీరాంపూర్ ఉద్యోగులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏరియాలలో పక్కన పెట్టిన బిఈఎల్ డంపర్లు, ఇతర భారీ యంత్రాలతో బొగ్గు ఉత్పత్తి, ఓబి తొలగింపు సాధించిన చరిత్ర ఉపరితల గని ఉద్యోగులకే దక్కుతుందన్నారు. యంత్రాలను నూటికి నూరు శాతం వినియోగించుకున్నప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యం అవుతాయి అన్నారు. మెటీరియల్స్ సమస్య పరిష్కారంతో పాటు ఇతర వసతులు త్వరలోనే కల్పిస్తామని రక్షణతో కూడిన ఉత్పత్తి సంస్థ అభ్యున్నతికి ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం.కృష్ణ ప్రసాద్, గుర్తింపు సంఘం నాయకులు,అధికారులు సిహెచ్ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సురేష్, నాగరాజు, శ్రీకాంత్, ఓంకారి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ఆటోడ్రైవర్‌పై దాడి.. ముగ్గురికి జైలు



**సంజీవ్ రెడ్డి నగర్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** మద్యం మత్తులో ఆటోడ్రైవర్‌ను బెదిరించి, అతని ఆటోను ధ్వంసం చేసిన ముగ్గురు వ్యక్తులకు కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఖైరతాబాద్‌కు చెందిన ఆటోడ్రైవర్ మెరుగు శ్రీనివాస్ ఈ నెల 21న సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బల్కంపేటలోని లక్ష్మి వైన్స్ వద్ద ఉన్నారు. అదే సమయంలో మద్యం మత్తులో ఉన్న ముగ్గురు ఆటోడ్రైవర్లు మహేష్ (26), బల్కంపేట, జై శ్రీకాంత్ (26), కేపీహెచ్‌బీ కాలనీ, జి.లింగమహేష్ (27), మూసాపేట.. శ్రీనివాస్‌ను బెదిరించి, ఆయన ఆటో ముందు భాగాన్ని ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితులను సోమవారం 11వ స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన 11వ స్పెషల్ జేఎంఎస్సీ మెజిస్ట్రేట్ పి. నర్సింహారావు, ముగ్గురు నిందితులకు మూడు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

# సీఓఈలో అసలేం జరుగుతుంది

- నాడు ఉత్తమ ఫలితాలు
- నేడు చదువు కోసం విద్యార్థుల తండ్లాట
- సమస్యల పరిష్కారం కోసం పరారైనా విద్యార్థులు



**బెల్లంపల్లి, ఆగస్టు 24, (జనంసాక్షి) :** ఆ విద్యాసంస్థలో సీటు వస్తే చాలు అనుకునే స్థాయి నుంచి ఇందులో ఎందుకు చేరాము అనే స్థాయికి బెల్లంపల్లి సీఓఈ దిగజారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ఉన్నప్పుడు ఈకాలేజీ నుంచి రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన ఘనత. ప్రస్తుతం కాలేజీ విద్యా ప్రమాణాలు పడిపోయి ఏకంగా విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలని కళాశాల గోడ దూకి ఉన్నతాధికారులకు సమస్యలను విన్నవించడానికి బయలుదేరారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందొ అర్థం చేసుకోవచ్చు. వివరాల్లోకి వెళితే బెల్లంపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల సీఓఈ పాఠశాలలో విద్యార్థుల సమస్యలు ఆందోళనకు దారితీశాయి. సరైన స్థాయిలో విద్యాబోధన అందించే సిబ్బంది లేకపోవడంతో చదువులు దెబ్బతింటున్నాయని విద్యార్థులు చాలాకాలంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థుల్లో అసంతృప్తి పెరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 2.30 ప్రాంతంలో సుమారు 35 మంది విద్యార్థులు గోడ దూకి పాఠశాల నుంచి బయటకు వచ్చారు. తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి నేరుగా తీసుకెళ్లాలని నిర్ణయించుకున్న విద్యార్థులు బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుని భాగ్యనగర్ రైలు ఎక్కి హైదరాబాద్ వెళ్లేందుకు ప్రయత్నించారు. హైదరాబాద్‌కు వెళ్లి సంబంధిత అధికారులను కలవడంతో పాటు, అవసరమైతే మంత్రిని కలిసి తమ సమస్యను వివరిస్తే పరిష్కారం లభిస్తుందని విద్యార్థులు భావించారు. అయితే విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వచ్చిన విషయం తెలుసుకున్న వార్డెన్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను తెలుసుకుని వారికి నచ్చజెప్పి తిరిగి పాఠశాలలోకి పంపించారు. చదువుకోవాల్సిన వయసులో తమ చదువుల కోసం విద్యార్థులు గోడ దూకి రైలెక్కే పరిస్థితి ఎందుకొచ్చింది? అన్న ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. విద్యార్థులు చాలాకాలంగా చెబుతున్న సమస్యలను అధికారులు ముందుగానే పరిష్కరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గురుకులంలో విద్యాబోధనకు సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు, విద్యార్థుల సమస్యలను అధికారులు స్వయంగా తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. విద్యార్థులు గోడ దూకే వరకు పరిస్థితి వెళ్లడంతో గురుకుల విద్యా వ్యవస్థలో పర్యవేక్షణ ఎలా ఉందన్న ప్రశ్నను లేవనెత్తుతోంది.

### ఫ్యాకల్టీ నియమించాం : విజయసాగర్, ప్రిన్సిపాల్ సీఓఈ, బెల్లంపల్లి

విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి జువాలజీ ఫ్యాకల్టీ లేని విషయం వాస్తవమే. శనివారం నాడే కొత్త ఫ్యాకల్టీని నియమించినట్లు ఆదేశాలు వచ్చాయి. కొత్తగా రావాల్సిన ఫ్యాకల్టీ విధుల్లో హాజరు కావడమే మిగిలి ఉంది. కాగా ఈవిషయం తెలియని విద్యార్థులు వాళ్లకు వాళ్లే ఏదో ఊహించుకొని సమస్యను పెద్దగా చేయడానికి ప్రయత్నం చేశారని సీఓఈ ప్రిన్సిపాల్ విజయసాగర్ వివరణ ఇచ్చారు.

# నాటు బాంబు నిందితులను పట్టుకున్న పోలీసులు

- జనం సాక్షి కథనానికి స్పందన
- వివరాలు వెల్లడించిన ఎస్సై సుధాకర్





నాటుబాంబు కేసులో విచారణ ముమ్మరం

**రేగొండ, ఆగస్టు24( జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గుడేపల్లి గ్రామంలో శనివారం నాటు బాంబు పేలి మహిళా కూలికి గాయాలైన ఘటన లో నిందితులను పోలీసులు పట్టుకున్నారు. సంబంధిత వివరాలను సోమవారం ఎస్సై సుధాకర్ పత్రికా ముఖంగా వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...భాగిర్తిపేట ఆర్చ్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంబడించిన పోలీసులు వారిని భాగిర్తిపేట గ్రామానికి చెందిన పసునూటి రమేష్(50),దేవరకొండ సారంగం(53)గా గుర్తించారు. వారిని పట్టుకొని తనిఖీ చేయగా రమేష్ వద్ద 04 నాటు బాంబులు,సారంగం వద్ద 01 నాటు బాంబు ఉన్నట్లు గుర్తించారు. ఇట్టి బాంబులను గణపురం మండలం బుర్రకాయల గూడెం గ్రామానికి చెందిన బుర్ర మల్లయ్య వద్ద నుండి ఒక్కొక్కటి 300 వందల చొప్పున 10 నాటు బాంబులను కొనుగోలు చేసి గుడేపల్లి అటవీ ప్రాంతం సమీపంలోని వ్యవసాయ భూమిలో అడవి పందుల కోసం పాతి పెట్టగా ఈ నెల 22 న అదే గ్రామానికి చెందిన గుండె స్వర్ణలత అదే భూమిలో కలుపు తీస్తుండగా పొరపాటున కొడవలి బాంబుకు తగలడంతో పేలి ఆమెకు గాలైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటన అనంతరం మిగిలిన బాంబులను దూరంగా ఉన్న చెరువులో పడవేయడానికి తీసుకెళ్తుండగా పోలీసులు ఎదురవడంతో భయపడి పారిపోతుండగా పట్టుబడినట్లు నిందితులు వెల్లడించారు. పట్టుకున్న 5 నాటు బాంబులను పంచుల సమక్షంలో పంచనామ నిర్వహించి స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తులో భాగంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

# సంగారెడ్డి కాంగ్రెస్‌కు కాబోయే రథసారథి ఎవరు..?

- డీసీసీ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ..
- నిర్మలా జగ్గారెడ్డి కొనసాగింపునకు కార్యకర్తల మొగ్గు ఉందా?
- మంత్రి దామోదర వర్గం ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు..
- నారాయణఖేడ్ నుంచి మరో పేరు తెరపైకి..?



**సంగారెడ్డి ఆగస్టు 24 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌లో డీసీసీ అధ్యక్ష పదవి మరోసారి రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. జిల్లా కాంగ్రెస్‌కు కొత్త రథసారథి ఎవరు? ప్రస్తుత డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డినే కొనసాగిస్తారా? లేక కొత్త వ్యక్తికి అవకాశం కల్పిస్తారా? అనే చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. డీసీసీ అధ్యక్ష పదవి ఎంపిక కోసం అధిష్ఠానం స్థాయిలో అభిప్రాయ సేకరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది. ఇటీవల జరిగిన పార్టీ కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోల్ల సంజీవ రెడ్డి తదితర ముఖ్య నాయకులు పాల్గొంటుండటం కూడా ఈ ఎంపికకు ప్రాధాన్యతను పెంచుతోంది.

### నిర్మలా జగ్గారెడ్డికే మరోసారి అవకాశం ఇవ్వాలా..?

జిల్లా కాంగ్రెస్‌లో పార్టీ కార్యకర్తలతో సమన్వయం, సంస్థాగత కార్యక్రమాల నిర్వహణలో నిర్మలా జగ్గారెడ్డి కొనసాగుతున్న పాత్రను దృష్టిలో ఉంచుకుని ఆమెనే మరోసారి డీసీసీ అధ్యక్షురాలిగా కొనసాగించాలని ఒక వర్గం కోరుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది. ఇప్పటికే నిర్మలా జగ్గారెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశాలు నిర్వహించబడ్డాయి. జూలైలో సంగారెడ్డిలో జరిగిన కాంగ్రెస్ విజయ ర్యాలీలోనూ ఆమె పాల్గొన్నారు. దీంతో ప్రస్తుత అధ్యక్షురాలి కొనసాగింపుపై పార్టీలో చర్చకు ప్రాధాన్యత ఏర్పడింది.

### మంత్రి దామోదర ప్రతిపాదన ఎవరికి..?

మరోవైపు మంత్రి దామోదర రాజనర్సింహ మద్దతుతో ఒక కొత్త పేరును డీసీసీ అధ్యక్ష పదవికి ప్రతిపాదిస్తున్నారనే ప్రచారం గతంలోనూ జరిగింది. గతంలో జహీరాబాద్‌కు చెందిన ఉజ్వల్ రెడ్డి పేరు బలంగా వినిపించగా, ఆయనకు మంత్రి దామోదరతో పాటు పలువురు ముఖ్య నాయకుల మద్దతు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఆ ఎంపికపై జిల్లా కాంగ్రెస్‌లో ఏకాభిప్రాయం ఏర్పడకపోవడంతో ప్రక్రియ ఆలస్యమైనట్లు అప్పట్లో కథనాలు వెలువడ్డాయి.

దీంతో ఇప్పుడు మరోసారి డీసీసీ ఎంపిక వ్యవహారం తెరపైకి రావడంతో పాత పరిణామాలు, కొత్త సమీకరణాలపై కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

జగ్గారెడ్డి వ్యాఖ్యలు ఎందుకు ప్రాధాన్యం సంతరించుకున్నాయి..?

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న జగ్గారెడ్డి సంగారెడ్డి కాంగ్రెస్ రాజకీయాల్లో కీలక నేత. డీసీసీ అధ్యక్ష పదవి ఎంపిక విషయంలో మంత్రి దామోదర రాజనర్సింహ అభిప్రాయానికి ప్రాధాన్యం ఉందనే అంశంపై ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి.

జిల్లాలోని ముఖ్య నేతల మధ్య సమన్వయం లేకపోతే పార్టీ సంస్థాగత బలోపేతంపై ప్రభావం పడే అవకాశం ఉండటంతో డీసీసీ ఎంపిక విషయంలో అధిష్ఠానం తీసుకునే నిర్ణయం కీలకంగా మారింది.

### నారాయణఖేడ్ నుంచి మరో ప్రతిపాదన..?

ఇదిలా ఉంటే నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోల్ల సంజీవ రెడ్డి వర్గం నుంచి కూడా డీసీసీ అధ్యక్ష పదవికి తమకు అనుకూలమైన నాయకుడి పేరును ప్రతిపాదించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఉంది.

నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన నాయకత్వానికి జిల్లా స్థాయిలో కీలక బాధ్యత ఇవ్వాలనే అభిప్రాయం ఒకవైపు ఉంటే, జిల్లా మొత్తాన్ని సమన్వయం చేయగల నాయకత్వం అవసరమనే వాదన మరోవైపు వినిపిస్తోంది.

### అధిష్ఠానం నిర్ణయంపైనే అందరి చూపు

సంగారెడ్డి డీసీసీ అధ్యక్ష ఎంపిక సాధారణ నియామకం కాకుండా జిల్లాలోని కాంగ్రెస్ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అంశంగా మారింది. ఒకవైపు ప్రస్తుత నాయకత్వ కొనసాగింపు, మరోవైపు కొత్త నాయకుడికి అవకాశం, ఇంకోవైపు వివిధ వర్గాల అభిప్రాయాలు.. ఇలా డీసీసీ పీఠం చుట్టూ రాజకీయ ఉత్కంఠ నెలకొంది.

చివరకు అధిష్ఠానం ఎవరికి అవకాశం ఇస్తుంది? నిర్మలా జగ్గారెడ్డికే మరోసారి బాధ్యతలు అప్పగిస్తుందా? లేక కొత్త ముఖాన్ని తెరపైకి తీసుకువస్తుందా? మంత్రి దామోదర రాజనర్సింహ అభిప్రాయానికి ఎంత ప్రాధాన్యం లభిస్తుంది? నారాయణఖేడ్ వర్గం ప్రతిపాదనకు అధిష్ఠానం ఎలా స్పందిస్తుంది? అన్నదే ఇప్పుడు సంగారెడ్డి కాంగ్రెస్‌లో ప్రధాన చర్చగా మారింది. డీసీసీ పీఠం ఎవరికి దక్కినా.. ఆ నిర్ణయం సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌లో భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు దిశానిర్దేశం చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతు ఉద్యమానికి తీరని లోటు




**సంగారెడ్డి, ఆగస్టు 24 (జనం సాక్షి) :** రైతు సంఘం అఖిల భారత నాయకులు సారంపల్లి మల్లారెడ్డి సోమవారం ఉదయం 3 గంటలకు హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. వారి మరణం పట్ల తెలంగాణ రైతు సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలభవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అనిపించారు ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ రైతాంగ సమస్యల పైన, తెలంగాణ ప్రాజెక్టుల పైన, విద్యుత్ సంస్కరణ పైన, భూ సంస్కరణ పైన.నిరంతరంఅధ్యయనం చేస్తూ ప్రభుత్వాలకు అనేక సూచనలు అందిస్తూ రైతుల పక్షాన పోరాడిన ఉద్యమానాయకులు. నిరంతరం అధ్యయనం చేసిన గొప్ప విజ్ఞాని అని ఆయన మరణం రైతాంగఉద్యమాలకు తీరనిలోటని ఆయన అన్నారు. సంగారెడ్డి జిల్లాలో సింగూరు ప్రాజెక్టు నీళ్లు జిల్లా రైతాంగానికి ఇవ్వాలని సాగిన ఉద్యమాలలో అనేక సలహాలు అందించి ఉమ్మడి మెదక్ జిల్లా మల్లన్నసాగర్ పోరాటంలో మొదటి ప్రారంభ ధర్నాలో పాల్గొనినిర్వాసితుల సమస్యల పైన అనేక రకాల సూచనలు సలహాలు ఇస్తూ సంవత్సరాల పాటు జరిగిన మల్లన్న సాగర్ పోరాటంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొంటూ నిరంతరం చైతన్యం చేస్తూ ఉద్యమాన్ని చివరి వరకు నిలబెట్టిన దాంట్లో కీలక పాత్ర పోషించిన కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి చేసిన కృషి చిరస్మరణీయం. అన్నారు. అభివృద్ధి పేరుతో పేదల భూములను ప్రభుత్వాలు గుంజుకుంటే 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం రైతులకు ఇవ్వాలని చట్టాన్ని బయటపెట్టి రైతులకు అండగా నిలిచిన ఉద్యమ నాయకులని ఆయన గుర్తు చేశారు. ఆయన సామాన్య జీవితం గడిపిన గొప్ప నాయకుడు మల్లారెడ్డి గారు వారి స్ఫూర్తితో రాబోయే రోజులలో మరిన్ని రైతు ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో.జిల్లాఉపాధ్యక్షులు రాజయ్య.సీనియర్ నాయకులు. నర్సింహారెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి యాదవ రెడ్డి. జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస్ నాయకులు అశోక్ బాబురావు సాయిలు. దత్తు శివ. తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి పోటెత్తిన శ్రీశైలం నిర్వాసితులు

- 98 జీఓ అమలుతో న్యాయం చేయాలని వినతి
- ఉద్యోగాలు, పునరావాస ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్



**చిన్నంబావి, ఆగస్టు 24 (జనం సాక్షి) :** శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులకు సంబంధించిన 98 జీఓను తక్షణమే అమలు చేసి అర్హులైన నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం చిన్నంబావి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి శ్రీశైలం నిర్వాసితులు భారీగా తరలివచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు సమర్పించి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగాలు, పునరావాసం కల్పించాలని శ్రీశైలం ప్రాజెక్టు ముంపు గ్రామాలకు చెందిన నిర్వాసితులకు 98 జీఓ ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని వారు కోరారు. ఉద్యోగాలు, పునరావాస ప్రయోజనాలు కల్పించడంతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. 98 జీఓను వెంటనే అమలు చేసి తమ కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. ప్రజావాణి కి వచ్చిన నిర్వాసితుల నుంచి ఎంపీడీవో ఆదర్శ్ గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ రామస్వామి దరఖాస్తులు స్వీకరించారు. నిర్వాసితుల సమస్యలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు శ్రీశైలం నిర్వాసితులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమాజ సేవకుల పట్ల సానుభూతి పెంపొందించాలి

- రిషి హైస్కూల్‌లో లీడ్ ఆధ్వర్యంలో విద్యార్థులచే అవగాహన



**సంగారెడ్డి, ఆగస్టు 24 (జనం సాక్షి) :** సమాజ సేవకుల పట్ల గౌరవం, సానుభూతి, కృతజ్ఞత భావాలను విద్యార్థుల్లో పెంపొందించే లక్ష్యంతో రిషి హైస్కూల్‌లో లీడ్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకత్వ ఉద్యమం కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ పి. లక్ష్మీ రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం సోమవారం సంగారెడ్డి పట్టణంలోని ఐబి ఎదుట అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు సమాజ సేవకుల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పోలీసు అధికారులు, వైద్యులు, నర్సులు, ఉపాధ్యాయులు, పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, అగ్నిమాపక సిబ్బంది, సరుకుల పంపిణీ సిబ్బంది తదితరులు సమాజాన్ని సురక్షితంగా, ఆరోగ్యంగా, పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని వివరించారు. వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాలలోని ఐదవ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమాజ సేవకులు ఎదుర్కొనే సవాళ్లను అర్థం చేసుకోవడం, వారి సేవలను అభినందించడం, ఇతరుల పట్ల దయతో వ్యవహరించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సానుభూతి, దయ, కృతజ్ఞత, సామాజిక బాధ్యత వంటి విలువలు మరింత బలపడేలా చేశారు. సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యమని, ఇతరుల సేవలను గౌరవించడం ద్వారా మంచి పౌరసత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. చిన్న వయసు నుంచే సేవాభావం, మానవతా విలువలు, బాధ్యతాయుతమైన ప్రవర్తనను అలవర్చుకోవడం భవిష్యత్ సమాజానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో పాఠశాల ఉపాధ్యాయులు, సమన్వయకర్తలు, విద్యార్థుల సమిష్టి కృషి కీలకంగా నిలిచింది. తరగతి ఉపాధ్యాయులు ప్రవీణ, రతన్ కుమారి, కల్పన, అశ్వక్, అలాగే సమన్వయకర్తలు సంధ్య, ఇస్మత్ జబీన్ విద్యార్థులకు నిరంతరం మార్గనిర్దేశం చేస్తూ, ప్రోత్సహించారు. వారి అంకితభావం, సహకారం, మార్గదర్శకత్వంతో కార్యక్రమం విజయవంతంగా, అర్థవంతంగా సాగింది. విద్యార్థుల్లో మానవతా విలువలను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

## ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి
- లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ




**చేర్యాల, ఆగస్టు 24 (జనంసాక్షి) :** ప్రతి నిరుపేద కుటుంబానికి తెల్ల స్మార్ట్ రేషన్ కార్డులు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్మురవి అన్నారు. సోమవారం మండలంలోని మేజర్ గ్రామమైన ఆకునూరు గ్రామపంచాయతీ వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రతి నిరుపేద కుటుంబానికి నిరంతర ప్రక్రియ చేపట్టి రేషన్ కార్డులు పంపిణీ చేస్తుందని తెలిపారు. గత ఏ ప్రభుత్వాలు పనిచేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వంగా నిలుస్తుందని అన్నారు. లబ్ధిదారులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళల సంక్షేమం కోసం వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్ సౌకర్యం, రైతు భరోసా, రైతు బీమా, సన్న రేషన్ బియ్యం, ఇతర అనేక సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజా ప్రభుత్వంగా నిలుస్తుందని అన్నారు. లబ్ధిదారులు ఎవరు అధైర్య పడద్దని, ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ కరీమద్దీన్, ఉప సర్పంచ్ కదారి పల్లవి భాస్కర్, జీపీఓ పెరక బాపురాణి, వార్డు సభ్యురాలు అందే లక్ష్మి, సూర అనిత సంపత్, జూపల్లి కార్తీక్ రెడ్డి, మహమ్మద్ హైమద్, భూమని భాస్కర్, స్వర్గం రాజేష్, ఫీల్డ్ అసిస్టెంట్ అనంతపూరి లక్ష్మణ్, గ్రామస్తులు అందే అశోక్, అమరగొండ కొండపోషయ్య, తోట మల్లయ్య, రేసు మల్లేశం, అమరగొండ రాజు, ఎర్రోళ్ల మల్లయ్య, బూర్గుల మల్లయ్య, శిగుళ్ల చంద్రయ్య, అమరగొండ మల్లేశం, తోట బిక్షపతి, కుంభం గోపాల్ రెడ్డి, ఉళ్లేంగల వెంకటాద్రి, అనుముల రవి, కడుదూరి రవి, కదారి శివయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## చట్టబద్ధంగా, పారదర్శకంగా ఫిర్యాదుల పరిష్కారం

- ప్రజా ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ
- ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలి
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు




**మెదక్ బ్యూరో, ఆగస్టు 24 (జనం సాక్షి) :** ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఒక్కో అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, కుటుంబ సమస్యలు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలపై ఫిర్యాదులను సమర్పించారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ జరిపి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి వినతిదారుడి సమస్యను బాధ్యతగా పరిగణించి, ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి భయం, సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

# గుమ్మడిదల అభివృద్ధికి పెద్దపీట

- రూ.1.69 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత
- పరిశ్రమల భాగస్వామ్యం అభినందనీయం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**గుమ్మడిదల, ఆగస్టు 24 (జనంసాక్షి) :** నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. సోమవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లిలో న్యూల్యాండ్ పరిశ్రమ సహకారంతో రూ.86.50 లక్షలతో నిర్మించనున్న రెండు ఓవర్‌హెడ్ ట్యాంకుల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వీరన్నగూడెంలో రూ.15 లక్షల సిఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు, గుమ్మడిదలలో హానర్ ల్యాబ్స్, మైత్రి పరిశ్రమల సౌజన్యంతో రూ.45 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం నాగిరెడ్డిగూడెం గ్రామంలో న్యూల్యాండ్ పరిశ్రమ సహకారంతో రూ.22 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతులను బలోపేతం చేసి ప్రతి కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. గుమ్మడిదల ప్రాంత అభివృద్ధిలో పరిశ్రమల యాజమాన్యాలు, పారిశ్రామిక సంస్థలు సామాజిక బాధ్యతతో భాగస్వామ్యం కావడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు పరిశ్రమల సహకారం అందితే అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తవుతాయని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గుమ్మడిదల మున్సిపాలిటీని సమగ్రంగా అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎక్కడా రాజీ పడకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి




**తూప్రాన్, ఆగస్టు 24 (జనం సాక్షి) :** ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని నేను పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్ తెలిపారు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు అధ్యక్షతన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో చేపట్టిన రెండు రోజుల దీక్ష ఫీజుల బకాయి బిజెపి లాడాయి కార్యక్రమనికి మద్దతుగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్ ముదిరాజ్ పాల్గొని సంఘీభావం తెలిపారు .అనంతరం నత్తి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఫీజు రీ-అంబర్స్మెంట్ విడుదల చేయాలనీ లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చెప్పడతామణి ప్రభుత్వన్ని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ సింఘం సత్యయ్య బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాష బోయిన చంద్ర శేఖర్ ముదిరాజ్ కౌన్సిలర్ చందా అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

# నేనే మానసను గొంతు పిసికి చంపారు

- మృతురాలి తండ్రే చంపుమని డబ్బులు పంపాడు
- ఎసిపి ప్రెస్‌మీట్‌లో నిందితుడు ఏడేల్లి వినోద్ రెడ్డి




**ఎల్కతుర్తి (జనంసాక్షి) :** 'నేనే మానసను గొంతు పిసికి చంపారు..మృతురాలి తండ్రే చంపుమని డబ్బులు పంపాడు' అని నిందితుడు ఏడెల్లి వినోద్‌రె డ్డి తెలిపాడు. మండల కేంద్రంలో స్థానిక సిఐ కార్యాలయంలో ఇటీవల జరిగిన కారు డిక్కిలో గుర్తు తెలియని మహిళ శవం అనే వరస కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. ఈవిషయంపై కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, సిఐ పులి రమేష్ ఎస్సై నరసింహారావు ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశంలో నిందితున్ని మీడియా ముందుంచారు. నిందితుడు ఏడేల్లి వినోద్ కుమార్ రెడ్డి జరిగిన విషయాన్ని తెలిపాడు. పోలీసుల వివరాల ప్రకారం.. తేదీ 21 -8-2026 న ఎల్క్ తుర్తి గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్ట్ పక్క గల్లీలో కారు పార్కింగ్ లో నుండి దుర్వసన వస్తుందన్న విషయాన్ని స్థానికులు సమాచారంపై గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ అక్కడికి వెళ్లి చూడగా కారు డిక్కీలో మహిళా మృత దేహం ఉందని, వయస్సు 35 ఏండ్లు ఉంటుందని ఎక్కడో చంపి తీసుకొచ్చి కారును పార్కు చేసిన విషయాన్ని స్థానిక పోలీసులకు చెయ్యగా వారి ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేయడం జరిగిందని ఈ ఘటనపై సిపి వరంగల్ మరియు సెంట్రల్ జోన్ డిసిపి ధారా కవిత మరియు ఎ సి పి ప్రశాంత్ రెడ్డి కాజీపెట్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలిస్తుండగా 23-8- 2026 న గ్రామ శివారులో సిఐ మరియు ఎస్సై వారి సిబ్బందితో నమ్మదగిన సమాచారం మేరకు పెట్రోలింగ్ చేస్తుండగా నాగర్జున సీడ్స్ ప్రాసెస్ ప్లాంట్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా తన పేరు వినోద్ కుమార్ తండ్రి సమ్మిరెడ్డి 34 ఏళ్లు ప్రైవేట్ జాబ్ చేస్తున్నట్లు తెలిపారు. తండ్రి ఉద్యోగరీత్యా గోదావరిఖనిలో ఉండడం వలన ఇతను చిన్ననాటి నుంచి గోదావరిఖనిలో చదువుకున్నట్లు వారు తెలిపారు అదే గోదావరిఖని చెందిన మానస అనే అమ్మాయి తనకు చిన్ననాటి నుండి స్నేహితులుగా తనతో కలిసి మెలిసి ఉండేవారని సదరు మ్మాయికి ఇంతకుముందే రెండు పెళ్లిళ్లు కాగా వీరికి ఈమధ్య విడాకులు కూడా అయిందని చెప్పారు. మానస విచ్చలవిడిగా తిరుగుతున్న క్రమంలో తల్లిదండ్రుల మాట వినకుండా జల్సాలకు అలవాటపడి తల్లిదండ్రులపై చెడు పేరు తెస్తుందన్న ఉద్దేశంతో వినయ్ కుమార్ రెడ్డి నీ సంప్రదించారు. తండ్రే చశీపమని డబ్బులు పంపాడు. మానస తండ్రి అయిన అంకిత రాజేశం నిందితుడు వినయ్ కుమార్ రెడ్డి తో చెప్పి ఏదో ఒకటి చెయ్యండి నా బిడ్డతో చాలా ఇబ్బందిగా ఉందని అన్నట్లు విలేకర్ల సమావేశములో నిందితుడు వెల్లడించారు. ఖర్చులకు డబ్బులు కూడా పంపారని అన్నారు. 18-8-2026 రోజున కరీంనగర్ లోని తన రూంకి వచ్చి పెళ్లి చేసుకొమ్మని వాదించారని ఆవిషయాన్ని తన తండ్రి రాజేషంకు వివరించాగ అదే రాత్రి నేను గొంతు నలిపి చంపానని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ముందు వినయ్‌రెడ్డి ఒప్పుకున్నారు. సిఐ, ఎస్సైని అభినందించారు. నిందితున్ని చాకచక్యంగా పట్టుకున్నందుకు ఎల్కతుర్తి సిఐ పులి రమేష్ ఎస్సై నరసింహారావునుచ పోలీస్ కానిస్టేబుళ్లు విఠల్ రావు, బక్కయ్య, భాస్కర్ రెడ్డి, అఖిల్, నిరంజన్, సుమన్, మోహన్ బాబులను కాజీపేట ఏసీపి ప్రశాంత్ రెడ్డి అభినందించారు.

# అంతరాష్ట్రీయ ఓపెన్ కరాటేలో విద్యార్థుల ప్రతిభ



**ఏటూరునాగారం, ఆగష్టు 24(జనంసాక్షి) :** ఏటూరునాగారం కరాటే అకాడమిలో శిక్షణ పొందిన ఆరుగురు కరాటే విద్యార్థులు ప్రతిభ కనబర్చి ముగ్గురు గోల్డ్‌మెడల్ సాదించగా, మిగతా ముగ్గురు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ఏటూరునాగారం కరాటే కోచ్ హుస్సేన్ మాస్టార్ తెలిపారు. ఎంతో క్రమశిక్షణతో నేర్చుకున్న కరాటేలో సాదించిన వారికి స్థానికులు అభినందనలు తెలిపారు. ఆదివారం హనుమకొండలోని అంతరాష్ట్రీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ 2026 పోటీలు జరిగాయి. ఈ కరాటే పోటీలకు 400 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఏటూరునాగారం కరాటే అకాడమికి చెందిన అలువాల సుమనశ్రీ బాలికల సీనియర్ విభాగంలో గ్రాండ్ ఛాంపియన్, గోల్డ్‌మెడల్‌ను గెలుచుకోగా రాష్ట్ర కాంగ్రెస్ యూత్ ప్రధాన కార్యదర్శి చెలిమల్ల సాగర్ ట్రోఫీని అందజేశారు. అలాగే గ్రాండ్ ఛాంపియన్, గోల్డ్‌మెడల్‌ను వసంత విశాల్ సాయి సాధించారని, వర్షిత్ సబ్ జూనియర్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించినట్లు హుస్సేన్ తెలిపారు. అలాగే రాకేష్, గడ్డం వర్ష, తీనాశ్రీ లు సిల్వర్ మెడల్స్‌ను సాధించారని వెల్లడించారు.

# నీట్ - పీజీ 2026 ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఆదిలాబాద్ కలెక్టర్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**మావల ఆగస్ట్ 25( జనం సాక్షి):** నీట్-పీజీ -2026 ప్రవేశ పరీక్షను పకడ్బందీగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నీట్-పీజీ -2026 ప్రవేశ పరీక్ష ఈ నెల 03 న నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్-పీజీ -2026 ప్రవేశ పరీక్షను పకడ్బందీగా ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలనీ అధికారులను ఆదేశించారు. స్థానిక మావల నలంద డిగ్రీ, పీజీ కళాశాలలో 100 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఈ నెల 30వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు సింగిల్ షిఫ్ట్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (జదీ) పద్ధతిలో ఈ పరీక్ష జరగనుందన్నారు. ఉదయం 7 గంటల నుండి 8:30 గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పరీక్ష నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి, కేంద్రాల వారీగా పూర్తి వివరాలను ఎన్‌బీఈఎంఎస్ నిబంధనల ప్రకారం సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులకు క్షుణ్ణంగా హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు నిర్వహించడంతో పాటు, మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక మహిళా సిబ్బందితో ఫ్రిస్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఒరిజినల్ ఫోటో ఐడీ కార్డులు, ఆధార్/బయోమెట్రిక్ ధృవీకరణ చేపట్టి, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, కమ్యూనికేషన్ డివైజెస్ పరీక్షా కేంద్రంలోకి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని, ప్రశ్నాపత్రాల డౌన్‌లోడింగ్, అభ్యర్థుల రెస్పాన్స్ డేటా అప్‌లోడింగ్ కోసం మెరుగైన ఇంటర్నెట్ కనెక్టివిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు తగిన సిబ్బందిని మోహరించాలని తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, నకిలీ ప్రచారాలు, లీక్ వంతులు రాకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష సజావుగా సాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలను కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చిత్రు, ఎస్.రాజేశ్వర్, డిహెచ్మ్చో డా.సాధన, డిఐఈఓ గణేష్ జాదవ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, పర్యవేక్షకురాలు శైలజ, విద్యుత్, ఆర్టీసీ, పోలీస్, కళాశాల ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 129 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- నార్కోటిక్స్ డిఎస్పి రమేష్ కుమార్ వెల్లడి



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 24 (జనం సాక్షి) :** అక్రమంగా కారులో రవాణా చేస్తున్న 129 కిలోల గంజాయిని నార్కోటిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ నార్కోటిక్స్ డి.ఎస్.పి రమేష్ కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వర్ధన్నపేట పట్టణంలో వరంగల్ ఖమ్మం హైవేలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లో 129 కిలోల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి గంజాయి తో పాటు రవాణాకు ఉపయోగించిన కారును ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన నిందితుల్లో సాయిజ్ సిఎస్, డ్రైవర్ కేరళ. మరో వ్యక్తి బెసలేల్ సి మాత్యూ, ఇతను కూడా కేరళ ప్రాంతానికి చెందిన వాడు. ఈ కేసులో మరో ఇద్దరు వ్యక్తులు అజిత్, విక్కీ పరారీలో ఉన్నట్లు డిఎస్పి వివరించారు. ఒడిస్సా ప్రాంతానికి చెందిన విక్కీ అనే వ్యక్తి గంజాయిని సరఫరా చేయగా అజిత్ ఈ గంజాయి రవాణా వ్యవహారాన్ని సమన్వయం చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. నిందితులు బెంగళూరు నుండి సెల్ఫ్ డ్రైవ్ కారులో బయలుదేరి బెంగళూరు- రాజమండ్రి మీదుగా చిత్రకొండ దారకొండ ప్రాంతం చేరుకొని అక్కడ గంజాయి కొనుగోలు చేసి రాజమండ్రి వరంగల్ మీదుగా బెంగళూరు మార్గంలో గంజాయిని రవాణా చేయడానికి వెళుతున్నట్లు దర్యాప్తులో వెళ్ళడైనట్లు డిఎస్పి రమేష్ కుమార్ వివరించారు. గంజాయిని బెంగళూరుకు తరలించిన అనంతరం అక్కడి నుండి కేరళకు తీసుకెళ్లి అవసరమైన వారికి విక్రయించడం ద్వారా అక్రమంగా డబ్బు సంపాదించాలని ఉద్దేశంతో నిందితులు ఈ రవాణాకు పాల్పడినట్లు తెలిపారు. ఈనెల 23న వరంగల్ మార్కుటిక్స్ పోలీస్ స్టేషన్ అధికారులకు గంజాయి అక్రమ రవాణాప వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఉన్నతాధికారులకు తెలియజేసి వారి ఆదేశాల మేరకు సబ్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి తన పోలీస్ సిబ్బందితో కలిసి వర్ధన్నపేట ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఖమ్మం వైపు నుండి వరంగల్ వైపు వస్తున్న టి ఆర్ 05 జి 0275 నంబర్ గల మారుతి సుజుకి ఎర్టిగా కార్ను గుర్తించి ఆపారు. వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని పంచుల సమక్షంలో వాహనాన్ని తనిఖీ చేయగా వెనుక భాగంలో దాచి ఉంచిన 61 ప్యాకెట్ల గంజాయి బయటపడింది. వాటిని తూకం వేయగా మొత్తం 129.334 కిలోల గంజాయి ఉన్నట్లు నిర్ధారించారు. ఇద్దరు నిందితులపై గతంలో కేరళ, కర్ణాటక రాష్ట్రంలో కూడా గంజాయి కి సంబంధించిన కేసులు ఉన్నట్లు డిఎస్పీ వివరించారు. నిందితుల వద్ద నుండి గంజాయి రవాణాకు ఉపయోగించిన నలుపు రంగు కారు, పోకో సి 71 మొబైల్ ఫోన్, రెడ్మీ నోట్స్ 10ఎస్ మొబైల్ ఫోన్, నగదు రూ. 2900 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గంజాయి తోపాటు నిందితులను పట్టుకోవడంలో కృషి చేసినటువంటి ఇన్స్పెక్టర్ రవీందర్, శ్రీకాంత్ లతోపాటు సబ్ ఇన్స్పెక్టర్ కుమార్ ను డిఎస్పి రమేష్ కుమార్ అభినందించారు.

# పడమర కోటలో తాగునీటి తిప్పలు

- వారానికి ఒకసారే నీళ్లు వస్తే ఎలా?
- సమస్యను వెంటనే పరిష్కరించాలి
- గృహవాసుల ఆవేదన
- 26న విస్తృతస్థాయి సమావేశం



**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 24 (జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఖిలా వరంగల్ లో తాగునీటి తిప్పలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో గృహవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత మున్సిపల్ శాఖకు పలుమార్లు ఫిర్యాదు చేసిన కూడా పట్టించుకున్న నాధుడే లేడు. ప్రధానంగా పడమర కోటలో వారానికి ఒకసారి నల్లాల ద్వారా నీరు రావడం జరుగుతుంది. అది కూడా రాత్రి వేళలో 8 గంటలు దాటిన తర్వాత రావడం వలన ఉదయం నుండి సాయంత్రం వరకు కూలినాలి చేసుకొని పనులకు పోయేవారు వ్యవసాయ పనులకు పోయేవారు మంచినీరు కోసం అర్ధరాత్రి వరకు నిద్ర మానివేయ వలసిన పరిస్థితులు ఏర్పడినాయి. ఖిల వరంగల్ పడమర కోట మరియు మధ్య కోటకు చెందిన ప్రజలు గతంలో అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంచి నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారానికై మంచినీటి రిజర్వాయర్ నిర్మాణం కై అనేక పోరాటాలు చేశారు. ఫలితంగా ఖిలా వరంగల్ మధ్య కోటలోని గుండు చెరువు వద్ద రిజర్వాయర్ ను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా నిర్మించడం జరిగింది. దీని నుండి మూడు కోటల ప్రజలకు సరిపడా, సరియైన సమయంలో తాగునీరు పైపులైన్ల ద్వారా సప్లై అయ్యేది. కానీ సుమారు మూడు సంవత్సరాల క్రితం నుండి పడమరకోట ప్రజలకు మధ్యకోట వాటర్ ట్యాంక్ నుండి పైపుల ద్వారా వచ్చే నీటి పైపులను కట్ చేశారు. కిల వరంగల్ కోటలోని ప్రజలకు రంగసాయిపేట వద్ద గల వాటర్ ట్యాంక్ నుండి కనెక్షన్ ఇవ్వడం జరిగింది. కిలా వరంగల్ పడమట కూడా భౌగోళికంగా చూస్తే ఎత్తైన ప్రాంతము. ఇక్కడికి వేసిన పైపుల ద్వారా నీరు సరిగా సప్లై కావడం లేదు. స్థానిక ప్రజలు ముఖ్యంగా మహిళలు ప్రభుత్వ అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా కూడా ఫలితం లేకుండా పోయింది. పడమర కోట ప్రజలకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నది. తాగునీటి సమస్య వలన స్కూలుకు, కాలేజీలకు, ఉద్యోగులకు, కూలి పనులకు, సరైన టైముకు వెళ్లలేకపోతున్నారు తాగునీటి సమస్య కారణంగా కుటుంబాలలో గొడవలు కూడా జరుగుతున్నాయి. కావున కిలా వరంగల్ పడమట కోట ప్రజలకు ఏర్పడిన తాగునీరు సమస్యను పరిష్కారానికై సోమవారం బండి కోటేశ్వర్ అధ్యక్షతన స్థానిక పోచమ్మ గుడి సమీపంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. కిలా వరంగల్ పడమరకోట మహిళా కమ్యూనిటీ హాల్ (కాపు వాడ) లో 26న విస్తృతస్థాయి సమావేశం జరపాలని, రాజకీయ పార్టీలకు అతీతంగా ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేకుండా ఈ తాగునీటి సమస్య పరిష్కారానికి అఖిలపక్ష పోరాట కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో తీగల జీవన్, సాగర్ల శ్రీనివాసు, మైదం సంజీవ, నలిగంటి పాల్, రాజు, విజి, బండి వెంకటేశ్వర్లు, రాజబోయిన యాకయ్య, గద్దల ప్రకాష్, అశోకు తదితరులు పాల్గొన్నారు.



# ఏసీబీకి చిక్కిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

**నిర్మల్ బ్యూరో , ఆగస్టు 24 (జనంసాక్షి) :** వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. పన్ను తగ్గించేందుకు ఓ వ్యాపారి నుంచి రూ.50 వేల లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా డీసీటీఓ గోదావరి, సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయికృష్ణను ఏసీబీ డీఎస్పీ మదు ఆధ్వర్యంలో రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నారు. పన్ను తగ్గించేందుకు అధికారులు డబ్బులు డిమాండ్ చేయడంతో ఇవ్వడం ఇష్టంలేని బాధిత వ్యాపారి ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలిసింది. వారి సూచనల మేరకు సోమవారం డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఏసీబీ అధికారులు వెల్లడించాల్సి ఉంది.

# ధర్మసాగర్ చెరువు కబ్జాలపై కలెక్టర్ సీరియస్



**నిర్మల్ రూరల్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** ధర్మసాగర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఆక్రమణలు, చెరువు గర్భంలో నిర్మించిన వాకింగ్ ట్రాక్‌పై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ ఈఈని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ తెలిపారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు అప్పీల్ అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రెండు వారాల్లో క్షేత్రస్థాయి విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని ఆదేశించారని, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా ఎఫ్‌టీఎల్ సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరినట్లు చెప్పారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం అందించాలి

- జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 24 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు అందించిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి)లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జీ, ఎం సంపత్ రావు లతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 దరఖాస్తులు రాగా, వాటిలో భూమికి సంబంధించినవి 15, ఇందిరమ్మ ఇండ్లకు 4, పెన్షన్లకు 7, ఇతర శాఖలకు సంబంధించినవి 18 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రవి కుమార్, ఆర్డీఓ కృష్ణవేణి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- నేడు జిల్లావ్యాప్తంగా భారీగా సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించాలి
- మొక్కల సంరక్షణ, మనుగడపై ప్రత్యేక దృష్టి సారించాలి





**ములుగు ప్రతినిధి, ఆగష్టు 24(జనంసాక్షి) :** వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం వన మహోత్సవం కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, డిఎఫ్ఓ వికాస్ మీనా తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించి, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి, రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా ఆహ్వానించి, కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలను నాటాలని ఆదేశించారు. నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని, అవసరమైన మొక్కలను సకాలంలో తరలించాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో కూడా ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, వన మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి, మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వన మహోత్సవ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి, జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఓ రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
25 ఆగష్టు 2026

# ఖమ్మం వైద్యరంగంలో నవశకం..!

- ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ సిద్ధం.
- రూ.23.75 కోట్లతో అత్యాధునిక భవనం..
- తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారికి క్రిటికల్ కేర్ సేవలు..
- హైదరాబాద్‌కు తరలింపు అవసరం తగ్గే అవకాశం..
- నేడు ప్రారంభించనున్న మంత్రి తుమ్మల



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 24(జనం సాక్షి)..**

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజారోగ్య చరిత్రలో మరో కీలక అధ్యాయానికి నాంది పలికేందుకు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిద్ధమైంది. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రి గడప తొక్కే రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన అత్యాధునిక 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ పూర్తయింది. తీవ్రమైన అనారోగ్యంతో, ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరుకునే రోగులకు సత్వరమే అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ఈ భవనం ఎంతో దోహదపడనుంది. జిల్లా ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం వేసిన మరో దృఢమైన అడుగుగా వైద్య వర్గాలు అభివర్ణిస్తున్నాయి. సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మించడం గమనార్హం.

**రూ.23.75 కోట్లతో అధునాతన భవన నిర్మాణం.**

ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసపత్రి ప్రాంగణంలో సకల సౌకర్యాలతో నిర్మితమైన క్రిటికల్ కేర్ బ్లాక్ భవనానికి ప్రభుత్వం రూ.23.75 కోట్ల నిధులు మంజూరు చేసింది. గత 2023 జూన్ 7న జారీ అయిన జీవో ఆర్‌టీ నంబర్ 311 ద్వారా అనుమతులు లభించడంతో నిర్మాణ పనులకు వేగం పెరిగింది. రూ.12.66 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ ప్రక్రియ చేపట్టగా, 2.79 శాతం తక్కువ ధరకే కాంట్రాక్టు ఖరారు కావడం విశేషం. ఇప్పటివరకు నిర్మాణానికి సుమారు రూ.15.27 కోట్లు వెచ్చించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

**వైద్య పరికరాలకు రూ.8.48 కోట్లు కేటాయింపు..**

మంజూరైన మొత్తం నిధుల్లో నిర్మాణ వ్యయం పోను మిగిలిన రూ.8.48 కోట్లను అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలుకు వినియోగించనున్నారు. దీనీతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఫలితంగా క్రిటికల్ కేర్ చికిత్సలో నాణ్యత మరింత మెరుగుపడనుంది.

**సమగ్ర వైద్య సదుపాయాలు..**

నాలుగు అంతస్తుల్లో విశాలంగా నిర్మించిన ఈ క్రిటికల్ కేర్ బ్లాక్‌లో రోగుల అవసరాలకు అనుగుణంగా వివిధ విభాగాలను ఏర్పాటు చేశారు. రెండు ఐసీయూ విభాగాల్లో 20 పడకల చొప్పున 40 పడకలు, మరో 20 పడకలతో జనరల్ వార్డు, 5 పడకల డయాలసిస్ వార్డు లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు, తీవ్ర శ్వాసకోశ సమస్యలు, మూత్రపిండాల వైఫల్యం తదితర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు అవసరమైన క్రిటికల్ కేర్ సేవలను ఒకే చోట అందించే అవకాశం కల్పించారు.

హైదరాబాద్‌కు తరలింపు అవసరం తగ్గే అవకాశం..

ఇప్పటివరకు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న రోగులను మెరుగైన క్రిటికల్ కేర్ కోసం హైదరాబాద్ వంటి నగరాలకు తరలించాల్సిన పరిస్థితి ఉండేది. ఈ క్రమంలో ప్రయాణ సమయం కీలకంగా మారేది. తాజాగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే అత్యాధునిక క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో అత్యవసర సమయంలో రోగుల ప్రాణాలను కాపాడే అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఖమ్మం జిల్లావాసులతో పాటు చుట్టుపక్కల మండలాలు, పొరుగు జిల్లాల ప్రజలు కూడా ఈ సదుపాయం ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

**ప్రభుత్వ వైద్యానికి మరింత బలం..**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ అందుబాటులోకి రానుండటం జిల్లా వైద్య రంగానికి ఒక కీలక ముందడుగుగా నిలవనుంది.

**నేడు మంత్రి తుమ్మల చేతుల మీదుగా ప్రారంభం..**

సుదీర్ఘ నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసుకున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లాంచనంగా ప్రారంభించనున్నారు. దీంతో అత్యాధునిక వైద్య సదుపాయం ఖమ్మం ప్రభుత్వ వైద్య సేవల చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించనున్నట్లు వైద్య వర్గాలు పేర్కొన్నాయి.

# ఏయిమ్స్ లో ఆక్యుపేషనల్ థెరపీ, సెన్సరీ ఇంటిగ్రేషన్ యూనిట్లు ప్రారంభం



**బీబీనగర్ (జనంసాక్షి) :**

బీబీనగర్‌లోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్ ( పి ఎమ్ ఆర్ ) విభాగంలో ఆక్యుపేషనల్ థెరపీ, సెన్సరీ ఇంటిగ్రేషన్ యూనిట్లను సోమవారం ఎయిమ్స్ డైరెక్టర్ అమితా అగర్వాల్ ప్రారంభించారు. ఈ యూనిట్ల ద్వారా ఆటిజం, సెరెబ్రల్ పాల్సీతో పాటు ఇతర అభివృద్ధి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ప్రత్యేక పునరావాస చికిత్సలను అందించనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. స్ట్రోక్, ఇతర నాడీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు కూడా సమగ్ర పునరావాస చికిత్స అందించనున్నట్లు సెన్సరీ ఇంటిగ్రేషన్, చేతి కదలికలు, సూక్ష్మ కదలికల నైపుణ్యాలు, రోజువారీ కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యం, స్వతంత్ర జీవన నైపుణ్యాలను మెరుగు పరచడంపై ఈ యూనిట్లు ప్రత్యేకంగా దృష్టి సారి స్తాయని తెలిపారు. రోగుల అవసరాలకు అనుగుణం గా సమగ్ర, రోగి కేంద్రిత పునరావాస సేవలను అందించడంలో ఈ యూనిట్ల ప్రారంభం కీలక ముందడుగుగా ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు. రోగుల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు రోజువారీ కార్యకలాపాలను స్వతంత్రంగా నిర్వహించే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. మహేశ్వర్ లక్కిరెడ్డి, పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా. పట్నాయక్, ఈఎన్‌టీ విభాగాధిపతి డా. శ్రీకృష్ణ, అసోసియేట్ డీన్ డా. గోవింద్‌తో పాటు ఇతర అసోసియేట్ డీన్లు హాజరయ్యారు.



## అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని
# భర్త దారుణ హత్య

- ప్రియుడితో కలిసి హత్య చేసిన భార్య
- కేవలం 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు



**చౌటుప్పల్ ఆగస్టు 24(జనంసాక్షి)**

అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భార్య తన ప్రియుడితో కలిసి భర్తను కర్రతో దాడి చేసి,రాయితో కొట్టి దారుణంగా హత్య చేశారు. . మండల పరిధిలోని పంతంగి గ్రామం శనిగలగుట్ట వద్ద ఆదివారం జరిగిన హత్యను పోలీసులు ఛేదించారు. చౌటుప్పల్ డీఎస్పీ పి. మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో, సీఐ జి.మన్మథ కుమార్ నేతృత్వంలో పోలీసులు విచారణ నిర్వహించి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కీలక ఆధారాలను సేకరించి 24 గంటల్లోనే నిందితులను పట్టుకున్నారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ పి.మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మృతుడి భార్య రాపోలు శారద (34) కు తన స్వంత బావ కుమారుడైన రాపోలు శివ (19) తో అక్రమ సంబంధం ఉంది. గతంలో కూడా ఇదే విషయమై శివను దానయ్య హెచ్చరించాడు. ఈ క్రమంలో ఈ నెల 23న మధ్యాహ్నం సమయంలో శారద, శివ ఇద్దరూ శనిగలగుట్ట వద్ద చనువుగా ఉండగా చూసిన దానయ్య వారిని వారించాడు. తమ సంబంధానికి దానయ్య అడ్డుగా ఉన్నాడని భావించి, అతడిని హత్య చేయడానికి పన్నాగం వేశారు. శనిగలగుట్ట వద్ద దానయ్యపై కర్రతో దాడి చేసి, అనంతరం రాయితో తలపై తీవ్రంగా కొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులిద్దరినీ కోర్టులో హాజరుపరచి రిమాండ్ కు తరలించారు. కేసును వేగంగా, చాకచక్యంగా ఛేదించిన ఇన్‌స్పెక్టర్ జి.మన్మథ కుమార్, ఎస్సైలు కె.యాదగిరి, పి. రవీందర్, బి.అజయ్ భార్గవ్, కానిస్టేబుళ్లు అశోక్, ఉదయ్, జంగయ్యలను డీఎస్పీ పి. మధుసూదన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి





- ప్రజావాణి పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు
- మండల స్థాయి ప్రజావాణి
- సద్వినియోగం చేసుకోవాలి

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా,మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంపై కూడా కలెక్టర్ సమీక్షించారు. మండల స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు. ఈ నెల 25 నుండి జరుగు వనమహోత్సవం సందర్భంగా సంబంధిత జిల్లా అధికారులందరూ సామూహిక వనమహోత్సవంలో పాల్గొని వారికి నిర్దేశించిన టార్గెట్ పూర్తి చేయాలని అన్నారు. జిల్లా, మండల ప్రభుత్వ కార్యాలయాలలో ఆగస్టు 31 వరకు టీ ఫైబర్ ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకోవాలని అధికారులను ఆదేశించారుప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబంధించి 43 దరఖాస్తులు, ఇరిగేషన్ 4, మున్సిపాలిటీ 4, డిడబ్ల్యుఓ 3, మిగిలిన 14 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 68 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్‌ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఎ పిడి సన్యాసయ్య, సిపిఓ కిషన్, డీఎస్‌ఓ మోహన్ బాబు, డిపిఓ యాదగిరి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బంది స్వీయ నియంత్రణ ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలి

**జిల్లా ఎస్పీ కె.నరసింహ**




**సూర్యాపేట (జనంసాక్షి):**

సమాజ భద్రత, పౌరుల భద్రతలో పోలీసు సిబ్బంది నిరంతరం కృషి చేస్తూ పోలీసు సేవలు అందించాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సిబ్బందికి పలు కీలకమైన ఆర్థిక పరమైన సలహాలు, సూచనలు అందించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు హాజరై సిబ్బందికి క్రమశిక్షణతో కూడిన ఆర్థిక నిర్వహణ అంశాల గురించి సుదీర్ఘంగా వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అప్పులు చేయడం, భద్రత లేని వ్యాపారాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తాయన్నారు. పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనం, స్వీయ నియంత్రణ అలవర్చుకోవాలని, ముఖ్యంగా చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు. సమాజంలో పోలీస్ యూనిఫాంకు ఎంతో గౌరవం ఉందన్నారు. కఠినమైన శిక్షణ పొందిన పోలీసులు ఇతరులతో పోలిస్తే భిన్నంగా, సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. అధిక లాభాల ఆశతో ఎలాంటి భద్రత లేని పథకాలు, అనాధికారిక సంస్థల్లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దన్నారు. బెట్టింగ్‌లు, సోషల్ మీడియా వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పేర్కొన్నారు. సిబ్బంది ఎల్లప్పుడూ దీర్ఘకాలిక ప్రయోజనాల వైపు, తమ కుటుంబ ఆర్థిక భద్రత వైపు ఆలోచన చేయాలన్నారు. నిరంతరం ఒత్తిడితో కూడిన విధుల్లో ఉండే పోలీసులు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవిస్తూ, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసు సిబ్బంది ఎలాంటి తప్పులు, నేరాలకు పాల్పడకూడదన్నారు. సిబ్బందికి వ్యక్తిగత లేదా వృత్తిపరమైన సమస్యలు ఏవైనా ఉంటే నిర్భయంగా ఉన్నతాధికారులకు చెప్పుకుని పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డీఎస్పీ రవి, అడ్మిన్ అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నారాయణరాజు, ప్రవీణ్ కుమార్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూర్యాపేట రీజినల్ చీఫ్ మేనేజర్ అరుంధతి, ఫైనాన్సియల్ అసిస్టెంట్ మేనేజర్ రామిరెడ్డి, జిల్లాలోని పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలు రాని ప్రజావాణి కార్యక్రమం

- ప్రభుత్వ వైద్య శాఖపై చొరవ చూపితే బాగుంటుంది
- ప్రజా ప్రతినిధులు గైర్హాజరు
- అధికార యంత్రాంగంపై నమ్మకం సన్నగిల్లడమే కారణమంటున్న ప్రజలు

**అళ్లపల్లి ఆగస్టు 24(జనంసాక్షి):**

ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన'ప్రజావాణి'కార్యక్రమం ఆశించిన లక్ష్యాన్ని నెరవేర్చలేకపోతోందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. మండల ప్రభుత్వ ఆస్పటల్ రోగులకు యమగండం గా మారిందని ప్రభుత్వ దవాఖానకి వస్తే ట్రీట్మెంట్ ఉండదని హాస్పిటల్ సిబ్బంది తీరు ఏమాత్రం బాగోలేదని విష జ్వరాలు ప్రబలుతున్న పట్టించుకోని వైద్యాధికారులు జిల్లా వైద్యశాఖ అధికారులు అలా వచ్చి ఇలా వెళ్లిపోవడమే తప్ప సమస్యను పరిష్కరించుకోకపోవడం ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకాలు సన్నగిల్లుతున్నాయని ప్రజల ఆరోపణ.

**ప్రజా ప్రతినిధులు గైర్హాజరు**

మండల ప్రజా సమస్యలపై దృష్టిపెట్టే ప్రజాప్రతితులు కూడా ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కాకపోవడం హాజరుకాని అధికారులకు బలాన్ని సమకూర్చే విధంగా ఉన్నాయని ప్రజల ఆరోపణ. సోమవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం అర్జీదారులు రాక వెలవెలబోయింది. వివిధ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరైనప్పటికీ,వినతులు సమర్పించేందుకు ప్రజలు పెద్దగా ముందుకు రాకపోవడం గమనార్హం. మండల వ్యాప్తంగా ప్రజావాణిలో కేవలం 5 దరఖాస్తులు మాత్రమే అందాయి. అందులో ఇందిరమ్మ/గృహ నిర్మాణానికి సంబంధించి 4 వినతులు రాగా,రెవెన్యూ భూ సమస్యలపై కేవలం ఒకే ఒక్క(01)అర్జీ మాత్రమే నమోదైంది.

**ప్రజలకు,అధికారులకు మధ్య పెరుగుతున్న దూరం:**

ప్రజాస్వామ్యంలో అధికారులు ప్రజలకు సేవకులుగా ఉండాలని, అయితే క్షేత్రస్థాయిలో పాలన తమకు చేరువ కాకపోవడం వల్లే ఈ దూరం రోజురోజుకూ పెరుగుతోందని మండల వాసులు పేర్కొంటున్నారు. గతంలో వివిధ శాఖల కార్యాలయాల్లో సమర్పించిన వినతులు నేటికీ పరిష్కారానికి నోచుకోలేదని,కనీసం దరఖాస్తు ఏ దశలో ఉందో తెలిపే సమాచారం కూడా తమకు అందడం లేదని బాధితులు వాపోతున్నారు. అధికారులలో జవాబుదారీతనం కొరవడటం వల్లే సమస్యల పరిష్కారం కంటే వినతులు బుట్టదాఖలవుతున్నాయనే భావన తమలో కలుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**సమస్య పరిష్కారానికి నిర్ణీత గడువు లేదు:**

అర్జీ సమర్పించిన తర్వాత సమస్య ఎప్పటిలోగా పరిష్కారమవుతుందనే స్పష్టమైన కాలపరిమితి లేకపోవడం వల్లనే తాము అధికారుల వద్దకు రావడానికి ఆసక్తి చూపడం లేదని ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినా, క్షేత్రస్థాయిలో అధికారులు న్యాయం చేస్తారన్న భరోసాను తమలో కల్పించలేకపోతున్నారని స్థానికులు అంటున్నారు.

**కార్యాలయాలకే పరిమితమైన అధికారుల తీరు:**

గ్రామాల్లో సమస్యలు ఎదురైనప్పుడు క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించాల్సిన యంత్రాంగం, కేవలం సోమవారం నాటి సమావేశ మందిరాలకే పరిమితమవుతోందని మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణి కేవలం అధికారులు హాజరు పట్టికలో సంతకాలు చేసే ప్రక్రియగా మిగిలిపోకూడదని, అందిన కొద్దిపాటి అర్జీలనైనా అధికారులు స్వయంగా గ్రామాలకు వెళ్లి పరిశీలించి పరిష్కరిస్తేనే తమకు వ్యవస్థపై నమ్మకం కలుగుతుందని స్పష్టం చేస్తున్నారు. అలాగే దరఖాస్తుల స్థితిగతులు, తిరస్కరణకు గల కారణాలను నేరుగా అర్జీదారునికి చేరవేసే పారదర్శక విధానాన్ని అమలు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి. ఉమారాణి,ఎంపీడీవో,శ్రీను, వ్యవసాయ అధికారి కె.ఎస్.ఎస్.ఎ.కుమార్ రాజా,ఎస్ఐ ఎం.సోమేశ్వర్ మరియు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.



# జ్వరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు



**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 24 (జనంసాక్షి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం, ఉల్వనూర్ పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల జ్వరంతో మరణం సంభవించిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. తుకారం రాథోడ్ సోమవారం తుమ్మలగూడెం పీహెచ్‌సీని సందర్శించారు. ఆరోగ్య శిబిరం, ఏఎల్‌ఓ, డ్రై డే కార్యక్రమాలను పరిశీలించి ప్రజలు, సర్పంచ్, వైద్య సిబ్బందితో మాట్లాడారు. జ్వర కేసులపై ఇంటింటి సర్వే నిర్వహించాలని, ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. తీవ్ర కేసులను వెంటనే ఉన్నత వైద్య కేంద్రాలకు, అవసరమైతే 108 ద్వారా తరలించాలని సూచించారు. స్వల్ప జ్వర కేసులను ప్రతి నాలుగు గంటలకు పర్యవేక్షించాలని, పరిస్థితి విషమిస్తే తక్షణమే ఆస్పత్రికి తరలించాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో ఏఎల్‌ఓ, డ్రై డే కార్యక్రమాలను పంచాయతీ సిబ్బంది సహకారంతో ప్రతిరోజూ నిర్వహించాలని, గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జ్వర కేసుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని ఆశ కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వైద్యాధికారి సిబ్బందికి సూచనలు చేశారు.




# నష్టాలతో ముగిసిన సూచీలు

### సెన్సెక్స్ 172 పాయింట్లు డౌన్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు సూచీలను పడేశాయి. జూన్‌లో కుదిరిన ఒప్పందం గడువు ముగియడం, ఇరాన్‌పై అమెరికా కఠిన ఆర్థిక ఆంక్షలను తీవ్రతరం చేసింది. ప్రతిగా ఇరాన్ కూడా హెచ్చరికలకు దిగడంతో యుద్ధ వాతావరణం నెలకొంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఈ పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో ఉదయం స్వల్ప లాభాల్లో కదలాడిన సూచీలు నష్టాల్లో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 77,629.56 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,540.83) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల బాట పట్టింది. ఇంట్రాడేలో 77,201.66 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 171.72 పాయింట్ల నష్టంతో 77,369.11 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 32.95 పాయింట్ల నష్టంతో 24,219.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, బీఈఎల్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్, సన్‌ఫార్మా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 92.73 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4646 డాలర్ల వద్ద ట్రేడుతోంది.



### మొత్తం ట్రేడర్లలో వీరే 43%: సెబీ

హెడ్జింగ్ కోసం వాడాల్సిన డెరివేటివ్స్ ట్రేడింగ్‌లోకి, జెన్‌జీ ట్రేడర్లు అధిక లాభార్జన కోసం దిగుతున్నారు. వీరిని నిరుత్సాహ పరచడానికి మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీ తీసుకుంటున్న చర్యలు గత ఆర్థిక సంవత్సరంలో కొంత ఫలించాయి. అయినా కూడా అధిక వార్షికాదాయం ఉన్న వారితో పోలిస్తే, తక్కువ ఆదాయం కలిగిన వారు డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో నష్టపోవడం ఎక్కువగానే ఉందని సెబీ పేర్కొంది. 2025-26లో డెరివేటివ్స్ ట్రేడింగ్‌పై సెబీ అధ్యయనం తేల్చిన వివరాలివీ..ఈక్విటీ డెరివేటివ్స్ మార్కెట్‌లో యువత భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ ట్రేడింగ్‌లో పాల్గొన్న వారిలో 30 ఏళ్లలోపు వారే 43 శాతంగా ఉన్నారు. నాలుగేళ్ల క్రితం ఈ వాటా 31 శాతమే. యువ ట్రేడర్లలో నష్టాలు చవిచూసిన వారి శాతమూ ఎక్కువగా ఉంది.గత ఆర్థిక సంవత్సరంలో డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో పాల్గొన్న 30 ఏళ్లలోపు వారిలో సుమారు 89% మంది నష్టపోయారు. 60 ఏళ్లు పైబడిన ట్రేడర్లలో నష్టపోయిన వారు 81% మంది. దేశంలోని మెట్రో నగరాలకు వెలుపల ఉన్న ప్రాంతాల నుంచి, తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన పెట్టుబడిదారుల నుంచీ ఈ మార్కెట్‌లో భాగస్వామ్యం పెరుగుతోంది.

**వార్షికాదాయం రూ.5 లక్షల లోపే**

వ్యక్తిగత డెరివేటివ్స్ ట్రేడర్లలో సుమారు మూడొంతుల మంది వార్షికాదాయం రూ.5 లక్షల లోపే. మొత్తం టర్నోవర్‌లో ఈ వర్గం వాటా 43%. మొత్తం నష్టాల్లో వీరి వాటా 53%. ఈ ఆదాయ వర్గానికి చెందిన సుమారు 88% మంది ట్రేడర్లు నష్టపోయారు. రూ.1 కోటి కంటే ఎక్కువ వార్షికాదాయం ఉన్న పెట్టుబడిదారుల్లో నష్టపోయిన వారు 81%.మూడింట రెండొంతుల మంది చిన్న పట్టణాల నుంచే వ్యక్తిగత ట్రేడర్లలో సుమారు మూడింట రెండొంతుల మంది చిన్న పట్టణాల వారే. డెరివేటివ్స్ టర్నోవర్‌లో వీరి వాటా దాదాపు 50%. వ్యక్తిగత మ్యూచువల్ ఫండ్ ఆస్తుల్లో చిన్న పట్టణాల పెట్టుబడిదారుల వాటా నాలుగోవంతే. అంటే, నష్టభయం ఉన్నా, డెరివేటివ్స్‌నే వీరు అధికంగా ఎంచుకుంటున్నారు. 2025-26లో సుమారు 95 లక్షల మంది, అంటే వ్యక్తిగత డెరివేటివ్స్ ట్రేడర్లలో 78% మందికి రూ.1 లక్ష కంటే తక్కువ విలువైన ఈక్విటీ పోర్ట్‌ఫోలియోలు ఉన్నాయి. మొత్తం డెరివేటివ్స్ టర్నోవర్‌లో వీరి వాటా 51%. మొత్తం నష్టాల్లో వీరి వాటాయే 70%.రూ.లక్ష కంటే తక్కువ విలువైన ఈక్విటీ పోర్ట్‌ఫోలియో ఉన్నప్పటికీ, డెరివేటివ్స్ టర్నోవర్ రూ.1 కోటి కంటే ఎక్కువగా ఉన్న ట్రేడర్లు.. మొత్తం ట్రేడర్లలో 13 శాతంగా ఉన్నారు. మొత్తం నష్టాల్లో వీరి వాటా 52%.సుమారు 43 లక్షల మంది ట్రేడర్లు, అంటే వ్యక్తిగత డెరివేటివ్స్ భాగస్వాముల్లో 35% మంది ఖాతాల్లో షేర్లే లేవు. వీరు నేరుగా డెరివేటివ్స్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేస్తున్నారన్నమాట.ట్రేడర్ల సంఖ్య తగ్గిందిమొత్తం వ్యక్తిగత ట్రేడర్ల సంఖ్య 2024-25లో 1.06 కోట్లు కాగా, 2025-26లో 18% తగ్గి 87.5 లక్షలకు పరిమితమైంది. వయసు, ఆదాయం, ప్రాంతం, ట్రేడింగ్ కార్యకలాపాల స్థాయి, పోర్ట్‌ఫోలియో పరిమాణం వంటి అంశాల ఆధారంగా ట్రేడింగ్ ఫలితాలు ఎలా మారుతున్నాయో సెబీ ఈ అధ్యయనంలో పరిశీలించింది.

## మోనోషాక్ సస్పెన్షన్‌తో పల్సర్ 125, పల్సర్ 150..

# ధర, ఫీచర్లు ఇవే

**ముంబయి:** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో కొత్త పల్సర్ మోటార్ సైకిళ్లను దేశీయంగా లాంచ్ చేసింది. 125, 150 సీసీ సెగ్మెంట్లలో వీటిని ఆవిష్కరించింది.

**పల్సర్ 150 ఫీచర్లు**

కొత్త పల్సర్ 150.. 13.6 బీహెచ్‌పీ పవర్‌ను ఉత్పత్తి చేస్తుంది. సింగిల్ డిస్క్, ట్విన్ డిస్క్ వేరియంట్లలో లభిస్తుంది. సింగిల్ డిస్క్ వేరియంట్‌లో రోడ్, రెయిన్, స్పోర్ట్- 3 రైడింగ్ మోడ్‌లు ఉంటాయి. కలర్ ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, యూఎస్‌బీ టైప్-సీ ఛార్జింగ్ పోర్ట్ సదుపాయం ఉంది. ట్విన్ డిస్క్ వేరియంట్‌లో గూగుల్ మ్యాప్స్ నావిగేషన్‌తో కూడిన 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే ఇచ్చారు. ఎల్ఈడీ ఇండికేటర్లు, హజార్డ్ ల్యాంప్స్, ఇంటిగ్రేటెడ్ స్టార్టర్ జనరేటర్ సదుపాయాలు ఉన్నాయి. సింగిల్ సీట్, స్పోర్టీ స్ప్లిట్ సీట్ ఆప్షన్లతో లభిస్తుంది.


**పల్సర్ 125 ఫీచర్లు**

ఇక పల్సర్ 125 ఫీచర్ల విషయానికొస్తే.. ఇందులోని ఇంజిన్ 11.7 బీహెచ్‌పీ పవర్‌ను ఉత్పత్తి చేస్తుంది. బేస్ వేరియంట్ కలర్ ఎల్‌సీడీ డిస్‌ప్లే, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్ సదుపాయంతో వస్తోంది. మిడ్, టాప్ వేరియంట్లలో రోడ్, రెయిన్, స్పోర్ట్ రైడింగ్ మోడ్‌లు ఉన్నాయి. 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే ఉంటుంది. ఎల్ఈడీ ఇండికేటర్లు, హజార్డ్ లైట్లు, ఇంటిగ్రేటెడ్ స్టార్టర్ జనరేటర్ సదుపాయాలు ఉన్నాయి. ఈ వేరియంట్లలో స్టాండర్డ్‌గా టైప్-సి ఛార్జింగ్ పోర్ట్ సదుపాయం ఉంటుంది.

# చమురు ధరలే నడిపిస్తాయ్

- మిడ్‌క్యాప్ ఐటీ షేర్లు రాణించొచ్చు
- విశ్లేషకుల అంచనాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ముడి చమురు అధిక ధరల కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లు ఈవారం ఒక శ్రేణికి లోబడి చలించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చమురు ధరల వల్ల దిగుమతి బిల్లు భారం, ద్రవ్యోల్బణ ఆందోళనలు అధికమై, దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెరగొచ్చు. ఇరాన్‌పై అమెరికా మరిన్ని ఆంక్షలు విధిస్తే, యుద్ధ పరిష్కారం నుంచి అడుగులు దూరంగా జరగొచ్చు. అయితే నిఫ్టీ-50కి అంతర్లీనంగా సానుకూలతలున్నాయని, 24,500-24,600 స్థాయుల దిశగా వెళ్లే అవకాశమూ ఉందన్నది సాంకేతిక నిపుణుల అంచనా. ఈ సూచీకి తక్షణ మద్దతు 24,100 పాయింట్ల వద్ద లభించొచ్చని చెబుతున్నారు. విదేశీ మదుపర్లు నికరంగా కొనుగోళ్లు చేపడుతుండడం కలిసిరావొచ్చు. ఈనెలలో విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు ఇప్పటివరకు రూ.23,544 కోట్ల కొనుగోళ్లు జరిపారు. జులైలో వీరి కొనుగోళ్లు రూ.20,200 కోట్లు కావడం గమనార్హం. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..ప్రధాన షేర్లలో లాభాల స్వీకరణ నేపథ్యంలో ఔషధ కంపెనీల షేర్లు ఒక శ్రేణిలో కదలాడొచ్చు. 'చాలా వరకు కంపెనీల అమెరికా కార్యకలాపాలు రికవరీ కావొచ్చు. కొత్త ఆవిష్కరణలే తదుపరి వృద్ధి చోదకంగా పనిచేయగలవ'ని బ్రోకరేజీలు పేర్కొంటున్నాయి. తిరిగి పుంజుకునేందుకు ముందు ఫార్మా సూచీ 25,400-26,800 పాయింట్ల మధ్య చలించొచ్చు. చమురు బ్యారెల్ ధర తిరిగి 100 డాలర్లకు సమీపిస్తుండడంతో ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలు ఒత్తిడి ఎదుర్కోవచ్చు. చక్కెర ధరలూ పెరగడం ఈ కంపెనీలకు ప్రతికూల సెంటిమెంటుగా మారుతోంది. వరుసగా మూడో వారమూ ఎఫ్ఎమ్‌సీజీ సూచీ నష్టపోవచ్చు.చమురు-గ్యాస్ రంగ షేర్లు స్థిరీకరణ దశలో కొనసాగొచ్చు. రెండు నెలలుగా 10,950-11,410 శ్రేణిలోనే ఈ రంగ సూచీ కదలాడుతోంది. దేశీయ పీఎన్‌జీ కనెక్షన్లను మరింత విస్తరించడానికి కేంద్రం పథకాన్ని ప్రవేశపెట్టడం పీఎన్‌జీ కంపెనీలకు సానుకూలతలు తీసుకురావొచ్చు. ఐటీ రంగంలో లార్జ్‌క్యాప్ కంపెనీలతో పోలిస్తే మిడ్‌క్యాప్ షేర్లు రాణించొచ్చు. పెద్ద కంపెనీలతో పోలిస్తే మధ్య స్థాయి కంపెనీలకు ఏఐ (కృత్రిమమేధ) ప్రాజెక్టులు వెళ్తుండటం ఇందుకు కారణం. స్వల్పకాలంలో ఐటీ సూచీ ఒక శ్రేణిలో కదలాడొచ్చు.స్వల్పకాలంలో టెలికాం కంపెనీలు లాభాలందుకోవచ్చు. డిసెంబరు త్రైమాసికంలో టారిఫ్ పెంపు ఉండబోతోందన్న వార్తలు ఇందుకు నేపథ్యం. టెలికాం సూచీకి 3,550 వద్ద మద్దతు, 3,750 వద్ద నిరోధం కనిపిస్తోంది.
యంత్రపరికరాల షేర్లు ఒత్తిడిలో కొనసాగొచ్చు. ముడి చమురు అధిక ధరలు ఈ కంపెనీల మార్జిన్లను భయపెడుతున్నాయి. జూన్ త్రైమాసికంలో ఇదే కారణంతో పలు కంపెనీల మార్జిన్లు దెబ్బతిన్నాయి కూడా. నిఫ్టీ లోహ సూచీ 13,000 పాయింట్లను తిరిగి అందుకుంది. ఇది సానుకూలత తీసుకురావొచ్చు. విలువైన-పారిశ్రామిక అవసరాలకు తోడ్పడే లోహాల ధరలు పెరగడం మార్కెట్ సెంటిమెంటును మెరుగుపరుస్తోంది. నిఫ్టీ బ్యాంక్ సూచీ స్థిరంగా కొనసాగొచ్చు. బలమైన రుణ వృద్ధి, కీలక కంపెనీల్లో ఇటీవలి కాలంలో దిద్దుబాటు చోటు చేసుకోవడంతో, కొనుగోళ్లు కనిపిస్తుండడం ఇందుకు దోహదం చేయొచ్చు. నిఫ్టీ బ్యాంక్‌కు 57,381.10 వద్ద మద్దతు, 57,962.90 వద్ద నిరోధం కనిపిస్తోంది.రెండు వారాల నష్టాల తర్వాత నిఫ్టీ వాహన సూచీ రాణించొచ్చు. సమీప భవిష్యత్తు అంచనాలు బులిష్‌గా ఉన్నాయని కొందరు, ఏదో ఒక దిశగా వెళ్లడానికి ముందు స్థిరీకరణ జరగొచ్చని కొంత మంది సాంకేతిక నిపుణులు అంటున్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిణామాలు ఇంకా సానుకూలంగా మారనందున, సిమెంటు షేర్లు స్తబ్దుగానే కొనసాగొచ్చు. గిరాకీ రికవరీలో వృద్ధి, మౌలిక వసతులపై పెట్టుబడుల ధోరణి బట్టి ఈ షేర్ల పనితీరు ఆధారపడి ఉంటుంది.




# ఎల్‌పీజీ నుంచి పీఎన్‌జీకి వేగంగా మారాలి

- జిల్లా స్థాయిలో పాలనా వ్యవస్థల మద్దతు కావాలి
- రాష్ట్రాలను కోరిన పెట్రోలియం మంత్రిత్వ శాఖ

**ఇళ్లలో వంటగ్యాస్ వినియోగాన్ని ఎల్‌పీజీ సిలిండర్ల నుంచి పైపుల ద్వారా సరఫరా చేసే గ్యాస్ (పీఎన్‌జీ)కు మార్చే ప్రక్రియను వేగవంతం చేయడానికి జిల్లా స్థాయిలో పాలనా వ్యవస్థలు మద్దతు ఇవ్వాలని పెట్రోలియం మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరింది. గ్యాస్ పంపిణీదార్లు, చమురు మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం చేయడానికి నోడల్ అధికారులను నియమించాలనీ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులకు పెట్రోలియం కార్యదర్శి నీరజ్ మిత్తల్ లేఖ రాశారు.**

**దిల్లీ:** ఎల్‌పీజీ సిలిండర్లకు భారీ రవాణా వ్యవస్థలు అవసరమవుతున్నాయని.. అదే సురక్షిత, స్వచ్ఛమైన పీఎన్‌జీ ని పైపుల ద్వారా సులువుగా సరఫరా చేయొచ్చని వివరించారు. సిలిండర్ బుక్ చేయడం, సరఫరా కోసం వేచి చూసే అవసరమూ వినియోగదార్లకు ఉండదని వివరించారు. పైపుల ద్వారా గ్యాస్ సరఫరా అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో, ఒకే కుటుంబం ఎల్‌పీజీ - పీఎన్‌జీ కనెక్షన్ రెండింటినీ కలిగి ఉండకుండా నిరోధించాలనే లక్ష్యంతో జిల్లా స్థాయి అధికారుల సహకారాన్ని పెట్రోలియం శాఖ కోరుతోంది. ఇరాన్‌పై అమెరికా యుద్ధం ఆరంభించాక, ఎల్‌పీజీ సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే ఇళ్లకు పైపుల ద్వారా గ్యాస్ (పీఎన్‌జీ) సరఫరా ప్రక్రియను వేగవంతం చేయాలనే ఒత్తిడి పెరిగింది. ఎల్‌పీజీ సరఫరాల్లో చాలా వరకు ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ నుంచి హర్మూజ్ జలసంధి ద్వారా రావాల్సి ఉంది. ఈ జలసంధి మూసివేతతో, మనదేశానికి ఎల్‌పీజీ దిగుమతులకు అంతరాయం ఏర్పడింది. ఫలితంగా ఉన్న ఎల్‌పీజీని ఇళ్లకు సిలిండర్లుగా సరఫరా చేసేందుకు.. వాణిజ్య, పారిశ్రామిక అవసరాలపై ఆంక్షలు విధించారు. తదుపరి అమెరికా, అల్జీరియా నుంచీ ఎల్‌పీజీని మనదేశం కొనుగోలు చేస్తోంది. దేశీయంగా ఉత్పత్తి చేసిన సహజ వాయువును, పైపుల ద్వారా ఇళ్లకు సరఫరా చేసేందుకు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఇందువల్ల దిగుమతి చేసుకునే ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ అవసరాలు కొంత తగ్గుతున్నాయి. ఇందుకోసం సిటీగ్యాస్ సంస్థలు విస్తరిస్తుండగా, ఇళ్లకు పైపుల ద్వారా గ్యాస్ అందుకోవడాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఇందుకు అనువైనవని గుర్తించిన హౌసింగ్ సొసైటీలు, నివాస సముదాయాల సంఘాలకు, వ్యక్తిగత ఇళ్ల యజమానులకు కూడా పీఎన్‌జీ తీసుకోవాలని నోటీసులు ఇస్తున్నారు.



# స్థిరాస్తి సంస్థల బుకింగులు తగ్గాయ్

### ఏప్రిల్-జూన్‌లో రూ.39,964 కోట్లకు పరిమితం

**దిల్లీ:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో నమోదైన 28 స్థిరాస్తి సంస్థల బుకింగ్‌లు ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.39,964 కోట్లకు పరిమితమయ్యాయి. 2025-26 ఏప్రిల్-జూన్ త్రైమాసిక బుకింగులు రూ.50,900 కోట్ల కంటే ఇవి 21% తక్కువ. ఇందులో వాణిజ్య, నివాస సముదాయాలు నిర్మించే సంస్థల వివరాలున్నాయి. ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో, కొందరు పెద్ద డెవలపర్లు గృహ నిర్మాణ ప్రాజెక్టులను ప్రారంభించడానికి వెనుకాడటంతోనూ, అమ్మకాల పరిమాణం తగ్గింది. మొత్తంమీద బుకింగుల్లో అత్యధిక వాటాను గృహ నిర్మాణ రంగమే సమకూర్చింది. అమ్మకాల బుకింగ్‌ల్లో గోద్రేజ్ ప్రోపర్టీస్ అతిపెద్ద నమోదిత స్థిరాస్తి డెవలపర్‌గా నిలిచింది. ఈ కంపెనీ 2025 ఏప్రిల్-జూన్‌లో రూ.7,082 కోట్ల విలువైన ఆస్తులను విక్రయించగా, ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో రూ.8,651 కోట్ల విలువైన ఆస్తులను విక్రయించింది. 28 నమోదిత సంస్థల్లో 19 డెవలపర్ సంస్థలు ముందస్తు విక్రయాల్లో (ప్రీ-సేల్స్) వృద్ధి నమోదు చేశాయి. ఇందులో గోద్రేజ్ ప్రోపర్టీస్‌తో పాటు లోధా, శోభ, మ్యాక్స్ ఎస్టేట్స్, పూర్వాంకర, కల్పతరు, ఎంబసీ డెవలప్‌మెంట్స్, మహీంద్రా లైఫ్‌స్పేస్, రేమాండ్ రియాల్టీ, సన్‌టెక్ రియాల్టీ, కోల్టే-పాటిల్, శ్రీరామ్ ప్రోపర్టీస్, అజ్మీరా రియాల్టీ, అరవింద్ స్మార్ట్‌స్పేసెస్, టార్క్, శ్రీ లోటస్ డెవలపర్స్, అరిహంట్ సూపర్‌స్ట్రక్చర్స్, ఆర్కేడ్, సూరజ్ ఎస్టేట్ సంస్థలు ఉన్నాయి. డీఎల్ఎఫ్, ప్రెస్టీజ్, ఒబెరాయ్ రియాల్టీ, సిగ్నేచర్ గ్లోబల్, ఆదిత్య బిర్లా రియల్ ఎస్టేట్, బ్రిగేడ్, ఆషియానా హౌసింగ్, ఎల్డెకో హౌసింగ్, కీస్టోన్ రియల్టర్స్ సంస్థల విక్రయ బుకింగులు తగ్గాయి.



# సైన్యానికి నభాస్త్ర డ్రోన్లు

### ఇండియన్ ఆర్మీకి సమకూరనున్న కమికాజీ డ్రోన్

భారత సైన్యానికి అవసరమయ్యే 30 వీటీవోఎల్ కమికాజీ డ్రోన్ యూనిట్లను సరఫరా చేసే కాంట్రాక్టు విశాఖపట్నానికి చెందిన నభాస్త్ర సంస్థకు దక్కింది. ప్రభుత్వ ఇ-మార్కెట్ పోర్టల్‌లో తామే తక్కువ మొత్తానికి కోట్ చేసి, ఎల్ 1 బిడ్డర్‌గా నిలిచినట్లు సంస్థ తెలిపింది. సైన్యం కోసం వీటీవోఎల్, అటానమస్ డైవ్ రికవరీ కమికాజీ డ్రోన్ వేరియంట్‌లను అభివృద్ధి చేస్తామని సంస్థ వివరించింది.

# సరకు రవాణాకు డబుల్ స్టాక్ కంటెయినర్ రైలు

**ముంబయి:** ఓడరేవులు, టర్మినళ్ల నుంచి భారీ పరిమాణంలో సరుకు రవాణాకు ఉపయోగపడే తొలి 'డబుల్ స్టాక్ లాంగ్ హాల్ కంటెయినర్ రైలు'ను ముంబయిలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు ట్రస్టు నుంచి గుజరాత్‌లోని వడోదరా వరకు విజయవంతంగా నడిపినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. ఈ కంటెయినర్ రైలు ఈనెల 21న సాయంత్రం 7 గంటలకు జేఎన్‌పీటీ నుంచి బయలుదేరి, దేశ పశ్చిమప్రాంతంలో సరుకు రవాణాకు ప్రత్యేకించిన కారిడార్‌లో 422 కిలోమీటర్లు ప్రయాణించి వడోదరా చేరుకుంది. రెండు రేక్‌లూ కలిసి మొత్తం 360 టీఈయూ భారీ పరిమాణంలో సరుకు రవాణా చేశాయి. ఈ రైలు వీడియోను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పంచుకున్నారు.



# పసిడి ఆకర్షణీయం!

పసిడి అక్టోబరు కాంట్రాక్టు ఈవారం రూ.1,57,609 దిగువన ట్రేడ్ కాకుంటే రూ.1,61,815; రూ.1,64,205 వరకు వెళ్లొచ్చు. లాంగ్ పొజిషన్లను రూ.1,65,875 వరకు కొనసాగించొచ్చు. ఒకవేళ లాభాల స్వీకరణతో కిందకొస్తే రూ.1,55,219 వద్ద తక్షణ మద్దతు ఉంది. ఇది కోల్పోతే రూ.1,51,013; రూ.1,48,623 వరకు దిగిరావొచ్చు.వెండి సెప్టెంబరు కాంట్రాక్టును రూ.2,41,556 స్టాప్‌లాస్‌తో తగ్గినప్పుడు కొనుగోలు చేసి, విక్రయించొచ్చు. ర్యాలీ కొనసాగితే రూ.2,53,679 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. దీన్ని అధిగమిస్తే రూ.2,60,998; రూ.2,73,872 వరకు వెళ్లొచ్చు. ఒకవేళ అమ్మకాల ఒత్తిడి వస్తే రూ.2,33,486 వద్ద మద్దతు లభించొచ్చు. ఇది కోల్పోతే రూ.2,20,612 స్థాయికీ దిగిరావొచ్చు.

**ప్రాథమిక లోహాలు**

రాగి ఆగస్టు కాంట్రాక్టు రూ.1,383 దిగువన ట్రేడ్ కానంత వరకు రూ.1,391-1,396.95 లక్ష్యాలతో పొజిషన్లు కొనసాగించొచ్చు. రూ.1,396.95 దిగువన అమ్మకాలకు మొగ్గుచూపొచ్చు. రూ.1401 పైన షార్ట్ పొజిషన్లకు దూరంగా ఉండాలి.సీసం ఆగస్టు కాంట్రాక్టు రూ.196 దిగువకు చేరితే, రూ.195.05- 194.10 వరకు వెళ్లొచ్చు. ధర రూ.194 స్థాయికి చేరితే కొనుగోళ్లకు మొగ్గుచూపొచ్చు.జింక్ ఆగస్టు కాంట్రాక్టు వరుసగా అయిదో వారమూ పెరిగినా, అధిక స్థాయుల్లో అప్రమత్తంగా ఉండాలి. ఒక్కసారిగా అమ్మకాలు వచ్చే అవకాశం ఉంది. పెరిగితే రూ.412.88; రూ.418.12 వద్ద నిరోధం, తగ్గితే రూ.397.97 వద్ద మద్దతు కనిపిస్తున్నాయి.అల్యూమినియం ఆగస్టు కాంట్రాక్టు రూ.343.40 దిగువన ట్రేడ్ అయితే రూ.342.10 వద్ద మద్దతు పొందొచ్చు. ఒకవేళ పైకి వెళ్తే రూ.357.60; రూ.362.65 వద్ద నిరోధం ఉన్నాయి. ముడిచమురు సెప్టెంబరు కాంట్రాక్టు ఒడుదొడుకుల మధ్య కదలాడొచ్చు. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ప్రభావం చూపొచ్చు. రూ.8,579-8,721 శ్రేణిలో ట్రేడర్లు విక్రయాలకు మొగ్గుచూపొచ్చు. ముందుగా రూ.8,189, తర్వాత రూ.7,974; రూ.7,584 స్థాయులను లక్ష్యంగా పెట్టుకోవాలి. సహజవాయువు ఆగస్టు కాంట్రాక్టు రూ.277 స్థాయికి ఎగువన స్థిరపడితేనే, సానుకూల ధోరణి కొనసాగొచ్చు. తగ్గితే రూ.260.55 వద్ద తక్షణ మద్దతు పొందొచ్చు. ఒకవేళ పైకి వెళ్తే రూ.277.75; రూ.285.75 దగ్గర నిరోధం ఎదురుకావొచ్చు.ఎల్‌నినో ఆందోళనలకు తోడు నిల్వలు తగ్గడంతో పసుపు అక్టోబరు కాంట్రాక్టు రాణించొచ్చు. రూ.23,040, రూ.24,042 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. కిందకొస్తే రూ.20,406; రూ.18,794 వద్ద మద్దతు లభించొచ్చు.

## యూపీఐకి పదేళ్లు.. లావాదేవీల సంఖ్యలో

# 13 వేల రెట్లు వృద్ధి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత ఆర్థిక వ్యవస్థను డిజిటల్ బాట పట్టించడంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్‌ది కీలక పాత్ర. 2016 ఆగస్టు 25న ప్రారంభమైన ఈ వ్యవస్థకు ఈ నెల 25తో పదేళ్లు పూర్తవుతున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంకు నియంత్రణ పర్యవేక్షణలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఔఖఅఎ) దీన్ని రూపొందించింది. ఫోన్ నంబర్లు, క్యూఆర్ కోడ్, మొబైల్ యాప్‌ల ద్వారా వ్యక్తి నుంచి వ్యక్తికి, వ్యక్తి నుంచి వ్యాపారికి రియల్‌టైమ్‌లో జరిగే యూపీఐ చెల్లింపులు.. దశాబ్ద కాలంలో దేశ డిజిటల్ పేమెంట్స్ రూపురేఖలను మార్చేశాయి.కేంద్ర ఆర్థిక శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. 2016-17లో వార్షిక యూపీఐ లావాదేవీల సంఖ్య 1.78 కోట్లుగా ఉండగా, 2025-26 నాటికి అది ఏకంగా 24,162 కోట్లకు పైగా పెరిగింది. అంటే దాదాపు 13 వేల రెట్లు వృద్ధి నమోదైంది. అదే సమయంలో




లావాదేవీల విలువ రూ.ఏడు వేల కోట్ల నుంచి దాదాపు రూ.314 లక్షల కోట్లకు పెరిగింది.ఈ ఏడాది మే నెలలో యూపీఐ నెలవారీ లావాదేవీల సంఖ్య తొలిసారిగా 2,300 కోట్లను దాటి 2,320 కోట్లకు చేరుకుంది. జులైలో ఏకంగా 2,366 కోట్ల లావాదేవీలతో పదేళ్లలో సరికొత్త గరిష్ఠ స్థాయి నమోదైంది. ప్రస్తుతం రోజూ దాదాపు 66 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి.లావాదేవీల సంఖ్యపరంగా ప్రపంచంలోనే అతిపెద్ద రియల్‌టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా యూపీఐని అంతర్జాతీయ ద్రవ్యనిధి గుర్తించింది. 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా రియల్‌టైమ్ పేమెంట్

## సంక్షిప్తంగా..



### బస్టాండ్‌లో గంజాయి పట్టివేత

ఇబ్రహీంపట్నం(జనంసాక్షి): జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, మెట్పల్లి డీఎస్పీ రాములు సూచనలతో మెట్పల్లి సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎస్ఐ జి. నవీన్ కుమార్, పోలీస్ సిబ్బంది కలిసి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం బస్టాండ్ వద్ద ఎస్ఐ నవీన్ కుమార్, పోలీస్ సిబ్బంది తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన బీహార్‌కు చెందిన సాగర్ కుమార్ (19)ను పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద 300 గ్రాముల ఎండు గంజాయి, ఒక మొబైల్ ఫోన్ లభించాయి. పోలీసుల విచారణలో నిందితుడు బీహార్ నుంచి గంజాయి తీసుకొచ్చి మెట్పల్లి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు, మిగిలిన ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకొచ్చి నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ నవీన్ కుమార్, కానిస్టేబుళ్లు సంతోష్ కుమార్, ప్రశాంత్ చైతన్య, మహేందర్లను మెట్పల్లి సీఐ సురేష్ బాబు అభినందించారు. యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం ఉంటే తెలియజేయాలని అధికారులు సూచించారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నాం



**ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా తహసీల్దార్ కార్యాలయాలు పనిచేయాలి:మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**కమాన్ పూర్‌లో రూ.75 లక్షలతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం**

కమాన్‌పూర్, ఆగస్టు 24, (జనంసాక్షి) : ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమ కార్యక్రమాలతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సోమవారం పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలంలో రూ. 75 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంథని ప్రాంతంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు గంగాపురి వద్ద ఏర్పాటు చేసిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా పరిసర ప్రాంతాలకు నాణ్యమైన, స్థిరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. రైతులు, గృహ వినియోగదారులు, వ్యాపారులు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుతో పాటు విద్యుత్, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మంజూరైన నిధులను సకాలంలో వినియోగిస్తూ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.

**తహసీల్దార్ కార్యాలయం ప్రజలకు సేవా కేంద్రంగా పనిచేయాలి : మంత్రి శ్రీధర్ బాబు**

కమాన్ పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం ప్రజలకు మెరుగైన సేవలు అందించే కేంద్రంగా పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరిని గౌరవంగా స్వీకరించి, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అన్నారు. ప్రజలు అందించే దరఖాస్తులు, ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులో పరిష్కరించాలని, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంధాలయ శాఖ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, ఆర్డీఓ సురేష్, తహసిల్దార్ వాసంతి, సంబంధిత ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ‘22ఏ’భూ బాధితులకు న్యాయం చేయాలి

- నిషేధిక జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలి
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్ టౌన్, ఆగస్టు 24 (జనంసాక్షి): రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఏ సెక్షన్‌ను దుర్వినియోగం చేస్తూ అర్హత కలిగిన ప్రైవేటు పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడం సరికాదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న అర్హత కలిగిన పట్టా భూములను వెంటనే తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. భూ బాధితులకు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ.. ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు 22ఏ సెక్షన్‌ను ఉద్దేశించారని తెలిపారు. అయితే ఈ నిబంధనలను ఆధారంగా చేసుకుని ప్రైవేటు పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వేలాది మంది భూ యజమానులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కరీంనగర్ నియోజకవర్గంలోని రేకుర్తి, కొత్తయాస్వాడ, విద్యానగర్, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పట్టా భూములు 22ఏ జాబితాలోకి వెళ్లాయని తెలిపారు. ఏళ్లుగా భూములను అనుభవిస్తున్న పట్టాదారులు సైతం వాటిని విక్రయించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్య, వైద్యం, వివాహాలు, కుటుంబ అవసరాల కోసం భూములను విక్రయించాల్సిన సమయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో బాధితులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 22ఏ నిబంధనల ప్రకారం నిర్దేశిత చట్టపరమైన ప్రక్రియను పాటించి భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని, పట్టాదారులకు సరైన నోటీసులు ఇచ్చి సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. భూ రికార్డులను ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు సమీక్షించి అర్హత కలిగిన పట్టా భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 22ఏ సెక్షన్ దుర్వినియోగంపై నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలని గంగుల డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే ‘చలో సెక్రటేరియట్’ చేపడతామని హెచ్చరించారు. భూ బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, భూ బాధితులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహితను బెదిరించి లైంగిక వేధింపులు

**వ్యక్తి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు**



కరీంనగర్, క్రైమ్ ఆగస్ట్ 24 (జనంసాక్షి): కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని బొమ్మకల్ గ్రామంలోని మధురానగర్‌కు చెందిన ఓ వివాహిత తన భర్త, పిల్లలతో కలిసి జీవిస్తోంది. గత ఆరు నెలలుగా సీతారాంపూర్‌కు చెందిన బైక్ మెకానిక్ మెడిదొడ్డి సాయికుమార్‌కు ఆమె కుటుంబంతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని ఆసరాగా చేసుకున్న సాయికుమార్, సదరు వివాహితతో తరచుగా ఫోన్‌లో మాట్లాడటం, మెసేజ్‌లు చేయడం ప్రారంభించాడు. అనంతరం ఆమె భర్త ఇంట్లో లేని సమయంలో ఇంటికి వచ్చి, ఆమెను బెదిరిస్తూ తనతో మాట్లాడాలని, లేకపోతే చంపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అలాగే ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ పలుమార్లు బలవంతంగా శారీరకంగా వేధించినట్లు తెలిపింది. ఈ విషయం తన భర్తకు తెలిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని బెదిరిస్తూ, ఆమెను భయభ్రాంతులకు గురిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అయితే భార్య ప్రవర్తనపై అనుమానం వచ్చిన భర్త ఇంట్లో సీసీ కెమెరాను ఏర్పాటు చేయగా, సాయికుమార్ ఆమెను కలిసిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఈ విషయం అనంతరం కుటుంబంలో వివాదం ఏర్పడటంతో భర్త తన కుమారుడిని తన వద్ద ఉంచుకుని, కుమార్తెను భార్య వద్దకు పంపినట్లు తెలిపారు. అనంతరం ఆమెకు న్యాయవాది ద్వారా కోర్టు నుంచి విడాకుల నోటీసు పంపించినట్లు తెలిసింది. సాయికుమార్‌ను ఈ విషయంపై ప్రశ్నించగా, తనకు అవసరమైన పుడు ఆమెను ఉపయోగించుకున్నానని, ఇకపై తన వద్దకు రావద్దని, ఎక్కడైనా చెప్పుకోవచ్చని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో బాధితురాలు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సాక్షులను, బాధితురాలి భర్తను విచారించి, సీసీ కెమెరాలో నమోదైన వీడియోను సేకరించారు. నిందితుడు సాయికుమార్ పరారీలో ఉండగా, ఈరోజు గణేశ్‌నగర్‌లోని తన బైక్ మెకానిక్ షాపు వద్ద ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి వెళ్లి సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని ఈరోజు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి తెలిపారు. దర్యాప్తులో భాగంగా బాధితురాలిని కరీంనగర్‌లోని భరోసా సెంటర్‌కు పంపించి, అవసరమైన సహాయం అందించడంతో పాటు వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## పర్మిషన్ ఒకటి.. నిర్మాణం మరొకటి..!

**అక్రమ నిర్మాణంపై ప్రజావాణిలో ఫిర్యాదు**



మెట్‌పల్లి(జనంసాక్షి): పర్మిషన్‌కు మించి అక్రమంగా చేపట్టిన ఇంటి నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ వ్యక్తి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని 12వ వార్డు, వెంకట్రావ్ నగర్ శివారు, తిరుమల అపార్ట్‌మెంట్ సమీపంలో, జాతీయ రహదారికి ఆనుకుని పోతు మనోహర్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. అక్టోబర్ 2023 లో జీ+2 అనుమతి తీసుకుని, జీ+3 గా నిర్మాణం చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా జాతీయ రహదారి వైపు 4 మీటర్లు సెట్‌బ్యాక్ వదలకుండా, బ్రూక్లిన్ స్కూల్ రోడ్డు వైపు 5 ఫీట్లు రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, మున్సిపల్ అధికారులు యజమానితో కుమ్మక్కై చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదుదారుడు ఆర్డీవో నరసింహరావుకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో అవినీతి ఆరోపణలపై టీపీఓ రాజేంద్ర ప్రసాద్ ను జిల్లా కలెక్టర్ బీ. సత్యప్రసాద్ సస్పెండ్ చేసినా, అధికారుల తీరులో మార్పు రాలేదని, పట్టణంలో ఇలాంటి అక్రమ నిర్మాణాలు, రోడ్ల ఆక్రమణలు కోకొల్లలుగా ఉన్నాయని, కేవలం నోటీసులతో సరిపెడుతున్నారే తప్ప కూల్చివేతలు చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి తొలగించాలని కోరారు.




## ‘22ఏ’పై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది

- ప్రతిపక్షాల డ్రామాలెందుకు? స్వయంగా సీఎం, రెవెన్యూ మంత్రే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి పర్యవేక్షిస్తున్నారు
- కలెక్టర్ సమస్యను త్వరితగతిన పరిష్కరించే పనిలో ఉన్నారు
- 22ఎ పరిధిలో ఉన్నవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 24 (జనంసాక్షి) 22ఎ సమస్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వచ్చిన వెంటనే రెవెన్యూ మంత్రితో, అధికారులతో సమీక్ష నిర్వహించి వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవ్వరు కూడా ఇబ్బందులు పడొద్దని చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుంటే ప్రతి పక్షాలు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ప్రభుత్వమే కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి త్వరితగతిన విచారణ జరిపి పరిష్కరించమని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వగా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు అదే పనిమీద ఉన్నారని దీంట్లో ప్రతిపక్ష పార్టీలు సొచ్చి లబ్ది పొందాలని చూడడం విడ్డూరంగా ఉందని నరేందర్ రెడ్డి తెలిపారు. భూదందాలకు కేరాఫ్ అడ్రసే బీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలు ధరణి పేరుతో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసి అనేక భూదందాలకు పాల్పడి భూకబ్జాలలో వాళ్ల నాయకులు జైలుకు వెళ్లి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ డ్రామాలు ఆడుతున్నారని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా 22ఎలో ఉన్న వారికి స్పష్టంగా తెలియజేస్తున్నామని, మీకెవ్వరి మద్దతు అవసరం లేదని, ప్రభుత్వమే మీ పక్షాన నిలబడి ఉందని, అధికారులు అదే పనిమీద ఉన్నారని, ఎవ్వరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కుర్ర పోచయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ముక్క భాస్కర్, అస్థాపురం రమేష్, మామిడి సత్యనారాయణ రెడ్డి, భారీ, బషీర్, మిరాజ్, తోట అంజయ్య, లక్కిరెడ్డి కిరణ్ రెడ్డి, పెద్దిగారి తిరుపతి, బత్తుల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ ను సస్యశ్యామలం చేస్తా...


- భూసేకరణ వేగవంతం 250కోట్ల నిధులు మంజూరు
- కాలువల నిర్మాణానికి రైతులు సహకరించాలి
- ఓగులాపూర్‌లో చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి
- విద్యుత్ శాఖ అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం
- పల్లె పల్లెకు పొన్నమన్న కార్యక్రమాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్



చిగురుమామిడి ఆగస్టు 24 (జనంసాక్షి): గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నట్లు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పల్లెకు పొన్నమన్న కార్యక్రమంలో భాగంగా సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్, నవాబుపేట, ఇందుర్తి, ఓగులాపూర్, గునుకులపల్లి గ్రామాల్లో పర్యటించి సమావేశాలు నిర్వహించి అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామాల్లో మంత్రి పొన్న ప్రభాకర్ పర్యటించారు. భూసేకరణకు వేగవంతం చేసే దిశగా 250కోట్లు నిధులు మంజూరు చేశామని, కాలువల నిర్మాణానికి రైతులు సహకరించాలని, రైతులు అధిక దిగుబడి నిచ్చే ఆయిల్ ఫామ్ ను సాగు చేయాలని కోరారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా ముందుకెళ్లాలని కోరారు. ఇంకుడు గుంతల నిర్మాణంలో ప్రజా ప్రతినిధులు పోటీ పడాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపుతో ఆయిల్ ఫామ్ సాగు పెద్ద ఎత్తున రైతులు ముందుకు వచ్చారు. సోలార్ విద్యుత్తో ఆదావవుతుందని, సబ్సిడీ షెడ్యూల్ చేసుకోవాలని చెప్పారు. గునుకులపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో సబ్ మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు కృషి చేస్తానని, అంగన్వాడి సెంటర్ మంజూరు చేస్తానని తెలిపారు. గత ప్రభుత్వం తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణం పేరుతో సేకరించిన భూములకు సంబంధించిన అంశాన్ని రైతులతో కలిసి చర్చించి పరిష్కారం దిశగా నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ముంపున గురైన భూముల్లో పండించిన దానియాన్ని సైతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు గ్రామాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను మందలించారు. పల్లె పల్లెకు పొన్నమన్న కార్యక్రమానికి గ్రామాల్లోని ప్రజల నుండి అనుహస్పందన లభించింది. పలు హామీలు ఇస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలతో మామకమవుతూ ముందుకు వెళ్లారు. ఆర్డీవో షర్మిల, డీపీవో జగదీశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్, సర్పంచులు గుళ్ళ రజిత రాజు, చింతపుల నరేందర్ పటేల్, గడ్డం రమాదేవి శ్రీనివాస్ రెడ్డి, గునుకుల మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్, మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్, నాయకులు సాంబారి బాబు, చిట్టుమల్ల రవీందర్, పోటు మల్లారెడ్డి, దోమ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీల్లో ‘సత్యశోధక్’ విద్యార్థినుల ప్రతిభ

**‘స్పెల్లింగ్ మాస్ట్రో’గా స్వేచ్ఛ.. ‘సూపర్ స్పెల్లర్’గా మేఘన**




సిరికొండ, ఆగస్టు 24 (జనం సాక్షి): జాతీయ స్థాయి స్పెల్లింగ్ బీ పోటీల్లో సత్యశోధక్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి ప్రతిష్ఠాత్మక అవార్డులను సొంతం చేసుకున్నారు. పాఠశాలకు చెందిన సి. హెచ్. స్వేచ్ఛ ‘స్పెల్లింగ్ మాస్ట్రో’ అవార్డును, ఎం. మేఘన ‘సూపర్ స్పెల్లర్’ అవార్డును అందుకుని పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో గల పి.ఎన్.ఎం. ఉన్నత పాఠశాలలో ఆదివారం విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి స్పెల్లింగ్ బీ పోటీల్లో సత్యశోధక్ పాఠశాల విద్యార్థినులు ఈ అవార్డులను అందుకున్నారు. నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్ ప్రధాన కార్యదర్శి కె. తులసి ప్రసాద్, ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి.ఎస్.ఎన్. మూర్తి, విశ్వం ఎడ్యుటెక్ డైరెక్టర్ ప్రసాద్ చేతుల మీదుగా స్వేచ్ఛ, మేఘన అవార్డులను స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించారు. ఆంగ్ల భాష ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థినులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి అవార్డులు సాధించడంపై సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని వివిధ జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం అభినందనీయమన్నారు. విద్యార్థినుల విజయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో విశ్వం ఎడ్యుటెక్ ప్రతినిధులు వినాయక్, కిషోర్, పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, అంకిత్, పూజిత్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

**జర్నలిస్టుల పిల్లలకు 50 % ఫీజు రాయితీపై ప్రైవేట్ పాఠశాలల సాకులు**




జగిత్యాల ప్రతినిధి (జనంసాక్షి): జగిత్యాల జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఆ ఆదేశాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కోరుతూ పాఠశాలలను సంప్రదిస్తే.. “సీట్లు పూర్తయ్యాయి”, “ఈ జీవో మా పాఠశాలకు వర్తించదు”, “అలాంటి రాయితీ ఇవ్వడం సాధ్యం కాదు” అంటూ వివిధ సాకులు చెబుతున్నారని పలువురు జర్నలిస్టులు ఆరోపిస్తున్నారు.

**కలెక్టర్ ఆదేశాల అమలు ఎక్కడ?**

జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో కొన్ని పాఠశాలల యాజమాన్యాలు వాటిని అమలు చేయకపోవడంపై జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత పాఠశాలల యాజమాన్యాలపై ఉన్నప్పటికీ, నిబంధనలను పక్కనపెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు పేర్కొంటున్నారు.

**విద్యాశాఖ అధికారులు స్పందించాలి..**

కలెక్టర్ ఆదేశాలను అమలు చేయని పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే దృష్టి సారించాలని జర్నలిస్టులు కోరుతున్నారు. జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి, జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలవుతున్నదీ లేనిదీ పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ సాకులు చెబుతున్న పాఠశాలలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు వెంటనే ఫీజు రాయితీ కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- రూ.5 వేల జరిమానా..
- పకడ్బందీ దర్యాప్తుతో నిందితుడికి శిక్ష
- జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు



**మెదక్ బ్యూరో, ఆగస్టు 24 (జనం సాక్షి) :** మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సోమవారం వెల్లడించారు. పుల్కల్ మండలం పోచారం గ్రామానికి చెందిన లక్ష్మణ్ సుమారు 14 ఏళ్ల క్రితం గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరిని వివాహం చేసుకుని ఇల్లరికం వచ్చాడు. వీరికి అభిలాష్, కార్తీక్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన లక్ష్మణ్ తరచూ భార్య, కుటుంబ సభ్యులను వేధించడంతో 2023లో అతడిని కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటకు పంపించారు. ఈ క్రమంలో 2025 సెప్టెంబర్ 30న లక్ష్మణ్ గడిపెద్దాపూర్ గ్రామానికి వచ్చినట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. అదే రోజు రాత్రి పుట్టి ఆంజనేయులుతో కలిసి మద్యం సేవించాడు. అనంతరం మద్యం మత్తులో ఇద్దరి మధ్య ఘర్షణ జరగడంతో ఆంజనేయులు లక్ష్మణ్‌పై దాడి చేసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని బయట పడేసి అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు 2025 అక్టోబర్ 1న అల్లాదుర్గ్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శంకర్ కేసు నమోదు చేశారు. అల్లాదుర్గ్ సీఐ రేణుకరెడ్డి సమగ్రంగా దర్యాప్తు చేపట్టి, సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు, ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు పుట్టి ఆంజనేయులుకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ అర్షద్ సహకరించారు. పకడ్బందీగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

# ఆగస్టు 30న నీట్-పీజీ పరీక్షను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించాలి

- ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా నిషేధం
- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్-పీజీ 2026 పరీక్షను ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నీట్-పీజీ పరీక్ష ఏర్పాట్లపై పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, పరీక్షా కేంద్రాల నిర్వాహకులు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో భద్రత, విద్యుత్, ఇంటర్నెట్, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.

జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 360 మంది అభ్యర్థులు నీట్-పీజీ పరీక్షకు హాజరుకానున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ధర్మాపూర్‌లోని జయప్రకాశ్ నారాయణ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 180 మంది, మహబూబ్‌నగర్‌లోని క్రిస్టియన్‌పల్లిలో గల ఎం.ఎస్. ఏస్ ఇన్ఫోటెక్ సర్వీసెస్, ఫాతిమా విద్యాలయంలో 180 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

నీట్-పీజీ పరీక్ష కంప్యూటర్ ఆధారిత పరీక్షగా ఒకే షిఫ్ట్‌లో ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడుతుందని, అభ్యర్థుల రిపోర్టింగ్ ఉదయం 7.00 గంటల నుంచి ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇయర్‌ఫోన్‌లు/ఇయర్‌పీస్‌లు, బ్లూటూత్ పరికరాలు, స్పై కెమెరాలు, ఇతర ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పరికరాలు తదితర నిషేధిత వస్తువులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, హ్యాండ్‌హెల్డ్ మెటల్ డిటెక్టర్లను వినియోగించాలని ఆదేశించారు.

మహిళా అభ్యర్థుల తనిఖీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డులు, ఆధార్/బయోమెట్రిక్ ధృవీకరణ తదితర నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

### నోడల్, మానిటరింగ్ అధికారులు నియామకం

పరీక్షల నిర్వహణకు స్థానిక సంస్థల అధికారి నోడల్ అధికారిగా వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు. ఆర్.డి.ఓ. మానిటరింగ్ అధికారిగా వ్యవహరించాలని ఆదేశించారు. అలాగే రెండు పరీక్షా కేంద్రాలకు తహశీల్దార్ స్థాయి అధికారులను మానిటరింగ్ అధికారులుగా నియమించి, పరీక్షా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఎస్.ఈ. .ఎస్.పీ.డి.సీ.ఎల్ ను ఆదేశించారు. కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా పరీక్ష సూపరింటెండెంట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని



డి.ఎం.హెచ్.ఓ.ను ఆదేశించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్.టి.సి. బస్సులు ఏర్పాటు చేయాలని, బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా అవసరమైన వాహనాలు, రవాణా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల బయట పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్, జనసమూహ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా, పకడ్బందీగా విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ. నిర్మల, డి.ఎస్.పి. (ఎస్.బి.) రమణా రెడ్డి,నగరపాలక సంస్థ కమిషనర్ ఏ రామానుజుల రెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కోతుల దాడిలో మహిళకు గాయాలు



**ఊర్కొండ, ఆగస్ట్ 24 (జనం సాక్షి) :** కోతుల దాడిలో మహిళకు గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా ఉరుకొండ మండలం రేవెల్లి గ్రామానికి చెందిన గడ్డంపల్లి నారాయణమ్మ పై ఆదివారం రాత్రి కోతులు దాడి చేశాయి. ఆమె ఇంటి వద్ద ఉన్న క్రమంలో గుంపులుగా వచ్చిన కోతులు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో ఆమెకు రెండు చేతుల మణికట్లకు తీవ్ర గాయాలయ్యాయి, కాలు విరిగింది. తీవ్రంగా గాయపడిన నారాయణమ్మను గ్రామస్తులు వెంటనే హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. కొంతకాలంగా రేవెల్లి గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, పిల్లలు, వృద్ధులు బయట తిరగాలంటేనే భయపడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కోతుల బెడద నుంచి గ్రామాన్ని కాపాడాలని, అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## చెంగిచెర్లలో ఘోర రోడ్డు ప్రమాదం

- స్కూటీపై వెళ్తున్న వ్యక్తి మృతి




**బోడుప్పల్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** చెంగిచెర్లలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెంగిచెర్లకు చెందిన గ్యార హరిబాబు (సుమారు) సోమవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో యాక్టివా స్కూటీ (టీఎస్08జేపీ5214)పై చెంగిచెర్ల మండి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో మండి వైపు నుంచి వస్తున్న లారీ (ఎమ్ఎచ్40డిసి5959) డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న హరిబాబు స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హరిబాబు రోడ్డుపై పడిపోగా, లారీ వెనుక టైర్ అతని తలపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని తదుపరి చర్యల నిమిత్తం తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై దర్యాప్తు చేపట్టారు.

# తల్లిదండ్రుల హత్య కేసు నిందితురాలి ఆత్మహత్య

**సంగారెడ్డి, ఆగస్టు 24 (జనం సాక్షి) :** తల్లిదండ్రులను మత్తు ఇంజెక్షన్ ఇచ్చి హత్య చేసిన కేసులో నిందితురాలిగా ఉన్న యువతి సురేఖ (25) సంగారెడ్డిలో ఆత్మహత్యకు పాల్పడింది. జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన కొద్దిరోజులకే ఈ ఘటన చోటుచేసుకుంది. వికారాబాద్ జిల్లా బట్వారం మండలం యాచారం గ్రామానికి చెందిన సురేఖ ఎన్ఐటీ చేసి సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ప్రేమ వివాహానికి తల్లిదండ్రులు లక్ష్మీ, దశరథం నిరాకరించడంతో ఈ ఏడాది జనవరిలో వారికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చి హత్య చేసినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో ఆమెను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. జూలై 31న బెయిల్‌పై విడుదలైన సురేఖ సొంతూరికి వెళ్లకుండా సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఆగస్టు 23న రాత్రి మత్తు ఇంజెక్షన్ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. చేసిన నేరంపై మనోవేదనతోనే ఈ నిర్ణయం



తీసుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతురాలి సోదరుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాము నాయుడు తెలిపారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి

- విద్యార్థులకు వసతులపై చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆరా
- పాఠశాల ఆవరణలో చెత్తపై ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం

**కల్వకుర్తి, ఆగస్టు 24 (జనంసాక్షి) :** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని జేపీ నగర్ వద్ద ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అనే విషయాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందడం లేదని విద్యార్థులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో విషయాన్ని ఉన్నతాధికారి ఆర్‌సీఓకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. పాఠశాల ఆవరణలో చెత్త పేరుకుపోయినప్పటికీ స్థానిక కౌన్సిలర్,మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఎందుకు ఇవ్వలేదని చైర్‌పర్సన్ ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం



చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్కౌన్సిలర్లు హుమ్లి హన్మ నాయక్,కుడుముల అక్షిత,చంద్రకాంత్ రెడ్డి,పడకంటి వెంకటేష్,దున్న సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో నీటి సరఫరా సమయం పెంచాలి

**రాజేంద్రనగర్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** మణికొండ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు మంచినీటి సరఫరా సమయాన్ని పెంచాలని కోరుతూ స్థానిక నాయకులతో కలిసి మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ డీజీఎం వెంకటేశ్వర్లును కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కాలనీలకు అందుతున్న నీటి సరఫరా సమయం ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని, వేసవి సహా ఇతర సమయాల్లో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలకు సమయపాలనతో పాటు సరిపడా మంచినీరు అందేలా సరఫరా సమయాన్ని పెంచాలని కోరారు. ముఖ్యంగా పెరుగుతున్న జనాభా, కాలనీల విస్తరణకు అనుగుణంగా నీటి సరఫరాలో మెరుగైన చర్యలు చేపట్టాలని డీజీఎంను కోరారు. నాయకుల విజ్ఞప్తిపై స్పందించిన డీజీఎం వెంకటేశ్వర్లు, మణికొండ డివిజన్‌లో మంచినీటి సరఫరా సమయాన్ని అత్యవసరంగా పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో సరిపడా మంచినీరు అందేలా



చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మణికొండ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజర్ మాజిద్, మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణ రెడ్డి, మణికొండ మాజీ సర్పంచ్ యానాల నరేశ్, మాజీ కౌన్సిలర్ రవికాంత్ రెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, నాయకులు మధుసూదన్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఎస్ కాల్వకు తక్షణమే నీటిని విడుదల చేయాలి



**గద్వాల, ఆగస్టు 24 (జనం సాక్షి) :** ఆర్డీఎస్ కాల్వకు తక్షణమే నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు ప్రభుత్వాన్ని కోరారు. గద్వాల్ కలెక్టరేట్ కు చేరుకుని తమ సమస్యలపై అదనపు కలెక్టర్ మధుమోహన్ రావుకు వినతిపత్రం అందజేశారు. వరి, పత్తి పొలాలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాల్వకు నీరు విడుదల చేయకపోతే పంట పూర్తిగా చేతికందక ఇబ్బందులు పడతామన్నారు. వెంటనే నీటిని విడుదల చేయాలని వేడుకున్నారు. రైతుల విజ్ఞప్తిపై అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## బీజేపీ పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

- ఎమ్మెల్సీ అంజిరెడ్డి



**పెద్దశంకరంపేట్, ఆగస్టు 24 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాలలో భారతీయ జనతా పార్టీ పటిష్టత కోసం జిల్లా ఓబీసీ నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి. సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి లు పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు గుణ విట్టల్ ఆధ్వర్యంలో నూతన ఓబిసి జిల్లా బాధ్యులు ఎమ్మెల్సీ అంజిరెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఓబీసీ జిల్లా నూతన కార్యవర్గాన్ని వారు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఓబీసీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని సూచించారు.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ బాధ్యులు అశోక్. సగనాకర్. శ్రీనివాస్ మల్లేశం అంబదాస్ శ్రీనాథ్ పండరి రాములు తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 97ను రద్దు చేయాలి

- యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా
- అదనపు కలెక్టర్‌కు వినతి

**సంగారెడ్డి, ఆగస్టు 24 (జనం సాక్షి) :** పాలిటెక్నిక్ విద్యార్థుల ను విలీనం చేస్తూ తెచ్చిన 97 జీవోను రద్దు చేయాలని శక్తి పథకాన్ని రద్దు చేస్తూ పాలిటెక్నిక్ విధానాన్ని కొనసాగించాలని యు ఎస్ ఎఫ్ ఐ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్‌కి వినతిపత్రం ఈ సందర్భంగా యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాలిటెక్నిక్ విధానాన్ని రద్దు చేస్తూ తీసుకొచ్చిన జీవో నెంబర్ 97 రద్దు చేయాలని శక్తి పథకాన్ని రూపుమాపాలని యధావిధిగా పాలిటెక్నిక్ విధానాన్ని కొనసాగించాలని అన్నారు. దీనివల్ల పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థులు నష్టపోతున్నారు అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటానికి సంపూర్ణ మద్దతుగా నిలుస్తామన్నారు. ఇప్పటికైనా శక్తి పథకాన్ని రూపుమాపుతూ 97 జీవోను రద్దు చేయాలి. పాలిటెక్నిక్ స్వయం ప్రతిపత్తిని కాపాడాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి పాలిటెక్నిక్ కళాశాలలో అనేక సమస్యలు ముందుకొస్తున్న వాటిని పరిష్కారం చేయాల్సిన పాలక ప్రభుత్వాలు వాటిని నీది కార్చేదానికి కొత్త



పథకాలను తీసుకువస్తూ విద్యార్థులను చదువుల నుండి దూరం చేసి ఎటువంటి కుట్ర సరైనది కాదన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు దారి తీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రశాంత్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, జిల్లా అధ్యక్షులు సందీప్ ఉపాధ్యక్షులు అనిల్ గర్ల్స్ కన్వీనర్ తులసి, కో కన్వీనర్ రుక్మిణి, జిల్లా కమిటీ సభ్యులు సిద్ధూ,సుదర్శన్, ధరణి, రేణుక, శ్రీలత, ప్రియాంక, పల్లవి, సాహితీ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి కృషి

- క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభానికి ఏర్పాట్లపై సమీక్ష
- ఆకస్మికంగా పరిశీలించిన వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**మెదక్ బ్యూరో, ఆగస్టు 24 (జనం సాక్షి) :** మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. జిల్లా కేంద్రంలోని నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ను సోమవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌తో కలిసి మంత్రి ఆకస్మికంగా పరిశీలించారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీతాదేవి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నితిన్ కబ్రా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ శివదయాళ్‌తో పాటు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

### రేపు ఉన్నతస్థాయి సమావేశం

క్రిటికల్ కేర్ బ్లాక్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన వైద్య సిబ్బంది నియామకం, పరికరాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, సమగ్ర ఆర్థిక నిర్వహణ సేవలను అందుబాటులోకి తీసుకురావడంపై మంత్రి అధికారులతో చర్చించారు. ఇందుకు సంబంధించి రేపు ఆగస్టు 25న హైదరాబాద్ సచివాలయంలో



నిర్వహించే ఉన్నతస్థాయి సమావేశానికి సంబంధిత అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.

### వైద్య సేవలపై విస్తృతంగా చర్చ

మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేయడం, నూతన ఆసుపత్రి భవన నిర్మాణం, వైద్య కళాశాల విద్యార్థులకు వసతి గృహాల నిర్మాణంపై మంత్రి సమీక్షించారు. తూప్రాన్‌లో అత్యవసర ప్రమాద చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలోని నర్సాపూర్, రామాయంపేట, కౌడిపల్లి, తూప్రాన్ ప్రాంతాల్లో మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న రక్తశుద్ధి సేవలపై కూడా మంత్రి అధికారులతో చర్చించారు. జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవలను మరింత పటిష్టం చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.




# చిరుతను చంపి.. చర్మం, గోర్లతో దందా! నలుగురు అరెస్ట్

- విక్రయానికి యత్నిస్తుండగా బూర్గంపహాడ్ పోలీసుల పట్టివేత
- చిరుతను చంపి చర్మం, గోర్లు సేకరించినట్లు నిందితుల అంగీకారం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్ రాజు

**బూర్గంపహాడ్ ఆగస్టు 24 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చిరుతపులి చర్మం, గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన నలుగురు వ్యక్తులను బూర్గంపహాడ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక చిరుతపులి చర్మం, 17 గోర్లు, వాటిని తరలించేందుకు ఉపయోగించిన చిన్న బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు బూర్గంపహాడ్ ఎస్ ఐ ఈ నాగబిక్షం, టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం తాళ్లగొమ్మూరు గ్రామంలోని చల్లా అనిల్‌కుమార్ ఇంటి వద్ద అనుమానాస్పదంగా చిన్న బ్యాగ్‌తో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు.




విచారణలో నిందితులు గత ఏడాది వేసవిలో చింతూరు మండలం గమ్మలకోట సమీప అటవీ ప్రాంతంలో గుంతలో పడి బయటకు రాలేని స్థితిలో ఉన్న చిరుతపులిని రాళ్లు, కర్రలతో కొట్టి, బాణాలు విసిరి చంపినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం చిరుత చర్మాన్ని తొలగించి ఎండబెట్టడంతో పాటు గోర్లను భద్రపరిచినట్లు పేర్కొన్నారు. చిరుత చర్మం, గోర్లను విక్రయించి డబ్బు సంపాదించేందుకు ప్రయత్నించిన నిందితులు.. సారపాకకు చెందిన చల్లా అనిల్‌కుమార్‌ను సంప్రదించినట్లు పోలీసులు తెలిపారు. కొనుగోలుదారులను సంప్రదించి విక్రయానికి సహకరిస్తానని అనిల్‌కుమార్ చెప్పడంతో కుంజ భద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్య చిరుత చర్మం, గోర్లను బ్యాగ్‌లో పెట్టుకుని తాళ్లగొమ్మూరుకు వచ్చారు. విక్రయానికి ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు వారిని పట్టుకున్నట్లు జిల్లా ఎస్ పి రోహిత్ రాజు వెల్లడించారు. అరెస్టైన నిందితులు బూర్గంపహాడ్ మండలం తాళ్లగొమ్మూరు గ్రామానికి చెందిన చల్లా అనిల్‌కుమార్, ఆంధ్రాలోని చింతూరు మండలం కమ్మలకోట గ్రామానికి చెందిన కుంజ భద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్య లను అదుపులోకి తీసుకోవటంతో పాటు ఒక ఎండిన చిరుతపులి చర్మం, 17 చిరుత గోర్లు, ఒక చిన్న బ్యాగ్ ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి రోహిత్ రాజ్ వెల్లడించారు. ఈ దాడిలో పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్‌కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, టాస్క్‌ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్సైలు నాగబిక్షం, ప్రవీణ్, సుమంత్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రమాదకరంగా ఉన్నవాటిని గుర్తించి తొలగిస్తున్నాం


- ముప్పు తప్పించేందుకు చర్యలు తప్పవన్న హైడ్రా కమిషనర్
- సీఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలిన

**హైదరాబాద్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** ఎప్పుడు ఏ భవనం కూలిపోతుందో తెలియని పరిస్థితి. ప్రాణ నష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాల్సినసరం ఉంది. ఈ క్రమంలోనే అంజయ్యనగర్లోని ప్రమాదకర భవనాలను గుర్తించి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం- అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు.




కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ తో కలిసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో సోమవారం పర్యటించి ప్రమాదకర భవనాల తొలగింపు పనులను పరిశీలించారు. శేరిలింగంపల్లి మండలం అంజయ్యనగర్‌లో శనివారం 7 అంతస్తుల భవనం కుప్పకూలిపోగా.. పక్కనే ఉన్న మరో 7 అంతస్తుల భవనం ప్రమాదకరంగా మారింది. సీఎంసీ - హైడ్రా సంయుక్తాధ్వర్యంలో దెబ్బతిన్న భవనం తొలగింపు పనులను ఆదివారం చేపట్టింది. సోమవారం కూడా ఈ పనులను కొనసాగిస్తోంది. పక్కనే మరి కొన్ని భవనాలు కూడా ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు సీఎంసీ - హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో.. వాటిని కూడా పరిశీలించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వరద కాలువను కొంత మేర కబ్జా చేసి 50 గజాల స్థలాల్లో ఏడెనిమిది అంతస్తులు నిర్మించడంతోనే ఆ భవనాల పటిష్టత దెబ్బతినిందని హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు. 50 గజాల స్థలంలో రెండు అంతస్తులకు అనుమతులు తీసుకుని పిల్లర్లు, పునాదులు ఆ మేరకే వేసి.. ఆ పైన 7 అంతస్తుల భవనాలు కట్టడంతో సామర్థ్యం సరిపోని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అనుమతులు లేకుండా.. నిబంధనలను పట్టించుకోకుండా నిర్మించిన భవనాలతో పక్కనే ఉన్న కట్టడాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పక్కనే ఉన్న అపార్టుమెంట్లు, భవనాలకు ఎలాంటి ముప్పు లేకుండా దెబ్బతిన్న భవనాల తొలగింపులో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. దీంతో భవనం తొలగింపు పనుల్లో జాప్యం జరుగుతోందని.. ముందస్తుగా అందరిణీ ఖాళీ చేయించడం కూడా జరిగిందని మీడియాకు వివరించారు.










## నారీ శక్తికి ప్రతిరూపంగా చేనేత చీర

### ఐడీఓసీలో మహిళల విజయగాథలపై నేసిన వినూత్న చీర ప్రదర్శన

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 24 (జనం సాక్షి):** నారీ శక్తికి ప్రతిరూపంగా, దేశ మహిళల విజయాలను ప్రతిబింబించేలా చేనేత కళాకారులు రూపొందించిన వినూత్న చీరను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రదర్శనకు ఏర్పాటు చేశారు. ఐడీఓసీ ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన ఈ చీరతో పాటు ప్రభుత్వ పథకాలు, శాఖల వివరాలను ప్రసారం చేసేందుకు సందర్శకులు, చిన్నారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టెలివిజన్‌ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మహిళా సాధికారతతో పాటు దేశ మహిళల విజయాలను స్థానిక చేనేత ప్రతిభకు అద్దం పట్టేలా చీరపై నేయడం అభినందనీయమన్నారు. మహిళల ప్రతిభ, ధైర్యం, విజయాలను సమాజానికి చాటిచెప్పేలా ఈ చీరను రూపొందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు, ఇతర ముఖ్యమైన సమాచారాన్ని ప్రసారం చేసేందుకు సందర్శకులు, చిన్నారుల సౌకర్యార్థం టెలివిజన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.










Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370